బిజినెస్ వార్తలు, ఆర్థిక సందేహాల నివృత్తికై
సిరి
www.eenadusiri.net

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 7-6-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 సంచిక 298

రూ. 6-50. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆన్‌లైన్‌లో నగదు బదిలీ ఉచితం

- ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌పై వారంలో ఆదేశాలు
- ఈ ప్రయోజనాన్ని ఖాతాదార్లకు బ్యాంకులు బదిలీ చేయాలి: ఆర్‌బీఐ

దిల్లీ: ఆన్‌లైన్‌లో నగదు బదిలీకి (ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జరిపే లావాదేవీలపై) ప్రస్తుతం విధిస్తున్న ఛార్జీలను తొలగించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ద్వారా జరిగే లావాదేవీలకు బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ కనీస ఛార్జీలను వసూలు చేస్తుంటుంది. ఈ ఛార్జీలను తిరిగి బ్యాంకులు విని యోగదారుల నుంచి వసూలు చేస్తాయి. ...మిగతా 2లో

- నెఫ్ట్‌ద్వారా ఎంత నగదు బదిలీ చేయవచ్చు: రూ. 2 లక్షల వరకు
- నెఫ్ట్ ఛార్జీలు: రూ. 1 నుంచి రూ. 5
- ఆర్‌టీజీఎస్ ద్వారా ఎంత నగదు బదిలీ చేయవచ్చు: ఎంతైనా
- ఆర్‌టీజీఎస్ ఛార్జీలు: రూ. 5 నుంచి 50

(ఈ ఛార్జీలు ఎస్‌బీఐ వసూలు చేసేవి. ఇవి బ్యాంకులను బట్టి కొద్దిగా మారుతుంటాయి. ఈ ఛార్జీలకు అదనంగా 18శాతం జీఎస్‌టీ వసూలు చేస్తారు.)

వడ్డీ రేట్లపై ఉదారత

రెపో రేటు పావు శాతం తగ్గింపు

నెలనెలా కిస్తీలు కట్టే రుణగ్రహీతలకు ఊరట కలిగించే నిర్ణయాన్ని ఆర్‌బీఐ తీసుకుంది. కీలక రెపో రేటును 6 శాతం నుంచి 5.75 శాతానికి తగ్గించింది. దీనివల్ల తమకు కలిగే ప్రయోజనాన్ని బ్యాంకులు ఎంతమేర ఖాతాదార్లకు బదిలీ చేస్తాయనే అంశంపై ఆధారపడి గృహ, వాహన, ఇతర రుణస్వీకర్తలపై నెలవారీ వాయిదాల భారం తగ్గుతుంది. ... వివరాలు బిజినెస్ పేజీలో

కాంగ్రెస్ ఖల్లాస్

ఆ పార్టీ శాసనసభాపక్షం తెరాస ఎల్పీలో విలీనం

శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డికి విలీన తీర్మానాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- సభాపతిని కోరిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఆమోదించిన స్పీకర్.. విలీనంపై నోటిఫికేషన్ జారీ
- ఇక ఆ పార్టీకి మిగిలింది ఆరుగురు సభ్యులే 2,6లో
- విపక్ష హోదా గల్లంతు.. మజ్లిస్‌కే ఎక్కువ సభ్యులు

సంద్ర చేరితే...

తెరాసకు నామినేటెడ్ సభ్యుడితో కలిపి 91 మంది సభ్యుల బలం ఉంది. తాజాగా 12 మంది కాంగ్రెస్ సభ్యులు కలవడంతో 103కి చేరింది. తెదేపా సభ్యుడు సంద్ర వెంకటవీరయ్య సైతం తెరాసలో చేరేందుకు నిర్ణయించుకున్నవిషయం తెలిసిందే. ఆయనతో కలిపి బలం 104కి చేరనుంది.



స్పీకర్‌ను కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీరే

సబితారెడ్డి (మహేశ్వరం) జాజుల సురేందర్ (ఎల్లారెడ్డి), రేగా కాంతారావు (పినపాక), కందాల ఉపేందర్‌రెడ్డి (పాలేరు), హరిప్రియ (ఇల్లెందు), వనమా వెంకటేశ్వరరావు (కొత్తగూడెం), చిరుమర్తి లింగయ్య (నకిరేకల్) దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (ఎల్బీనగర్), ఆత్రం సక్కు (ఆసిఫాబాద్), బీరం హర్షవర్ధన్‌రెడ్డి (కొల్లాపూర్), గంప్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి), రోహిత్‌రెడ్డి (తాండూరు).

నేడు ఎంపీపీల ఎన్నిక

తొలుత కో-ఆప్టెడ్ సభ్యులు

నేడు శిబిరాల నుంచి ఎన్నికల కేంద్రాలకు ఎంపీటీసీ సభ్యులు

ఈనాడు-హైదరాబాద్: రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 537 మండల పరిషత్‌లలో శుక్రవారం ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ఎన్నికలను చేపడతారు. మండల పరిషత్ కో-ఆప్టెడ్, అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల శిబిరాలకు తరలి వెళ్లిన ఎంపీటీసీ విజేతలంతా.. ఎన్నికలను చేపట్టే సమావేశ మందిరాలకు నేరుగా హాజరు కానున్నారు.

ఉదయం 10 గంటలకు ప్రక్రియ ప్రారంభం

ఉదయం 10 గంటలకు కో-ఆప్టెడ్ సభ్యుడి పదవి కోసం నామినేషన్లను స్వీకరిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణల క్రతువు సాగుతుంది. ఆ వెంటనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఒక్కో మండల పరిషత్‌లోను కో-ఆప్టెడ్ సభ్యుడి పదవికి చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక చేపడతారు. కేవలం ఎంపీటీసీ సభ్యులకు తప్ప ఇంకెవరికీ ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదు. కో-ఆప్టెడ్ సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి మతపరమైన లేదా భాషాపరమైన మైనార్టీ వర్గాలకు చెంది, 21 సంవత్సరాల వయస్సు నిండి, అదే మండలంలో ఓటు హక్కు కలిగి ఉండాలి. కో-ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక పూర్తయి విజేతను ప్రకటించాక.. మధ్యాహ్నం 3గం.లకు మండల పరిషత్ అధ్యక్ష పదవికి, ఆ తర్వాత ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలను నిర్వహిస్తారు.

మూడు రోజులుగా శిబిరాల్లోనే..

ఓట్లను లెక్కించి 4వ తేదీన విజేతలను ప్రకటించగానే ఆయా పార్టీలు అప్రమత్తమయ్యి తమవారు చేజారిపోకుండా వివిధ మార్గాలను అనుసరించాయి. ...మిగతా 2లో

జడ్పీ ఎన్నికల్లోనూ మండల పరిషత్ విధానమే

మండల పరిషత్ ఎన్నికల విధానాన్నే శనివారం చేపట్టే జడ్పీ ఎన్నికల్లోను అనుసరిస్తారు. ప్రతి జడ్పీలోను తొలుత ఇద్దరేసి కో-ఆప్టెడ్ సభ్యులకు ఎన్నికలను నిర్వహించి.. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను నిర్వహిస్తారు.

అసెంబ్లీ ఆవరణలో బైఠాయించిన షబ్బీర్‌అలీ, ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు

హస్తం ఆందోళన బాట

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 36 గంటల దీక్ష
- విలీనంపై హైకోర్టులో పిటిషన్ దాఖలుకు సిద్ధం
- లోక్‌పాల్‌ను కూడా ఆశ్రయించాలని నిర్ణయం
- ఇది ప్రజాస్వామ్యానికి చీకటిరోజని ఆవేదన 6లో
- అసెంబ్లీ ఆవరణలో ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు బైఠాయింపు
- కాంగ్రెస్ నేతల అరెస్టు.. ఠాణాలకు తరలింపు.. విడుదల

ఎండ.. గాలి.. వాన

- ఒక రోజులో విభిన్న వాతావరణ పరిస్థితులు
- హైదరాబాద్, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వానలు
- ఆదిలాబాద్‌లో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత 2లో

అన్నింట్లో అమిత్ షా

- కేబినెట్ కమిటీలు ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఎనిమిదింటిలో హోంమంత్రికి స్థానం 10లో

ఇదీ సంగతి!

గడచిన ఐదేళ్లలో పదకొండు లక్షల కోట్లతో రోడ్లు వేశారట తెలుసా, ఈసారి పదిహేను లక్షల కోట్ల రూపాయలతో వేస్తారట...

నిపా వైరస్..



కేరళలో ఓ విద్యార్థికి నిపా వైరస్ సోకినట్లు నిర్ధరణ కావడంతో మరోసారి కలకలం మొదలైంది. ఇది జంతువుల ద్వారా వ్యాపించే వైరస్. పండు గబ్బిలాలు, పందుల ద్వారా మనుషులకు సోకుతుంది. కలుషిత ఆహారం, మనుషుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశమూ ఉంది. 1999లో మలేసియాలోని పందుల పెంపకందార్లలో నిపా వైరస్ సోకినట్లు తొలిసారిగా గుర్తించారు. 2001లో బంగ్లాదేశ్‌లో బయటపడింది. భారత్‌లో సైతం అప్పుడప్పుడు వెలుగులోకి వస్తూనే ఉంది. గత ఏడాది కేరళలో ఈ వైరస్ బారిన పడి 17 మంది మరణించారు.

నిర్లక్ష్యంతోనే ముప్పు!

వ్యాప్తి ఎలా..

మలేసియాలో తొలిసారిగా గుర్తించినప్పుడు దాని ప్రభావం సింగపూర్‌లోనూ కనిపించింది. చాలా వరకు అనారోగ్యం పాలైన పందులను నేరుగా స్పర్శించడం, వాటి విసర్జితాలే మనుషుల్లో ఇన్‌ఫెక్షన్లకు దారితీసింది. బంగ్లాదేశ్, భారత్‌లో ఇన్‌ఫెక్షన్లకు పండ్లు, పండ్ల ఉత్పత్తులు కారణమైనట్లు గుర్తించారు. పండ్ల గబ్బిలాల మూత్రం, లాలాజలం ద్వారా కలుషితమైన పండ్ల వల్ల సమస్య తలెత్తినట్లు తేలింది. ఇన్‌ఫెక్షన్‌కు గురైన రోగులతో సన్నిహితంగా మెలిగే కుటుంబ సభ్యులకు, సంరక్షకులకు కూడా సోకే అవకాశం ఉంది. బంగ్లాదేశ్, భారత్‌లలో ఈ వైరస్ బాధితుల విసర్జితాల ప్రభావం కారణంగానే సోకినట్లు తేలింది. నిపా వైరస్ ప్రభావం ఉన్నట్లు గుర్తించిన ప్రాంతాలకు వెళ్లడం పరిహరించాలని, విస్తరించకుండా అడ్డుకోవాలని గురుగ్రామ్‌లోని పరాస్ ఆస్పత్రి వైద్యులు డా.వెంకటకృష్ణన్ సూచించారు.

లక్షణాలివీ..

- ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం నుంచి తీవ్రస్థాయి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్, ప్రాణాంతక మెదడువాపు వ్యాధి వంటివాటి దాకా తలెత్తే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.
- ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారిలో తొలిదశలో జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- తర్వాతి దశలో కళ్లు తిరగడం, మగతగా ఉండటం, మెదడువాపు వ్యాధికి సంబంధించిన నాడీ సంబంధ సంకేతాలు కనిపిస్తాయి.
- ఇన్‌ఫెక్షన్ సోకడానికి లక్షణాలు బయటికి కనిపించడానికి నాలుగు నుంచి పద్నాలుగు రోజుల వ్యవధి ఉంటుంది.
- తీవ్రస్థాయి మెదడు వాపు వ్యాధి బారినపడి, అందులో నుంచి బయటపడిన వారిలో దీర్ఘకాలంలో నాడీసంబంధ సమస్యలు కనిపిస్తుంటాయి.

చికిత్స ఎలా..

ప్రస్తుతానికైతే ఎలాంటి ఔషధాలు, టీకాలు లేవు. నిపా వైరస్‌కు టీకాలేమీ అందుబాటులో లేవని, మెదడు వాపు సమస్యకు గురైన రోగుల్లో మరణాల రేటును తగ్గించడంలో యాంటీవైరల్ ఔషధమైన రిబావైరిన్ కొంతమేర తోడ్పడుతుందని గాజియాబాద్‌లోని కొలంబియా ఆసియా ఆస్పత్రి వైద్యులు డా.దీపక్‌వర్మ పేర్కొన్నారు. తీవ్రస్థాయి శ్వాసకోశ, నాడీసంబంధ సమస్యలతో బాధపడే వారికి సంబంధిత సంరక్షణ చికిత్సలు చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

రోగ నిర్ధరణ ఇలా..

శరీర ద్రవాలతో చేపట్టే ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షతోపాటు, ఎలీసా పరీక్షతో యంటీబాడీలను గుర్తించడం ద్వారా రోగనిర్ధరణ జరుగుతుంది. పీసీఆర్, సెలకల్చర్ వంటి పరీక్షలనూ నిర్వహిస్తారు.

నివారణ ఎలా..

వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉందని అనుమానం వచ్చినప్పుడు జంతువుల పరిసరాలకు దూరంగా ఉండాలి. ఇన్‌ఫెక్షన్‌కు గురై మరణించిన జంతువుల్ని పూడ్చిపెట్టడం వంటివి జాగ్రత్తగా చేయాలి. ఇన్‌ఫెక్షన్‌కు గురైన జీవుల్ని వేరేచోటకు వెళ్లకుండా నిలువరించాలి. ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించి ముప్పు కారకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మనుషులకు సోకకుండా నివారించడమే ప్రస్తుతమున్న మార్గమని, నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదని నిపుణుల అభిప్రాయం.

- దిల్లీ

కాంగ్రెస్ ఖల్లాస్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ గల్లంతైంది. ఆ పార్టీ శాసనసభాపక్షం తెలంగాణ రాష్ట్రసమితి శాసనసభాపక్షంలో విలీనమైంది. ఈమేరకు ఆ పార్టీకి చెందిన 12 మంది శాసనసభ్యులు గురువారం మధ్యాహ్నం శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డిని కోరారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పిన ఆయన సాయంత్రానికి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శాసనసభలో కాంగ్రెస్ పక్ష హోదా కోల్పోయింది. ఆ పార్టీకి ఆరుగురు సభ్యులే మిగిలారు. వీరు సాధారణ సభ్యులుగా కొనసాగుతారు. 12 మంది సభ్యుల విలీనంతో సభలో తెరాస బలం 103కు (నామినేటెడ్ సభ్యునితో కలిపి) పెరిగింది.

కేసీఆర్ పథకాలకు ఆకర్షితులమై: మధ్యాహ్నం సభాపతిని కలిసి విలీన తీర్మానాన్ని అందజేసిన అనంతరం ఎమ్మెల్యేలు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులం కావడంతో పాటు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసమే తెరాసలో చేరుతున్నట్లు కొత్త గూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వెల్లడించారు. రాజ్యాంగపరమైన ప్రక్రియ పూర్తిచేసుకొని తెరాసలో చేరడం ఇక లాంఛనప్రాయమేనని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఇక కాంగ్రెస్‌లో మల్లు భట్టి విక్రమార్క, శ్రీదర్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి ఇంకొకరిద్దరే మిగులుతారన్నారు. తెరాసలో తమ చేరికను ప్రజలు స్వాగతించారు కనుకే ఇటీవల జరిగిన పార్లమెంట్, పరిషత్ ఎన్నికల్లో తమ నియోజకవర్గాల్లో ఏకపక్షంగా తీర్పు ఇచ్చారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేయడానికి 12 మంది ఎమ్మెల్యేలం సిద్ధంగా ఉన్నామని గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు.

పక్కా విలీన వ్యూహం: తెరాస ఎల్పీలో సీఎల్పీ విలీనం కోసం పక్కా వ్యూహంతో తెరాస సన్నద్ధమైంది. రెండు నెలల క్రితం దీనికి సంబంధించిన కార్యాచరణ మొదలైంది. శాసనసభలో కాంగ్రెస్ బలం 19 కాగా.. ఇందులో 11 మంది తెరాసలో చేరతామని గతంలోనే ప్రకటించారు. మూడింట రెండొంతుల మంది విలీనానికి అవసరం కాగా.. మరో ఇద్దరు సభ్యులు వచ్చాక విలీనం జరపాలని తెరాస భావించింది. తాజాగా నల్గొండ ఎంపీగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో తెరాస వేగం పెంచింది. గురువారం తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వచ్చి కేటీఆర్‌ను కలిశారు. దీంతో విలీనానికి అవసరమైన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు లభించింది. గురువారం మధ్యాహ్నం మొత్తం 12 మంది కేటీఆర్ నివాసానికి వచ్చారు. వారందరికీ ఆయన విందు ఇచ్చారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష విలీనం గురించి చర్చించి సీఎం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆమోదం తీసుకున్నారు. అనంతరం వారు శాసనసభ ప్రాంగణంలో సమావేశమై విలీనంపై తీర్మానం చేశారు. దీనిపై 12 మంది సభ్యులు సంతకాలు చేశారు. వారు అక్కడి నుంచి పోచారం నివాసానికి వెళ్లి ఆయనను కలిసి తీర్మానప్రతిని అందించి, విలీనాన్ని కోరారు. సభాపతి సభ్యులందరితో మాట్లాడారు. వారంతా ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు.

విలీనంపై ఉత్తర్వులు: తెరాస శాసనసభాపక్షం విలీనంపై గురువారం సాయంత్రమే ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత శాసనసభలో తెదేపా శాసనసభాపక్షం, ఆ తర్వాత కాంగ్రెస్ శాసనమండలి పక్షం ఇలాగే తెరాసలో విలీనమయ్యాయి. ఇదే వ్యూహంతో తాజాగా తెరాస, కాంగ్రెస్ అసమ్మతి వర్గం ముందుకెళ్లినట్లు తెలుస్తోంది.

విపక్ష హోదా గల్లంతు: విలీనం పూర్తికావడంతో కాంగ్రెస్ శాసనసభలో విపక్షహోదా కోల్పోయింది. సభలో మొత్తం బలంలో పదోవంతు సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా దక్కుతుంది. 120 మంది సభ్యులు ఉన్న శాసనసభలో 12 మంది సభ్యులు కావాలి. కాంగ్రెస్‌కు అరుగురు సభ్యులే మిగలడంతో విపక్షహోదా గల్లంతయింది. విలీనం తర్వాత కాంగ్రెస్ కంటే మజ్లిస్ బలమే (7) ఎక్కువగా ఉండడం విశేషం.

నార్మండీలో డీ-డే సందడి!

డీ-డేకు 75 వసంతాలు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఫ్రాన్స్‌లోని నార్మండీలో ఉన్న అరొమాంచెస్ తీరంలో ప్రదర్శనకు ఉంచిన రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి వాహనాల దగ్గర సందర్శకుల సందడి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ నాజీల ఆక్రమణలో ఉన్న ఫ్రాన్స్ భూభాగంలోని నార్మండీకి స్వేచ్ఛ కల్పించేందుకు జూన్ 6, 1944 నాడు చరిత్రలోనే అతిపెద్ద సముద్రమార్గ దాడి జరిగింది. దీనికి ఆపరేషన్ నెప్ట్యూన్ అని పేరు పెట్టారు. దానినే డీ-డేగానూ పిలుస్తున్నారు.

తగ్గిపోతున్న ఏటీఎంల సంఖ్య

- నిర్వహణ భారంతో మూసివేత

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో ఏటీఎంల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. నిర్వహణ భారంతో ఖర్చుల్ని తగ్గించుకునే ప్రక్రియలో భాగంగా వీటిని బ్యాంకులు మూసివేస్తున్నాయి. బ్యాంకుల ఆవరణలో మినహా మిగతా చోట్ల ఉన్న వాటిల్లో ఒక్కొక్కటి తొలగిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చితే 2019 మార్చి నాటికి 383 ఏటీఎంలు మూతపడ్డాయి. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ, ఆర్‌బీఐ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఏటీఎంను నిర్వహించాలంటే రోడ్డుపై వాణిజ్య స్థలం, సెక్యూరిటీ సిబ్బంది తప్పనిసరి. గతంలో అద్దెలు రూ.7వేల వరకు ఉండేవి. రెండేళ్లలో అద్దెలు రూ.15వేలకు పైగా పెరిగాయి. సెక్యూరిటీ సిబ్బంది వేతన భారం పెరగడంతో వారి సంఖ్యను కుదిస్తూ వస్తున్నారు. కొన్నిచోట్ల భద్రతా సిబ్బంది ఉండటం లేదు. ఏసీతో విద్యుత్తు బిల్లులు అధికంగా ఉంటున్నాయి. ఈనే పద్దులో వీటి నిర్వహణ నుంచి బ్యాంకులు నెమ్మదిగా వైదొలుగుతున్నాయి. కొన్ని బ్యాంకులు

ప్రైవేటు సంస్థలకు అప్పగించాయి. ప్రైవేటు ఏజెన్సీలు ఒకే స్థలంలో రెండేసి బ్యాంకుల ఏటీఎంలు లేదా ఒక వాణిజ్య, ఒక ప్రైవేటు ఏటీఎం... ఇలా నిర్వహిస్తున్నాయి.

తెలంగాణలో ఏటీఎంల వివరాలు

	2018 మార్చి	2019 మార్చి
మొత్తం	10,365	9,982
ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులవి	9,120	8,657
ప్రైవేటు సంస్థలవి	1,245	1,325

బ్యాంకుల విలీనంతో..

బ్యాంకుల విలీనం తరువాత కూడా ఏటీఎంల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకుల విలీనం తరువాత అనుబంధ బ్యాంకుల ఏటీఎంలను చాలా వరకు తొలగించారు. గతేడాది మార్చి నాటికి తెలంగాణలో ఎస్‌బీఐ 2,646 ఉంటే... ప్రస్తుతం 2,340కి పరిమితమయ్యాయి. సంఖ్య భారీగా తగ్గిన బ్యాంకుల్లో ఎస్‌బీఐది తొలిస్థానం. తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయా, దేనా బ్యాంకుల విలీనంతో కూడా సంఖ్య తగ్గుతోంది. అయితే మరోపక్క బ్యాంకింగేతర సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఏటీఎంల సంఖ్య పెరుగుతోంది.

TET 4th TM GURUKUL PAPERS I & II TGT, PGT, PET
FREE DEMO : 9-6-2019@10AM by
సుధీర్, రాంబాబు, రామ పుల్లి విజ్ఞానరావు, జానర్‌రెడ్డి & టీమ్
Gurukul మెథడ్: మ్యాథ్స్ : జతేందర్ రెడ్డి, రహీంఫైస్సల్ : వస్తుతః
తెలుగు: పింగళి నరేందర్, సైకిలాజీ: రా మోహన్‌రావు, సోషల్: జంగయ్యయాదవ్
TET + Gurukul Intensive Batch
బాసర ఇన్ఫోటెక్ 8686344155 7674883883

IAS/IPS-2020
FIRST ATTEMPTలోనే IAS ఎలా సాధించాలి? తెలుసుకోవాలంటే ఈ 3 రోజుల వర్క్‌షాప్‌కి రండి
9th, 10th & 11th June 2019 @ 10am to 5pm
Watch TV5 On 7-6-19 @ 5:30pm to interact with KP sir
Krishna Pradeep's 21st Century IAS
ASHOK NAGAR: 8686233 879
KPHB: 9502318332

ఆన్‌లైన్‌లో నగదు బదిలీ ఉచితం

(మొదటి పేజీ తరువాయి)

నగదు చెలామణీ తగ్గించడం, ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత తెచ్చేందుకు, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతో నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ రూపేణా జరిగే లావాదేవీలపై ఛార్జీలు తొలగించాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అందువల్ల బ్యాంకులు కూడా వినియోగదారులపై ఈ ఛార్జీలు విధించకూడదని, దీనికి సంబంధించి వారంలో ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది.

- ద రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్‌ను ఆర్‌టీజీఎస్ సంక్షిప్త రూపం. దీని ద్వారా ఎక్కువ మొత్తం నిధులను తక్షణమే బదిలీ చేయొచ్చు. ద నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను సంక్షిప్తంగా నెఫ్ట్ అని అంటుంటారు. రూ.2 లక్షల వరకు నగదు బదిలీకి నెఫ్ట్ మార్గాన్ని ఉపయోగించొచ్చు.
- ప్రస్తుతం నెఫ్ట్ లావాదేవీలకు రూ.1 నుంచి రూ.5, ఆర్‌టీజీఎస్ ద్వారా నగదు బదిలీకి రూ.5 నుంచి రూ.50 మధ్య స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛార్జీలు విధిస్తోంది.

ఏటీఎం ఛార్జీలపై సమీక్ష

ఏటీఎంల వాడకం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, సంబంధిత లావాదేవీలపై విధిస్తున్న ఛార్జీలను సమీక్షించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటవుతుందని తెలిపింది. తొలి సమావేశం జరిగిన రోజు నుంచి రెండు నెలల్లోగా కమిటీ నివేదికను సమర్పించే అవకాశం ఉందని ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంత దాస్ చెప్పారు. కమిటీలో ఎవరెవరు ఉంటారు, పరిగణనలోకి తీసుకునే అంశాలేమిటి తదితరాలకు సంబంధించిన వివరాలను వారం రోజుల్లోగా విడుదల చేస్తామని పేర్కొంది.

ఐదేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా పెరిగిన భారత్ పరపతి

- విదేశీ వ్యవహారాల మంత్రి జయ్‌శంకర్

దిల్లీ: గత ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా మనదేశం స్థాయి, పరపతి పెరిగాయని చాలామంది భారతీయులు గుర్తించారని భారత విదేశీ వ్యవహారాల మంత్రి జయ్‌శంకర్ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడానికి ఇది కూడా కారణమైందన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), అనంత సెంటర్ నిర్వహించిన గ్రోత్‌నెట్ సదస్సు 7.0లో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఘనసంతులనం(రీబ్యాలెన్సింగ్) జరుగుతోందని.. వైనాయే అందుకు గొప్ప నిదర్శనమన్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధానం నిర్వహణకు ఇటీవలి ఎన్నికలు విశ్వాసతీర్మానంలాంటివని అభివర్ణించారు. విదేశాల్లో భారతీయ కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలపై గట్టిగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం భారీగా పెరగాలన్నారు.

ఎండ.. గాలి.. వాన

- ఒక రోజులో విభిన్న వాతావరణ పరిస్థితులు
- హైదరాబాద్, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వానలు
- ఆదిలాబాద్‌లో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత

ఈనాడు, హైదరాబాద్: మధ్యాహ్నం వరకు ఎండను తట్టుకోలేక అల్లాడిన జనం.. సాయంత్రానికి వాతావరణం చల్లబడిందని ఊపిరి పీల్చుకునే లోపే ఈదురుగాలులు భయపెడుతున్నాయి. ఉరుములు, పిడుగుపాటు ప్రజల్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నచోట గాలి వేడెక్కి.. సాయంత్రానికి క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి ఒక్కసారిగా కుండపోత వర్షం కురుస్తోంది. కొద్ది రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న ఈ తరహా విభిన్న పరిస్థితులు గురువారం కూడా కొనసాగాయి.

రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో గురువారం ఎండల తీవ్రత కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠంగా 46.3, నిజామాబాద్- 43.3, ఇదే జిల్లాలోని మోర్తాడు, ముగ్పల్ మండలాల్లో 46, 45.8, రామగుండంలో 44.2, ఖమ్మం-43, హైదరాబాద్-41.8, జగిత్యాల జిల్లా కోరుట్ల, వెల్గటూరు మండలాల్లో 46, 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో జనం అల్లాడగా.. సాయంత్రానికి వాతావరణం మారింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 63 మి.మీటర్ల వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేటలో 56.3, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో 46.3, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం చుండుపట్ల, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరిసినగండ్లలో 42.5 మి.మీ వర్షం కురిసింది. నారాయణపేట, నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో అనేక చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షానికితోడు ఈదురుగాలులు వీయడంతో చెట్లు విరిగి రహదారులపై పడ్డాయి. హైదరాబాద్ నగరంలో కురిసిన వర్షానికి వరద రహదారులను ముంచెత్తింది. చాలా ప్రాంతాల్లో రోడ్లపై బారికేడ్లు కొట్టుకొచ్చాయి. ట్రాఫిక్ స్తంభించి రవాణా వ్యవస్థకు కొద్దిసేపు అంతరాయం కలిగింది.

నేడు, రేపు వడగాడ్పులు

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లోనూ కొన్ని చోట్ల భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ (టీఎస్‌డీపీఎస్) పేర్కొంది. సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని సూచించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షంకురిసే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది.

గొడమలి గొర్రెల కాపరి మృతి

యాదగిరిగుట్ట పట్టణం, కాలిగోరం, న్యూస్ టుడే: యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లిలో వర్షానికి కోళ్లపాం షెడ్డు కూలింది. అక్కడే ఉన్న గొర్రెల కాపరి శ్రీను(37) మృతిచెందాడు. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం అడూరు గ్రామానికి చెందిన తుర్పాటి యాదగిరి ఇంటిపై గురువారం రాత్రి పిడుగు పడింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

నేడు ఎంపీపీల ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

రెండు పార్టీలకు ఎంపీటీసీ సభ్యులు సమానంగానో.. కొంచెం అటు ఇటుగానో ఉన్న చోట తమ వారిని నేతలు విహార యాత్ర పేరుతో శిబిరాలకు తరలించారు. ప్రత్యర్థులకు అసలు మాట్లాడే అవకాశం కూడా లేకుండా.. సెల్‌ఫోన్లను సైతం దూరంగా ఉంచారు. ఇరు పార్టీలకు సభ్యులు సమాన సంఖ్యలో ఉన్నచోట్ల స్వతంత్రులకు విపరీతమైన ప్రాధాన్యం ఏర్పడింది. వీరికి విప్ అంటూ ఏదీ వర్తించదు కాబట్టి కొందరు రాత్రికిరాత్రే పార్టీల పంచన చేరారు. సంగారెడ్డి రూరల్ మండలంలో కాంగ్రెస్, తెరాసకు ఎంపీటీసీలు సమాన సంఖ్యలో గెలవగా.. అక్కడి స్వతంత్ర సభ్యుడిని కాంగ్రెస్ వారు తమ వైపు తిప్పుకోగలిగారు. కొన్నిచోట్ల తెరాస రెబల్స్ స్వతంత్రులుగా గెలవటంతో వారు తిరిగి పార్టీ అభ్యర్థులకు ఓటు వేసేలా జిల్లా నాయకత్వాలు పావులు కదుపుతున్నాయి.

సునాయాసంగా గెలిచే అవకాశాలున్నా అక్కడక్కడా తలనొప్పులు: మండల పరిషత్ పదవులను సునాయాసంగా గెలుచుకొనే అవకాశాలున్నా పార్టీలకు కొన్ని చోట్ల తలనొప్పులు ఎదురవుతున్నాయి. విజేతల్లో.. అయా రిజర్వేషన్లు అనుకూలించిన వారు ఎక్కువగా ఉండటంతో వారిలో పోటీ పెరిగింది. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో తెరాసకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ అక్కడ ఆదే పార్టీకి చెందిన నలుగురు అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. పలు చోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఇటువంటి ఆశావహుల నుంచి అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులు ఎవరికేది పార్టీ నాయకులు శుక్రవారం తెలియజేసే.. విప్ జారీ చేసినట్లుగా ప్రకటిస్తారు. దీంతో పదవులను ఆశించి భంగపడినా.. వారంతా పార్టీ చెప్పిన అభ్యర్థికి అనుకూలంగా చేతులను ఎత్తక తప్పదు. మండలాల్లో చక్రం తిప్పాలని కలలుకని.. రిజర్వేషన్లు అనుకూలించక డీలా పడ్డవారు ఉపాధ్యక్ష పదవులను చేపట్టాలని భావిస్తున్నారు. దీంతో కొన్ని చోట్ల ఉపాధ్యక్ష పదవులకూ బాగా పోటీ ఏర్పడింది. కొన్ని మండలాలు బాగా చిన్నవిగా ఉండటంతో అక్కడి ఎన్నిక లాంచనంగానే ఉండనుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో ముగ్గురే ఎంపీటీసీలు ఉండగా వారిలో ఇద్దరు అధికార పార్టీకి, ఒకరు కాంగ్రెస్‌కు చెందినవారు. దీంతో అధికారపార్టీకి చెందిన ఒకరు అధ్యక్షులుగాను, మరొకరు ఉపాధ్యక్షులుగాను ఎన్నికవుతారు.

ఇది గీటురాయి!

'వినమ్రత' అనేది మనం కావాలని పనిగట్టుకుని పాటించగలిగే గుణం కాదు. కానీ తనలో 'అహింస' భావాలు బలంగా ఉన్న వ్యక్తికి అది సహజంగానే స్వభావంలో భాగమైపోతుంది. అందుకే వినయం, నమ్రత అనేవి అహింసకు గీటురాయిగా నిలుస్తాయి.

- మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

7-6-2019 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
తిథి: ఉ. 9.32 తదుపరి పంచమి
నక్షత్రం: రా. 9.08 తదుపరి ఆశ్లేష
అమృతఘడియలు: మ. 3.06 నుంచి 4.36 వరకు
వర్జం: ఉ. 6.02 నుంచి 7.33 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.04 నుంచి 8.55 తిరిగి మ. 12.23 నుంచి 1.15 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6.26

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	43.8	26.2
తిరుపతి	43.5	29.6
సూర్యాపేట	43.0	34.0
గుంటూరు	42.4	30.1
మహబూబ్‌నగర్	42.0	29.1
హైదరాబాద్	41.8	30.7
హన్మకొండ	40.6	26.0
కరీంనగర్	40.0	28.0
విజయవాడ	39.6	29.3
విశాఖపట్నం	34.2	29.0

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY KAKINADA
KAKINADA - 533 003, AP, INDIA
ADMISSION NOTIFICATION
Advt No.JNTUK/International Collaborative Program/Admns/1/2019, Dt. 06.06.2019
Applications are invited for admissions into JNTUK-BTH 6 years International Collaborative Program (3+1+2) with exit option awarding of 4-Year B.Tech degree by JNTUK, India in collaboration with Blekinge Institute of Technology (BTH), Sweden, for the academic year 2019-20. Application forms and other details can be downloaded from JNTUK Kakinada website http://www.jntuk.edu.in Filled in application form with required certificates and application fee of Rs.1500/- payable through SBI collect in favour of REGISTRAR JNTU Kakinada Admissions, should reach *"The Director, Admissions, JNTUK, Kakinada-533 003" on or before 22.06.2019.*
Sd/- REGISTRAR

శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమి విజయవాడ
మీ భవిష్యత్తుకు మా భరోసా...!
NEET-2019 ఫలితాలలో అతి సాధారణ విద్యార్థులతో "శ్రీ భవిష్య" ప్రభంజనం
ALL INDIA RANK 76 — 631 MARKS, 616 MARKS, 613 MARKS, 606 MARKS, 605 MARKS
600 మార్కులుపైన - 5 | 550 మార్కులుపైన - 39
500 మార్కులుపైన - 137 | 450 మార్కులుపైన - 232
మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కలదు
సెక్షన్‌కి 40 మంది విద్యార్థులు మాత్రమే
NEET-2020 LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి.
1st బ్యాచ్ క్లాసులు ది.12-06-2019 నుండి ప్రారంభం
Sr. LECTURERలచే DOUBTS CLARIFICATION
SPECIAL FOCUS ON PHYSICS MARKS (Highest Percentile 99.8 NEET-2019)
NEET 2019-20 LONG TERM FEE CONCESSION

NEET-2019 Marks	>480	465-479	450-464	435-449	420-434	400-419	370-399
% of Concession	90%	75%	60%	50%	40%	25%	15%

91332 78624, 91332 78617, 91332 78628

హింసా రాజకీయాలతో అడ్డుకోలేరు

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- తెలంగాణను మరో బెంగాల్ కానివ్వబోమని వ్యాఖ్య

ఆస్పత్రిలో వరలక్ష్మిని పరామర్శిస్తున్న లక్ష్మణ్, తదితరులు

మహబూబ్‌నగర్, ఈనాడు డిజిటల్, దేవరకద్ర, న్యూస్‌టుడే: తెలంగాణలో బాజపా ఎదుగుదలను జీర్ణించుకోలేకనే తెరాస హింసా రాజకీయాలకు తెర లేపింది బాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. అధికార పార్టీ నేతలు అభద్రతాభావంతోనే బాజపా కార్యకర్తలపై హత్యలు, దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా అనదేవరకద్ర మండలం డోకూరులో బాజపా కార్యకర్త ప్రేమ్‌కుమార్ హత్య ఇందుకు నిదర్శనమన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మహదేపేట జిల్లాలో తమ పార్టీ మహిళా కార్యకర్తలపై దాడులు జరిగాయని అన్నారు. డోకూరులో హత్యకు గురైన ప్రేమ్‌కుమార్ కుటుంబాన్ని, జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీటీసీ అభ్యర్థి వరలక్ష్మిని గురువారం లక్ష్మణ్ పరామర్శించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బాటలోనే కేసీఆర్ నడుస్తున్నారని దుయ్యబట్టిన ఆయన.. తెలంగాణను మరో బెంగాల్‌గా మారుస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో భాజపాను అడ్డుకోలేరని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న కేసీఆర్, కొన్ని మీడియా సంస్థలను చెప్పుచేతుల్లో ఉంచుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. మాజీ మంత్రి డీకే అరుణ మాట్లాడుతూ.. జిల్లాలోని రామచంద్రాపురంలో మృతిచెందిన అనసూయ కేసులో అమాయకులపై కేసులు పెట్టేలా జిల్లా మంత్రి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

డోకూర్ సంఘటనపై కిషన్‌రెడ్డి ఆరా

డోకూర్ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరా తీశారు. ప్రేమ్‌కుమార్ హత్య పూర్వాపరాలను డోకూర్ ఎంపీటీసీగా ఎన్నికైన యజ్ఞభూపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నేరగాళ్లను కఠినంగా శిక్షించాలంటూ హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ, డీఐజీ మహేందర్‌రెడ్డికు సూచించినట్లు చెప్పారు.

హోమంలో పాల్గొన్న హుస్సేన్, చాంద్ బీ

హోమం పీటలపై ముస్లిం జంట

న్యూస్‌టుడే, దేవరకల్: మహబూబాబాద్ జిల్లా దేవరకల్ మండలం ముత్కులపల్లికి చెందిన ముస్లిం దంపతులు మత సామరస్యాన్ని చాటారు. గ్రామంలో గురువారం నూతనంగా నెలకొన్న కోదండ రామ ఆలయ ప్రాంగణంలోని విగ్రహ స్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు. మూలమంత్ర హోమం వద్ద ఇతర జంటలతో పాటు షేక్ సయ్యద్ హుస్సేన్, చాంద్ బీ పీటలపై కూర్చుని వ్రతువు నిర్వహించారు. సీతమ్మకు బంగారు పుస్తెలు చేయించారు. అమ్మవారికి, రామలక్ష్మణులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత పటిష్ఠం చేయండి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్‌ల వద్ద పట్టాలు దాటేవారికి భద్రత గురించి అవగాహన కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ గజానన్ మాల్య సూచించారు. ఇంటర్నేషనల్ లెవల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే సందర్భంగా గురువారం జోనల్‌స్థాయి ఉన్నతాధికారులు, అన్ని డివిజన్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సబ్‌వే లు, రోడ్డు, బ్రిడ్జిలను నిర్మిస్తూ లెవల్ క్రాసింగ్ గేట్లను అంచెలంచెలుగా తొలగించాలని ఆదేశించారు.

Admission Guidance
India, Nepal, Central America
MBBS, BDS
BVSc, Agi. B.Sc.
9440178283/9121317836

శాస్త్రీయ సమాజ నిర్మాణం అవసరం

- కమ్యూనిస్టులదే కీలక భూమిక
- చంద్ర రాజేశ్వరరావు జయంతి సభలో పాత్రికేయులు కె.శ్రీనివాస్

'సాహస పరిశోధక దంపతులు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, సురవరం, సీనియర్ పాత్రికేయుడు కె. శ్రీనివాస్, నారాయణ

మియాపూర్, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో దివంగత చంద్ర రాజేశ్వరరావు అగ్రగణ్యులని సీనియర్ పాత్రికేయుడు కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం జరిగిన చంద్ర రాజేశ్వరరావు 105వ జయంతి కార్యక్రమంలో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కమ్యూనిస్టులు కీలక భూమిక పోషించాలని, అదే రాజేశ్వరరావుకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు భావాలు ఉన్న అందరూ ఒకే వేదికపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 1985కు ముందు దేశంలో జరిగే అన్యాయాలను భారత్ అంతర్జాతీయ వేదికలపై స్పష్టంగా వ్యతిరేకించేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. తెలంగాణలో కమ్యూనిజానికి, సాయుధ పోరాటానికి చంద్ర రాజేశ్వరరావు ఆద్యులన్నారు. పీడిత ప్రజలు, రైతాంగం కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు జీవితానికి సంబంధించి పలు అంశాలతో రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత ఫౌండేషన్ ప్రాంగణంలోని చంద్ర విగ్రహంతో పాటు ఇంద్ర జిత్ గుప్త హాల్‌లో ఉన్న ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకుడు, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, డాక్టర్ రజనితో పాటు హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, వసుమతి, రామకృష్ణ, ప్రొ.వేణుగోపాల్, విజయలక్ష్మి, రాయాదేవి, ప్రజానాట్యమండలి తెలంగాణ విభాగం ప్రతినిధులు పల్లె నర్సింహ, జాకట్ తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో అభాగ్యుడి అష్టకష్టాలు

ఏజెంట్లు మోసం చేశారంటూ వాట్సాప్ వీడియో

వీడియోలో మాట్లాడుతున్న కృష్ణ

మేడిపల్లి, న్యూస్‌టుడే: వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎడారి దేశాలకు వెళ్లేవారికి కష్టాలు అస్సలిస్సే కావు. నకిలీ ఏజెంట్ల బారిన పడిన ఎందరో అభాగ్యులు నిలువునా మోసపోతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తమ కన్నీటి గాథలు వెల్లడించే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి సౌదీ అరేబియా నుంచి ఇటీవల పంపిన వీడియో వైరల్‌గా మారగా.. గురువారం జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం వల్లంపల్లికి చెందిన మరో వ్యక్తి తన కష్టాలను వీడియో రూపంలో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది కూడా వైరల్‌గా మారింది. వల్లంపల్లి నివాసి ఎల్లా కృష్ణ తాను అయిదు నెలల క్రితం సౌదీ అరేబియాకు వచ్చి.. కష్టాలు పడుతున్నట్లు వీడియోలో వివరించాడు. దమామ్‌లో గ్రాన్ హోస్ కంపెనీ క్లీనింగ్ సెక్షన్‌లోకి తనను పంపారని, కానీ మేకలకు కాపలాగా ఉంచారని ఆవేదన చెందారు. తనను లీలావతి, జీవన్‌రెడ్డి అనే ఏజెంట్లు రూ.లక్ష తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నానని, తాను పనిచేసే బోటి నుంచి అయిదు కిలోమీటర్ల దూరం వెళ్లి ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన వారి సాయంతో వీడియో పంపుతున్నానని తెలిపారు. తన కష్టాలకు ముఖ్యమంత్రి కేసీఆర్, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, కరీంనగర్ ఎంపీ సంజయ్‌లు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తన భర్తను స్వదేశానికి తెప్పించాలని అతని భార్య కల్యాణి వేడుకొంటున్నారు.

ఇసుకతో తయారుచేసిన ప్రపంచ పటం. (అంతర చిత్రంలో) శ్రీనివాస్

ఇసుకతో ప్రపంచ పటం

మహబూబాబాద్ జిల్లా అధ్యాపకుడి ఘనత

కురవి, న్యూస్‌టుడే: చెక్క కాన్వాసుపై ఇసుక, జిగురు సాయంతో ప్రపంచ పటాన్ని ఆవిష్కరించి మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన అధ్యాపకుడు నీలం శ్రీనివాస్ పౌరా అనిపించారు. విద్యా బోధనతోపాటు విద్యార్థులకు ప్రత్యేకంగా అంశాలు గుర్తుండేలా ఓ భారీ కళాఖండాన్ని తయారు చేయాలని వేసవి సెలవుల్లో ఆయన ప్రయత్నించారు. అంతర్జాతీయ, జాతీయ నాయకుల చిత్రాలతో ప్రపంచ పటాన్ని తీర్చిదిద్దారు. మే 20న ఈ పనులు మొదలు పెట్టారు. ఎనిమిది అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు చెక్కలపై, 90 కిలోల ఇసుక, 15 కిలోల జిగురు, 115 కిలోల స్టీల్‌ను ఉపయోగించి మొత్తం రూ.60 వేల ఖర్చుతో తయారుచేశారు. పటంపై బుద్ధుడు, మహాత్మాగాంధీ, మదర్‌థెరిసా, శ్రీశ్రీ రవిశంకర్, ఆంగ్‌సాన్ సూకీ, మలాలా, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా చిత్రాలను తీర్చిదిద్దారు. మహబూబాబాద్ ఎంపీ కవిత, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేతుల మీదుగా త్వరలో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కురవి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రదర్శిస్తున్న ఈ కళాఖండాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తిగా వస్తున్నారు. శ్రీనివాస్ ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల బోధకుడిగా పనిచేస్తున్నారు.

రైల్వే స్టేషన్లలో ఇక లగేజి ట్రాలీలు!

- అన్ని ప్లాట్‌ఫారాలపై వీల్‌ఛైర్లు
- ప్రయాణికుల కమిటీ ప్రతిపాదనలు
- రైల్వేబోర్డు సానుకూల స్పందన

ఈనాడు, హైదరాబాద్: విమానాశ్రయాల్లో ఉన్నట్లే రైల్వేస్టేషన్లలోనూ లగేజి తీసుకువెళ్లేందుకు ట్రాలీలను అందుబాటులోకి తేవాలని ప్రయాణికుల సేవల కమిటీ కోరింది. పరిశీలిస్తామంటూ రైల్వేబోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనపై బోర్డు సమావేశంలో చర్చించి, ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికుల సేవల కమిటీ తెలిపింది. వికలాంగులు, వృద్ధులు తరచూ ఎదుర్కొంటున్న వీల్‌ఛైర్ల సమస్యనూ కమిటీ ప్రస్తావించింది. ప్రధానమైన స్టేషన్లలో సైతం ఇవి పరిమితంగా ఉంటున్నాయి. అది కూడా మొదటి, చివరి ప్లాట్‌ఫారాల మీదే కనిపిస్తున్నాయి. మధ్యలో ఉండే ప్లాట్‌ఫారాల్లో వీల్‌ఛైర్లు కనిపించవు. అన్ని ప్లాట్‌ఫారాలమీదా వీల్‌ఛైర్లు అందుబాటులో ఉండేలా చూడాలని కమిటీ సభ్యులు రైల్వేబోర్డు ఛైర్మన్‌కు నివేదించారు. దిల్లీలో జరిగిన కమిటీ సమావేశంలో ఛైర్మన్ రమేశ్‌చంద్రతో పాటు హైదరాబాద్‌కు చెందిన వెంకటరమణి సహా 13 మంది సభ్యులు పాల్గొన్నారు. రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్‌యాదవ్‌ను గురువారం కార్యాలయంలో కలిసి చర్చించిన అంశాలను వివరించారు. సికింద్రాబాద్-గోరఖ్‌పూర్ వంటి వారానికి ఒకరోజు మాత్రమే నడిచే రైళ్లలో వందల సంఖ్యలో వెయిటింగ్‌లిస్ట్ ఉంటోందని, వీటిని వారానికి రెండు రోజులు నడపాలని కమిటీ సభ్యులు కోరారు. డిమాండ్ అధికంగా ఉన్న రైళ్లపై నివేదిక తెప్పించుకుని నిర్ణయం తీసుకుంటామని బోర్డు ఛైర్మన్ బదులిచ్చారు.


గురువారం దిల్లీలో భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు

స్త్రీ శక్తితోనే సుస్థిర ప్రగతి

ఒంటిరెక్కతో ఏ పక్షీ ఎగరలేదన్నది ఎంత నిజమో, సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీమూర్తుల పెడరెక్కలు విరిచికట్టి ఏ జాతీ పరిపూర్ణంగా ఎదగలేదన్నదీ అంతే వాస్తవం. ఆకలిదప్పులు, రోగాలు రొష్టులు, పీడనలు రోదనలు లేని మహోదయం కోసం 2030నాటికి సాధించాల్సిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్ని ఐక్యరాజ్య సమితి క్రోడీకరించినా- స్త్రీ సమానత్వ సాధనలో ప్రపంచ దేశాల వెనకబాటు మానవాళికే నగుబాటుగా మారిందన్నది కఠోర యదార్థం! మొత్తం 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14కు సంబంధించిన 51 సూచికల ఆధారంగా రూపొందించిన ప్రపంచ లింగ సమానత్వ సూచీ- 129 దేశాల్లో ఇండియాకు 95వ స్థానం కట్టబెట్టింది. పేదరికం, ఆరోగ్యం, విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, పని ప్రదేశాల్లో సమానత్వం వంటి కీలకాంశాల ప్రాతిపదికన దేశాల పనిపోకడల్ని పరిశీలించిన తాజా సూచీ- ఇప్పటి వరసే కొనసాగితే 2030నాటి లక్ష్యాల్ని ఏ దేశమూ చేరుకోలేదని ముందస్తు ప్రమాద ఘంటిక మోగించింది. లింగ సమానత్వ సూచీలో సగటు స్కోరు 65.7 అంటున్న నివేదిక- ఆ పాటి రికార్డు సాధించిన దేశాలూ పేలవ పనితీరు కనబరచినట్లేనంటోంది. 56.2 స్కోరుతో ఇండియా అధ్వాన ఫలితాలు సాధించిన 43 దేశాల కేటగిరీలో కొలువు తీరింది. ఆరోగ్యం, ఆకలి- పౌష్టికాహారం, ఇంధనం వంటి అంశాలపరంగా మంచి మార్కులు తెచ్చుకొన్న ఇండియా- భాగస్వామ్యాలు, పరిశ్రమ-మౌలిక సదుపాయాలు- సృజన, వాతావరణం వంటి రంగాల్లో దిగనాసి రికార్డు మూటగట్టుకొంది. ఆసియా పసిఫిక్‌కు చెందిన 23 దేశాల వివరాల్ని క్రోడీకరిస్తే, ఇండియా 17వ స్థానంలో ఉందన్న సూచీ- ఇరుగు పొరుగు దేశాలతోనూ భారత్ పోటీపడాల్సిన ఆవశ్యకతను ఉద్ఘోషిస్తోంది. అయినా ముంజేతి కంకణానికి అద్దమెందుకు! స్త్రీ సాధికారతపై దశాబ్దాలుగా నేతాగణాల ప్రకటనలు మోతెక్కుతున్నా- పూర్తిగా పట్టు సడలని పురుషాధిక్య భావజాల ఊడల మర్రి తెగిపడనంత కాలం, దేశ సమగ్రాభ్యున్నతి ప్రస్థానం కుంటినడకనే సాగుతుంటుంది!

డెన్మార్క్, ఫిన్లాండ్, స్వీడన్, నెదర్లాండ్స్, స్లోవేనియా, జర్మనీ, కెనడా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా- సూచీలో అగ్ర పీఠిన నిలిచిన ఈ పది దేశాలూ సంపూర్ణ లింగ సమానత్వ సాధనకు అల్లంత దూరంలో ఉన్నాయి. చట్టసభల్లో తగు ప్రాతినిధ్యం, జీతనాతాల్లో వ్యత్యాసం, లైంగిక హింస వంటి సమస్యల పరిష్కారంలో ప్రపంచ దేశాలన్నీ కిందుమీదులవుతున్నాయని, మహిళాభివృద్ధి కోసం ఇదమిత్థంగా ఏమీ చెయ్యని దేశాల్లోనే ఎకాయెకి 280 కోట్లమంది స్త్రీలు, బాలికలు భారంగా బతుకులీడుస్తున్నారనీ తాజా సూచీ వ్యధాకలిత వాస్తవాన్ని వెల్లడించింది 2015లో 193 దేశాలు చేప్రాలు చేసిన సుస్థిరాభివృద్ధి అజెండాలో అయిదో కీలకాంశంగా లింగ సమానత్వం కొలువుదీరింది. ఎక్కడికక్కడ మహిళల్ని అణగదొక్కే అరాచక పోకడల కారణంగా ప్రపంచ మానవాభివృద్ధి సామర్థ్యం 44శాతం మేర కోసుకుపోతోందని అధ్యయనాలు చాటుతున్నాయి. మహిళల హక్కులంటే మానవ హక్కులే అని నినదించే అభ్యుదయ గళాల సాక్షిగా ఎల్లెడలా లింగ సమానత్వం వెల్లివిరిస్తే- 2025నాటికే ప్రపంచ ఆర్థికానికి ఎకాయెకి 28 లక్షల కోట్ల డాలర్ల ప్రయోజనం జతపడుతుందన్న అంచనాలున్నాయి. ఇండియావ్యాప్తంగా ఏడున్నర కోట్లమంది స్త్రీలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా సాగిస్తున్న ప్రగతి పథ ప్రస్థానం వీనుల విందుగా ఉంది. పలు రాష్ట్రాల పది, పన్నెండో తరగతి పరీక్షల్లో అబ్బాయిల్ని తోసిరాజని ఆడపిల్లలు అద్భుతాలు సాధిస్తున్న తీరు అబ్బురపరుస్తున్నా, 15-18 ఏళ్ల మధ్య వయస్కుల్లో 40శాతం దాకా అమ్మాయిలకు విద్యాగంధం అందడం లేదన్న జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం లెక్కలు దిగ్భ్రాంతపరుస్తున్నాయి. మినుకుమినుకుమంటున్న అవకాశాల్నే దొరకబుచ్చుకొని ముందుకు దూసుకుపోయేలా స్త్రీ జన చేతన పురివిప్పుతున్న దశలో- సర్కార్లపరంగా సరైన దన్ను లభిస్తే భారత నారీమణులు సృష్టించే చరిత్ర ప్రపంచానికే మార్గదర్శకమవుతుంది!

పదిలక్షల కోట్ల డాలర్ల భూరి ఆర్థిక వ్యవస్థగా రూపొందాలన్నది భారత్ నిర్దేశించుకున్న సురుచిర లక్ష్యం. దేశంలో సొంత కాళ్లపై నిలబడిన 5.85 కోట్ల మందిలో మహిళలు 13.76 శాతం; అంటే, 80 లక్షలమందేనన్నది ఆరో ఆర్థిక గణన వివరాల సారాంశం! విద్యా నైపుణ్యాలు పెంపొందించి, సాంకేతిక మెలకువలు నేర్చి చేదోడుగా నిలువగలిగితే సృజన శక్తులుగా ఎందరెందరో స్త్రీలు సత్తా చాటగలరని పద్దెనిమిది నెలల క్రితం నాటి అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామిక శిఖరాగ్ర సదస్సు ముక్తకంఠంతో అభిప్రాయపడింది. మహిళల సామర్థ్యంపట్ల సందేహాస్పద పోకడలు విడనాడాలని ప్రభుత్వాలకు సూచించిన సదస్సు- లింగ విచక్షణ రూపుమాసిపోవాలంటూ చేసిన కర్తవ్య బోధే నేడు సమితి గళంలోనూ ప్రతిధ్వనిస్తోంది. మహిళా సాధికారతకు మేలు బాటలు పరవడానికంటూ 2001లో వాజ్‌పేయీ ప్రభుత్వం తెచ్చిన జాతీయ మహిళా విధానం- అనంతరకాలంలో సమగ్ర కార్యాచరణ కొరవడి కోమాలోకి జారిపోయింది. దాని స్థానే మరో జాతీయ విధానం ముసాయిదాను ఎన్‌డీఏ తొలి జమానా సిద్ధం చేసినా అదింకా కార్యరూపం దాల్చని నేపథ్యంలో- 2015లో మోదీ ప్రారంభించిన 'బేటీ బచావో-బేటీ పఢావో' పథకాన్నే మరింత మెరుగు దిద్ది అమలులోకి తెచ్చే యత్నాలు సాగుతున్నాయి. ఆర్థిక, పౌర, చట్టబద్ధ హక్కులపై మహిళల్లో అవగాహన పెంచడంతోపాటు, స్త్రీలపై హింసోన్మాద దుశ్చర్యలకు తావులేని సామాజిక రక్షణ చక్రాన్ని నిర్మించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. చట్టసభల్లో నిర్దిష్ట కోటాతో రాజకీయాధికారంలోనూ వాటా పెట్టడంతోపాటు మహిళల బహుముఖ వికాసాన్ని కుటుంబం, సమాజం, ప్రభుత్వాలు నిష్ఠగా లక్షిస్తే- జాతి పురోగమన వేగం ద్విగుణీకృతమవుతుంది!

తిండి... తినేస్తోంది!

ఆరోగ్యాన్ని కూల్చేస్తున్న కలుషితాహారం

డాక్టర్ ఎన్.అనంత్

మనిషి శరీరక, మానసిక ఆరోగ్యాలను ప్రధానంగా నిర్దేశించేది... ఆహారమే! కల్తీ బారినపడి ప్రపంచవ్యాప్తంగా ఆహారం ప్రమాదకరంగా మారుతోంది. అంతకంతకూ పరిస్థితి చేయిదాటుతున్న నేపథ్యంలో ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఏటా జూన్ 7న ప్రపంచవ్యాప్తంగా సురక్షిత ఆహార దినోత్సవాన్ని నిర్వహించాలని తాజాగా నిర్ణయించింది. ఆ క్రమంలో 'ఆహార భద్రత-ప్రతి ఒక్కరూ దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకత' అన్న నినాదంతో ఎఫ్ఏఓ తొలి ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. తినే తిండి పూర్తిగా కల్తీమయం కావడంతోపాటు చాలావరకు పట్టణాలు, నగరాల్లో ప్రజలు బయటే తిండికే ఎక్కువగా అలవాటుపడుతున్న పరిస్థితుల్లో- ఎఫ్ఏఓ చొరవ సమాజంలో కొంతలో కొంతైనా మార్పునకు కారణమైతే మేలు. కల్తీ ఆహారం తిని ఎవరైనా అస్వస్థులైనప్పుడో లేక మృత్యువాత పడ్డప్పుడో తప్ప ఈ సమస్య ప్రజాబాహుళ్యంలో చర్చకు రాకపోవడం బాధాకరం. కలుషిత ఆహారం వల్ల దేశవ్యాప్తంగా ఆరోగ్య సమస్యలు ప్రబలుతున్నాయి. ఆహార పదార్థాలను సరిగ్గా నిల్వ చేయకపోయినా, వండకపోయినా, అపారిశుద్ధ్య వాతావరణంలో ఉంచినా బ్యాక్టీరియా, వైరస్‌లు, ప్రమాదకర రసాయనాలు అందులో చేరిపోతాయి. నిషిద్ధ రసాయనాలను, రంగులను మాంసం, పళ్లు, కూరగాయల్లో కలుపుతున్నారు. దీనివల్ల ప్రజారోగ్యం ఒక్కుపెట్టున నేలకూలుతోంది. సమస్య తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) కలుషిత ఆహారం ప్రజల్లో విరేచనాలు మొదలు క్యాన్సర్ వరకూ 200 రకాల వ్యాధుల విస్తరణకు కారణమవుతోందని వెల్లడించింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా 22 కోట్లమంది పిల్లలు వివిధ రకాల 'డయేరియా' సమస్యల బారినపడుతున్నారని, అందులో లక్ష మంది మృత్యువాతపడుతున్నారనీ 'డబ్ల్యూహెచ్‌ఓ' అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాలు చాలావరకు పేద దేశాల్లోనే చోటుచేసుకుంటుండటం గమనార్హం. ప్రపంచ జనాభాలో 10 శాతం లేదా 60 కోట్ల ప్రజలు కలుషిత ఆహారం కారణంగా ఏటా అనారోగ్యం పాలవుతున్నారు, వారిలో 4.2 లక్షలమంది మరణిస్తున్నారు. ఈ మరణాల బారినపడుతున్న వారిలో 40శాతం బాలలే కావడం గమనార్హం. ఈ సమస్య అంతకంతకూ విస్తరించి 2030నాటికల్లా ప్రతి తొమ్మిది మందిలో ఒకరు అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయి.

ఆర్థిక వ్యవస్థ కుదేలు

జనారోగ్యాన్ని చెండుకు తింటున్న కలుషిత ఆహారం జాతి ఆర్థిక వ్యవస్థనూ కుదేలు చేస్తోంది. ప్రపంచబ్యాంకు-నెదర్లాండ్స్ ప్రభుత్వం 2017లో సంయుక్తంగా నిర్వహించిన ఓ అధ్యయనంలో కలుషిత ఆహార సంబంధిత అనారోగ్యాల వల్ల భారత్ ఏటా రూ.1.96 లక్షల కోట్లు (జీడీపీలో 0.5శాతం) నష్టపోతున్నట్లు లెక్కతేల్చింది. వైద్యఖర్చులు, విలువైన పనిదినాలను కోల్పోవడం వంటి వాటిని ప్రాతిపదికగా తీసుకొని ఆర్థిక నష్టాలను మదింపు వేస్తున్నారు. ఈ సమస్య భారత్‌కు మాత్రమే పరిమితమైంది కాదు. ప్రపంచంలోని అనేక దేశాలు ఈ సమస్య బారినపడి విలవిల్లాడుతున్నాయి. జంతు సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో కలుషితాలకు అవకాశం ఎక్కువగా ఉన్న ఏడింటిని ప్రత్యేకంగా ఎంపిక చేసి ఇటీవల విశ్లేషించారు. ఆ విశ్లేషణలో ఆ ఏడు రకాల ఉత్పత్తులు కలుషితాల బారినపడటం వల్ల ప్రపంచ ఆర్థికానికి ఏటా 650 కోట్ల డాలర్లనుంచి 3,490 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లుతోందని తేలింది. సురక్షిత ఆహార ఆవశ్యకతను భారత్ ఏడు దశాబ్దాల క్రితమే గుర్తించింది. 1947నాటి కూరగాయలు-నూనె ఉత్పత్తుల (నియంత్రణ) చట్టం, ఆహార కల్తీ నివారణ చట్టం (1954), పళ్ల ఉత్పత్తుల చట్టం (1955), మాంసాహార ఉత్పత్తుల చట్టం (1973), వంట నూనెల ప్యాకేజింగ్ (నియంత్రణ) చట్టం (1988), పాలు-సంబంధిత ఉత్పత్తుల చట్టం (1992) వంటివి ఆహార కల్తీని నిరోధించే దిశగా ప్రభుత్వం దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలను తెలియజేస్తాయి. వీటన్నింటినీ ఒకే చట్రం కిందకు తీసుకువస్తూ 2006లో సురక్షిత ఆహారం-ప్రమాణాల చట్టం తీసుకువచ్చారు. అన్నిరకాల ఆహారాలు, వాటి తయారీ, వంపిణీ, విక్రయం, దిగుమతుల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలు, నియంత్రణలు, ప్రమాణాలను ఈ చట్టంలో గుదిగుచ్చారు. వీటిని పర్యవేక్షించడంకోసం భారత ఆహార భద్రత-ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ను ఏర్పాటు చేశారు. దేశంలో ఆహార ఉత్పత్తులు మానవ వినియోగానికి అనుకూలంగా, సురక్షితంగా ఉండేలా చూడటం ఈ సంస్థ బాధ్యత. దేశవ్యాప్తంగా వివిధ శాస్త్రీయ కమిటీలు వినియోగదారులకు చేరవేసే అన్ని రకాల ఆహార పదార్థాలకు సంబంధించి రూపొందించిన ప్రమాణాలను నిర్దుష్టంగా అమలయ్యేట్లు ఈ సంస్థ చూడాల్సి ఉంది. ఆహార సంబంధ కార్యకలాపాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ వంద రూపాయల నామమాత్రపు ఫీజు చెల్లించి చట్ట ప్రకారం ఈ సంస్థలో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. దేశంలోని అత్యధిక ప్రజల ఆహార అవసరాలతో ముడివడిన ఈ చట్టాన్ని ఆచరణలో పక్కాగా పట్టాలకు ఎక్కించడం అతిపెద్ద సవాలు. అసంఘటిత రంగంలోని లక్షలాది ఆహార విక్రయదారుల కార్యకలాపాలను కనిపెట్టి నియంత్రించేందుకు తగినంత సిబ్బంది లేకపోవడం అతిపెద్ద సమస్య దేశంలో చాలావరకు అపారిశుద్ధ్య వాతావరణంలోనే ఆహార విక్రయాలు సాగుతున్నాయి. ఆహార ఉత్పత్తి, పంపిణీ, విక్రయం వంటి వివిధ దశల్లో ప్రమాదకర స్థాయిలో కల్తీ జరుగుతోంది. విష రసాయనాలు మిళితమైన వ్యవసాయ ఉత్పత్తులు ఉరుముతున్న మరో పెద్ద సమస్య!

సురక్షిత ఆహార దినోత్సవం నేడు

అవగాహనే అసలైన మందు

అరక్షిత ఆహార కట్టడి కేవలం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత మాత్రమే కాదు. జాతి ఆరోగ్యానికి పెను సవాలుగా నిలుస్తున్న ఈ సమస్యను ఎదుర్కొనే విషయంలో ప్రజలూ ప్రభుత్వానికి తోడ్పాటుగా నిలవాలి. ప్రజల ఆహార సంస్కృతిలోనూ నిర్మాణాత్మక మార్పులు అవసరం. చట్టాలకు, వాటి అమలుకు వినియోగదారుల అవగాహనే కీలక ఆదరవు. 2014నుంచీ ఆరోగ్య-కుటుంబ సంక్షేమ విభాగం తనకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేకపోతోందని పార్లమెంటరీ స్థాయి సంఘం ఇటీవల తేల్చి చెప్పింది. నిధుల వినియోగానికి సంబంధించి ఈ లోపాన్ని తక్షణం సవరించాలి. మరోవంక నిబంధనల అమలులో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రభుత్వ యంత్రాంగం కచ్చితంగా వ్యవహరించాలి. కలుషిత ఆహారం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావం పడుతోందన్న విషయాన్ని గుర్తించాలి. అసంఘటిత రంగంలోని ఆహార విక్రేతలు అవసరమైన ముడిపదార్థాలను ఒకేసారి పెద్ద యెత్తున కొనుగోలు చేస్తున్నారు. 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' ధ్రువీకృత ముద్రలేని పదార్థాలనే వీరు చాలా సందర్భాల్లో కొంటున్నారు. ఈ పదార్థాలనే ఆహార తయారీలో విరివిగా ఉపయోగిస్తున్నారు. శవభిషలకు తావులేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేయడమే ముందున్న మార్గం. ప్రభుత్వ ప్రైవేటు అన్న తేడా లేకుండా కలుషిత ఆహారం వినియోగదారులకు అందిస్తున్న ప్రతి ఒక్కరిపైనా చట్టబద్ధంగా తీవ్ర చర్యలు చేపడితే తప్ప మార్పు సాధ్యం కాదు. ప్రభుత్వ హస్తళ్లు, వంట శాలలను పరిశీలిస్తే వాటి నిర్వహణ ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. నిబంధనలను అతిక్రమించిన వారికి విధించే శిక్ష, పరిహారాలను మరింత కఠినంగా మారిస్తే తప్ప ఫలితాలు సాకారం కావు. ఆహార ప్రమాణాలను పరీక్షించే ప్రయోగశాలలు సరిపడా లేవు. దేశంలో 2017 మార్చి నాటికి కేవలం 72 ప్రభుత్వ కేంద్రాలే ఉన్నాయి. అంటే సగటున దేశంలోని ఒక్కో రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతానికి రెండు చొప్పున ఈ నాణ్యత పరీక్ష కేంద్రాలున్నాయన్నమాట! ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కలిపి మొత్తంగా దేశంలో 213 ఆహార నాణ్యత పరీక్ష కేంద్రాలున్నాయి. 130 కోట్ల ప్రజలున్న భారతావని ఆహార అవసరాల దృష్ట్యా చూస్తే ఈ కేంద్రాల సంఖ్య ఏ మూలకూ కొరగాదనే చెప్పాలి. పరిమిత సంఖ్యలో ఉన్న ఈ కేంద్రాల్లోనూ సరిపడా సిబ్బంది లేకపోవడం మరో లోపం. ప్రజలు ఎవరైనా తాము తీసుకుంటున్న ఆహారానికి సంబంధించిన నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవాలనుకుంటే ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ఆహార నాణ్యత పరీక్ష కేంద్రాలను ప్రతి జిల్లాలోనూ వీలైతే అన్ని మండలాల్లోనూ ఏర్పాటు చేయాలి. రాష్ట్రాల ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో ఈ విషయంలో కేంద్రమే చొరవ తీసుకోవాలి. రెండు లక్షల జనాభాకు ఒకటి చొప్పున అత్యాధునిక ఆహార నాణ్యత కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలి. నిర్దిష్ట చర్యలతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళితే తప్ప జాతి భవిష్యత్తును ప్రమాద ఘంటికలు మోగిస్తున్న అరక్షిత ఆహార సమస్యను ఎదుర్కోవడం సాధ్యమయ్యే పనికాదు!

(రచయిత- ఆర్థిక, సామాజిక రంగ నిపుణులు)

చట్టంలో అస్పష్టతతో చిక్కులు

'సురక్షిత ఆహారం-ప్రమాణాల చట్టం-2006'లోని నిబంధన 31కి సంబంధించి నెలకొన్న చిన్నపాటి గందరగోళాన్ని ప్రభుత్వం సవరించాల్సి ఉంది. ఆహార సంబంధిత వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ ఆ మేరకు ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందాలని చట్టంలోని నిబంధన 31 (1) చెబుతోంది. సంఘటిత, అసంఘటిత; చిన్న, పెద్ద వ్యాపారులు అన్న తేడాలేవీ లేకుండా ప్రతి ఒక్కరూ లైసెన్సు తీసుకోవాల్సిందేనని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. అయితే లైసెన్సు తప్పనిసరి అని విధితం చేసిన 31(1) నిబంధన చిన్నస్థాయిలో ఆహార వ్యాపారాలు చేసేవారికి వర్తించదని 31(2) నిబంధన వివరిస్తోంది. అయితే చిన్న వ్యాపారులూ తమ పేర్లు చట్టబద్ధంగా నమోదు చేసుకోవడంతోపాటు- వినియోగదారులకు సురక్షిత ఆహారం అందించడంపై దృష్టి పెట్టాలని 31(2) నిబంధన చెబుతోంది. ఈ రెండు నిబంధనల మధ్య నెలకొన్న అస్పష్టతను తొలగించాల్సి ఉంది. చట్టం అమలులో పోటెత్తుతున్న అవినీతి కలవరం కలిగిస్తున్న మరో సమస్య. అసంఘటిత రంగంలోని లక్షలాది ఆహార విక్రయదారుల కార్యకలాపాలను కనిపెట్టి నియంత్రించేందుకు తగినంత సిబ్బంది లేకపోవడం ఇంకో అతిపెద్ద సమస్య.

సింధుశాఖలో చిచ్చు

సింధుశాఖలో పరిస్థితులు నానాటికీ క్షీణిస్తున్నాయి. ఇక్కడ ఇంధన సమస్య వివిధ దేశాల మధ్య చిచ్చు రేపుతోంది. యుద్ధాన్ని ప్రేరేపించే పరిస్థితులు ఈ ప్రాంతంలో నెలకొన్నాయన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. గత నెల రోజులుగా జరుగుతున్న సంఘటనలు ఈ దిశగానే సాగుతున్నాయి. గత నెలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సమీపాన నాలుగు చమురు నౌకలపై జరిగిన దాడి మటన ఇందుకు ఊతమిస్తోంది. ఈ దాడులతో నౌకలు దెబ్బతిన్నాయి. ఇందుకు కారణం సముద్రంలో నిక్షిప్తమై ఉన్న ఇరాన్ బాంబులేనన్నది అమెరికా అనుమానం. ఈ దాడిలో ప్రధానపాత్ర ఇరాన్‌దే అని అమెరికా విదేశాంగశాఖ బహిరంగంగానే చెబుతోంది. అయితే అందుకు తగ్గ ఆధారాలు ఏమీ ఇప్పటిదాకా లభ్యం కాలేదు. అమెరికా-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు ఏర్పడిన సమయంలోనే ఈ దాడి జరగడం కాకతాళీయం కాదు.

కొన్ని సంవత్సరాలుగా నలుగుతున్న ఇరాన్ అణుసమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. దాడికి గురైన నాలుగు నౌకలలో రెండు సౌదీ అరేబియావి కాగా, ఒకటి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ది, మరొకటి నార్వేలో నమోదయిన ఓడ. సౌదీలో చమురు క్షేత్రాలపైనా ఇరాన్ దాడి చేసిందని, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌పైనా రాకెట్ ప్రయోగించిందని, అయితే ఆ దాడులు విఫలమయ్యాయని అమెరికా చెబుతోంది. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులను నిషేధించిన అమెరికా ఈ ఏడాది మే ప్రారంభం నుంచి ఆ నిర్ణయాన్ని నూరుశాతం అమలుచేయాలని భావించిన తరుణంలో ఈ దాడులు జరగడం గమనార్హం. పశ్చిమాసియా దేశమైన ఇరాన్‌కు చమురు ఎగుమతే ప్రధాన ఆదాయ వనరు. ప్రభుత్వానికి సింహభాగం ఆదాయం దీని నుంచి వస్తుంది.

అణు పరిశోధనపై అనుమానాలు

అణుశక్తి రంగంలో ఇరాన్ చేస్తున్న పరిశోధన ఆది నుంచి సందేహాస్పదంగానే ఉంది. ఈ పరిశోధన అణుబాంబు రూపకల్పన కోసమని అమెరికా, ఐరోపా దేశాలు ఆదేపనిగా ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. తమ పరిశోధన యుద్ధం కోసం కాదని శాంతి కోసమని స్పష్టం చేస్తోంది. తన అణుపరిశోధన ఆయుధాల కోసం కానేకాదని ఇరాన్ 2015లోనే పేర్కొంది. ఈ మేరకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, రష్యా, జర్మనీలతో ఒప్పందం సైతం చేసుకుంది. యురేనియం శుద్ధిని నియంత్రిస్తామని, బారజలం తయారుచేసే పరిశ్రమలో సాంకేతిక నిర్మాణాన్ని మార్చుతామని, అణుస్థావరాలను పరీక్షించడానికి అంతర్జాతీయ సంస్థలను తమ దేశంలోకి అనుమతిస్తామని ఒప్పందంలో ఇరాన్ స్పష్టం చేసింది. బారజల పరిశ్రమలో ఉత్పత్తయ్యే ఫ్లుటోనియం అణుబాంబు తయారీలో ఉపయోగపడుతుంది. అందువల్ల దాన్ని నియంత్రించాలని ఆ దేశాలు పట్టుబట్టాయి. ఆ ఒప్పందాలను పునఃసమీక్షించాలని అమెరికా కోరుతోంది. తమ అణుపరిశోధన గురించి చర్చలు జరిపే ఉద్దేశం లేదని ఇరాన్ పేర్కొంది. అమెరికా ఆంక్షలు ఎత్తివేస్తేనే చర్చలకు అవకాశం ఉందని స్పష్టం చేసింది.

ఒప్పందం (2015) ఫలితంగా ఇరాన్‌పై ఆంక్షలు తగ్గాయి. దీనివల్ల చమురును ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే వెసులుబాటు ఇరాన్‌కు కలుగుతుంది. గత ఏడాది మే నెలలో ఆంక్షలను తిరిగి అమలుచేయాలని, ఇరాన్ నుంచి ఇతర దేశాలు చమురు దిగుమతి చేసుకోరాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబట్టారు. దీంతో ఇరాన్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. 2015 ఒప్పందం ప్రకారం యురేనియం శుద్ధిలో లభించిన పదార్థాన్ని ఇరాన్ ఇతర దేశాలకు అమ్మాలి. భారజలం పరిశ్రమ కూర్చునూ మార్చాలి. ఈ రెండు పనులు ఇక చేయనని ఇరాన్ చెప్పేసింది.

యూఏఈ సమీపంలో ఇటీవల దాడికి గురైన చమురు నౌక (అంతర చిత్రంలో ట్రంప్)

యుద్ధం దిశగా పరిస్థితులు!

ఇరాన్ 2015 నాటి ఒప్పందాన్ని పునస్సమీక్షించుకోవాలని అమెరికా కోరుతోంది. అయితే అందుకు ఇరాన్ ససేమిరా అంటోంది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ ఇటీవలే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తో రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆమేమీ ఘాల మీద ఈ ఒప్పందం రూపుదాల్చింది. అమెరికా ప్రభుత్వంలోని కొన్ని శక్తులు తమతో యుద్ధానికి ఉవ్విళ్లూరుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది.

బి- 52 యుద్ధ విమానాలను, సుమారు 1500 మంది సైనికులను పశ్చిమాసియాలో అమెరికా మోహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని నడిపేది ఎన్నికైన రాజకీయ నాయకులైనా ప్రభుత్వ విధివిధానాలను మాత్రం ముల్లాలు రూపొందిస్తారు. వారిది కీలకపాత్రేనని చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితిని వారు ఎలా అధిగమిస్తారో చూడాలి. మత నాయకుడైన అయతుల్లా ఖొమైనీ ఇరాన్ సైన్యానికీ అధిపతి.

బరాక్ ఒబామా 2015లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నపుడు చేసుకొన్న ఇరాన్ ఒప్పందంలో చాలా లోపాలున్నాయన్నది ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయం. ఆ ఒప్పందం ఖండాంతర క్షిపణులకు వర్తించదని, పశ్చిమాసియాలో కలిగే అశాంతి పరిస్థితులను సరిగా అంచనా వేయలేదన్నది ఆయన వాదన. సింధుశాఖలో కతర్ దీవి దగ్గర, అబుదాబిలోనూ అమెరికా వాయుసేన కేంద్రాలున్నాయి. సింధుశాఖలోకి ఉన్న ఒకే ఒక సముద్రమార్గం హోర్ముజ్ ముఖద్వారం. దీన్ని ఇరాన్ మూసి వేస్తుందని పలుదేశాలు అనుమానిస్తున్నాయి. ఈ పని చేయడానికి ఇరాన్ సైతం సిద్ధంగా ఉంది. ప్రపంచంలోని చమురు రవాణాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఈ మార్గం అత్యంత కీలకమైనది.

భారత్-ఇరాన్ సంబంధాలపై ప్రభావం

భారత్-ఇరాన్ మధ్య దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలున్నాయి. ఇరాన్ నుంచి ఎవరూ చమురు దిగుమతి చేసుకోరాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హుకుం జారీ చేయడం భారత్ వెంటనే సరే అనడం జరిగిపోయాయి. భారత్ అవసరాలలో పదిశాతం చమురును ఇరాన్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్‌ను భారత్ మిత్రదేశంగా పరిగణిస్తోంది. అఫ్గానిస్థాన్‌లో భారత్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ఇందుకు అవసరమైన వివిధ రకాల సామగ్రిని తరలించడానికి ఇరాన్‌లో ఉన్న ఛాబహార్ నౌకాశ్రయాన్ని భారత్ వాడుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్‌తో భారత్ సంబంధాలు ఏ మలుపు తీసుకుంటాయోనన్న ఆసక్తి ఏర్పడింది. వాషింగ్టన్‌లో ఇటీవల జరిగిన పాత్రికేయుల సమావేశంలో అమెరికాలో భారత్ రాయబారి హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇరాన్ నుంచి చమురు దిగుమతి భారత్ ఆపివేసినట్టు స్పష్టం చేశారు.

కారణాలు ఏమైనప్పటికీ గత ఆరు నెలల్లో చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పశ్చిమాసియాలో మరో యుద్ధం సంభవిస్తే అమెరికాతో సహా అందరూ ఓడిపోతారు. అంతేకాక ఆర్థికంగానూ నష్టపోతారు. ఇది చేదు నిజం. ఈ యుద్ధంలో ఇరాన్ మిత్రులూ పాల్గొనే అవకాశముంది. ఇప్పటికే యెమెన్‌పై సౌదీ అరేబియా దాడులు చేసింది. ఈ పరిస్థితుల్లో 1990ల నాటి రోజులు మళ్లీ వస్తాయా అన్న అనుమానం కలుగుతోంది!

– డాక్టర్ వి.వి.రంగనాయకులు

(రచయిత- తిరుమల ఎస్వీ మ్యూజియం పూర్వ సంచాలకులు)

ప్రజ్ఞ

ప్రతివ్యక్తికి పుట్టుకతోనే బీజరూపంలో ప్రజ్ఞ మేధలో ఉంటుంది. దానిని ప్రయత్నపూర్వకంగా

పట్టుబడుతున్నది పాత్రధారులే!

- గల్ఫ్ దేశాల నుంచి యథేచ్ఛగా బంగారం అక్రమ రవాణా
- సూత్రధారులు దొరక్కుండా పక్కా వ్యూహం
- లాభసాటిగా మారిన 'పసిడి వ్యాపారం'
- మాదక ద్రవ్యాల తర్వాత ఈ దందాపైనే ముఠాల కన్ను

ఈనాడు - హైదరాబాద్



లో బంగారం అధికారిక విలువ రూ.30 లక్షలు. ఇదే బంగారాన్ని పన్నులు చెల్లించకుండా అక్రమంగా విదేశాల నుంచి హైదరాబాద్‌కు రప్పించగలిగితే దాని విలువ రూ.19 లక్షలు మాత్రమే. ఆభరణాలు తయారు చేసి అమ్మే వ్యాపారులు అధికారంగా బంగారం కొనుగోలు చేయాలంటే దాని అసలు విలువకు 38.5 శాతం పన్నుల రూపంలో చెల్లించాలి. అదే బంగారాన్ని అక్రమంగా రాబట్టుకోగలిగితే.. కిలో బంగారానికి దాదాపుగా రూ.11 లక్షలు మిగులుతాయన్నమాట. పది దుకాణాల్లో ఇలా పది కిలోల బంగారాన్ని విక్రయించగలిగితే కనీసం రూ.కోటి మిగిలినట్లే.. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాల వ్యాపారం తర్వాత బంగారం అక్రమ రవాణానే ఇప్పుడు అంతర్జాతీయ ముఠాలకు లాభదాయకంగా మారింది. హైదరాబాద్ విమానాశ్రయంలో రోజూ ఏదో ఒక బంగారం అక్రమ రవాణా కేసు నమోదవుతూనే ఉంది. డీఆర్‌ఐ, కస్టమ్స్‌తోపాటు విమానాశ్రయ భద్రతా సిబ్బందీ అక్రమ పసిడిని పట్టుకుంటూనే ఉన్నారు. అయినా, అసలు సూత్రధారులు మాత్రం దొరకడంలేదు.

పక్కాగా రవాణా..

- అధికారులకు పట్టుబడుతున్న వారు కేవలం రవాణాదారులు మాత్రమే. గల్ఫ్ దేశాల్లో పాగా వేసిన సూత్రధారులుగానీ, హైదరాబాద్‌లో ఉన్న వ్యాపారులుగానీ దొరకడంలేదు. సూత్రధారులు తొలుత అమాయకులకు వలవేస్తారు. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది గల్ఫ్ దేశాల్లో చిన్నాచితకా పనులు చేసుకుంటూ హైదరాబాద్ వచ్చిపోతుంటారు. ఇటువంటి వారిని గుర్తించి బంగారం అప్పజెబుతున్నారు. బంగారం రవాణా చేయడం నేరమని వీరిలో చాలామందికి తెలియదు.
- హైదరాబాద్ విమానాశ్రయంలో దిగగానే తమ మనిషి కలిసి బంగారం తీసుకుంటాడని సదరు ప్రయాణికులకు చెబుతారు. ఇందుకు ప్రతిగా వారి విమానం టికెట్ ఖర్చు భరిస్తారు. బంగారం ఎక్కువ ఉంటే కొంత డబ్బు కూడా ఇస్తారు. హైదరాబాద్‌లో బంగారం తీసుకునేవారి వివరాలు ఏవీ వీరికి చెప్పరు. అయితే బంగారం తీసుకొస్తున్న వ్యక్తి విమానం ఎక్కిన తర్వాత అతని వివరాలు, ఫొటో, ఫోన్ నంబరు హైదరాబాద్‌లోని వ్యాపారికి పంపుతారు.
- బంగారం తీసుకొస్తున్న వ్యక్తి హైదరాబాద్ విమానాశ్రయం నుంచి బయటకు వచ్చాక, అధికారులు ఎవరూ అనుసరించడంలేదని నిర్ధారించుకున్న తర్వాత ఇక్కడి వ్యాపారి బంగారం తెచ్చిన వ్యక్తికి ఫోన్ చేస్తాడు. దారిలోనే కలిసి బంగారం తీసుకుంటాడు. ఇదంతా చాలా పక్కాగా జరుగుతుంది.
- ఒకవేళ బంగారం తెస్తున్న వ్యక్తిని అధికారులు పట్టుకున్నా.. ఆయనకు ఎవరు బంగారం ఇచ్చారు, ఎవరికి ఇవ్వాలో వంటి వివరాలు ఏవీ ఉండవు. దాంతో సూత్రధారులుగానీ, వ్యాపారుల వివరాలుగానీ వీరివద్ద ఉండవు. దాంతో ఎవ్వరూ మద్యవర్తులే పట్టుబడుతున్నారు.

ఎన్నెన్నో పద్ధతులు

- బంగారం అక్రమంగా రవాణా చేయడానికి ఎన్నో పద్ధతులను అనుసరిస్తున్నారు. మామూలు లగేజీలో పెట్టి తీసుకొస్తున్నారు.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాలలో సామగ్రి తొలగించి వాటి స్థానంలో బంగారం నింపుకొని తెస్తున్నారు.
- బంగారాన్ని పొడి రూపంలో మార్చి, జుట్టుకు పెట్టుకునే మెహిందీ పొడిలో కలిపి తెస్తున్నారు.
- ఈ మధ్యకాలంలో అక్రమ రవాణాదారులు మరో కొత్త పద్ధతి కనుగొన్నారు. దేశీయంగా ప్రయాణించే వారికి ఇమిగ్రేషన్ తనిఖీలు ఉండవు. ఉదాహరణకు సింగపూర్‌లో బంగారం తీసుకున్న వ్యక్తి చెన్నై చేరుకుంటాడు. తనతో పాటు తెచ్చిన బంగారాన్ని విమానంలోనే వదిలేస్తాడు. ఇదే విమానంలో మరో వ్యక్తి చెన్నైలో ఎక్కి హైదరాబాద్‌లో దిగుతాడు. చెన్నైలో ఎక్కిన వ్యక్తి దేశీయ ప్రయాణికుడి జాబితాలోకే వస్తాడు కాబట్టి లగేజీ తనిఖీ చేయరు. సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తి విమానంలో వదిలేసిన బంగారాన్ని ఈ వ్యక్తి హైదరాబాద్ తరలిస్తాడు.
- ఒకప్పుడు ఖరీదైన మాదకద్రవ్యాలను మాత్రమే శరీరంలోకి జొప్పించుకొని తెచ్చేవారు. కానీ, ఇప్పుడు బంగారాన్ని కూడా ఇలా తెస్తున్నారు.
- విమానంలో పనిచేసే సిబ్బందిని మచ్చిక చేసుకొని వారి ద్వారా కూడా బంగారం రవాణా చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఓ ఎయిర్‌హోస్టెస్‌ను ఇలానే అరెస్టు చేశారు.
- కేవలం బంగారం తీసుకొచ్చేందుకు కూడా ముఠాలు కొందర్ని నియమించుకుంటున్నాయి.

పదిశాతం కూడా పట్టుబడటం లేదు..

రవాణా అవుతున్న అక్రమ బంగారంలో పది శాతం కూడా పట్టుబడటం లేదన్నది వాస్తవం. నిత్యం కొన్ని వందలమంది గల్ఫ్ దేశాల నుంచి వస్తుంటారు. వీరందర్నీ పూర్తిస్థాయిలో తనిఖీ చేసి గుర్తించడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వంద కిలోల బంగారం రవాణా అవుతుంటే అందులో పది శాతమే పట్టుబడుతోందని అంచనా.



శిక్షలేవి..?

పన్నులు చెల్లించకుండా విదేశాల నుంచి బంగారం రవాణా చేసినప్పుడు కస్టమ్స్ చట్టం-1962 కింద కేసు పెడుతున్నారు. దీని కింద నిందితులను అరెస్టు చేస్తున్నా.. ఇప్పటి వరకూ ఒక్కరికి కూడా శిక్షపడలేదంటే అతిశయోక్తి కాదు. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తే శిక్షలు కఠినంగా ఉన్నాయి కానీ, బంగారం రవాణా చేసేవారికి మాత్రం జరిమానా వేస్తుంటారు తప్ప జైలు శిక్షలు పడటంలేదని కస్టమ్స్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఒకవేళ పట్టుబడి జైలుకు వెళ్లినా బెయిలుపై బయటకు వస్తే ఇక ఏమీకాదనే భరోసా కూడా అక్రమ రవాణా పెరగడానికి కారణమవుతోంది.

	విభాగం	సంవత్సరం	కేసులు	బంగారం(కిలోల్లో)	విలువ
స్వాధీనం చేసుకున్న బంగారం	కస్టమ్స్	2018-19	86	40	రూ.12.74 కోట్లు
		2019-20 (ఏప్రిల్, మే)	16	14.4	రూ.4.2 కోట్లు
	డీఆర్‌ఐ	2018-19	8	15	రూ.4.5కోట్లు
		2019-20 (ఏప్రిల్, మే)	1	11	రూ.3.3 కోట్లు

ఇక ఎప్పుడంటే అప్పుడు నోరూరించే హలీం..!

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నిన్నమొన్నటి దాకా ఎక్కడ చూసినా నోరూరిస్తూ, కవ్వించిన హలీం రంజాన్ మాసం ముగియడంతో మాయమయింది. 'అయ్యో.. అప్పుడే రంజాన్ నెల ముగిసిందా, హలీం తినాలంటే మళ్లీ ఏడాది దాకా ఆగాల్సిందేనా..' అని ఈ సందర్భంలో మాంసప్రియులు అనుకోవడం సహజమే. అయితే.. ఇక ఆ ఆందోళన అవసరం లేదంటున్నారు జాతీయ మాంస పరిశోధన కేంద్రం (ఎన్ఆర్‌సీఎం) శాస్త్రవేత్తలు. ప్రస్తుతం ప్రాసెస్డ్ హలీంపై పరిశోధనలు చేస్తున్నామని, అది పూర్తయితే ఎప్పుడు తినాలనిపించినా నిమిషాల్లో ఇంట్లోనే హలీం చేసుకోవచ్చని చెబుతున్నారు. ఎక్కువ రోజులు పాడవకుండా ఉండేలా.. బ్యాక్టీరియా లేకుండా రెడిమేడ్ హలీంను స్టెరైల్ ప్యాకింగ్ చేయనున్నారు. రిఫ్రిజిరేటర్ అవసరం లేకుండా మామూలుగానే రెండు నుంచి మూడు నెలల పాటు ప్రాసెస్డ్ హలీం నిల్వ ఉండేలా పరిశోధనలు చేస్తున్నారు. హలీం తయారు చేయాలంటే సుమారు ఆరు, ఏడు గంటలపాటు మాంసాన్ని రుబ్బాల్సి ఉంటుంది. ఇది శ్రమతో కూడుకున్న పనికావడంతో సాధారణ రోజుల్లో హలీం తయారీకి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఇకపై ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మానవ శ్రమతో పనిలేకుండా, మాంసాన్ని రుబ్బేందుకు అవసరమైన యంత్రాలను తయారు చేసే పనిలో ఎన్ఆర్‌సీఎం నిమగ్నమైంది. పరిశోధనలన్నీ పూర్తిచేసి వచ్చే ఏడాదిలోగా ప్రాసెస్డ్ హలీంను అందుబాటులోకి తెస్తామని ఎన్ఆర్‌సీఎం శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

చంద్రబాబు, లోకేశ్ ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లింపు

వాతావరణం అనుకూలించక బెంగళూరుకు పయనం.. తర్వాత హైదరాబాద్‌కు చేరిక

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ప్రయాణిస్తున్న విమానాన్ని ప్రతికూల వాతావరణం నేపథ్యంలో గురువారం రాత్రి దారి మళ్లించారు. కొద్ది గంటల ఆలస్యంగా వారు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకున్నారు. గురువారం సాయంత్రం 7.20 గంటలకు ఎయిర్‌ఇండియా విమానం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. ఇందులో చంద్రబాబు, లోకేశ్‌తో పాటు 130 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం హైదరాబాద్ మీదుగా దిల్లీ వెళ్లాల్సి ఉంది. వాతావరణం సరిగా లేకపోవడంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. రాత్రి 9.20 గంటలకు విమానం అక్కడకు చేరుకుంది. చంద్రబాబు, లోకేశ్, ప్రయాణికులు కొద్దిసేపు అక్కడే వేచి ఉన్నారు. వాతావరణం అనుకూలించాక రాత్రి 10.30 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

ప్రశ్నపత్రాల మాయం కేసులో విచారణ వేగవంతం

పలువురు అనుమానితులను విచారించిన పోలీసులు

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాల పెట్టెలు మాయమైన కేసులో పోలీసు విచారణ వేగవంతమైంది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి మిల్స్ కాలనీ పోలీసుస్టేషన్‌లో భద్రపరిచిన ఇంటర్ ప్రశ్నపత్రాల పెట్టెలు మాయమైన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా విచారణాధికారి, వరంగల్ ఏసీపీ నర్సయ్య పర్యవేక్షణలో పోలీసు కమిషనర్ వి.రవీందర్ పలువురు అనుమానితులను విచారించారు. మిల్స్ కాలనీ పోలీసుస్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. స్పష్టత లోపించడంతో డేటా రికవరీ కోసం వాటిని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యం ఉంది? పెట్టెలు ఎక్కడికి వెళ్లాయి? ప్రశ్నపత్రాలను ఎవరైనా లీక్ చేశారా? అనే కోణంలోనూ విచారణ సాగిస్తున్నారు. పదో తరగతి జవాబు పత్రాల పెట్టెలు తీసుకెళ్లే సమయంలోనే, ఇంటర్ ప్రశ్నపత్రాల పెట్టెలు కూడా తీసుకెళ్లవచ్చని అనుమానిస్తున్న పోలీసులు వాటిని తరలించిన ఆటో డ్రైవర్ సందానీని, పదో తరగతి పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి శారదాబాయిని విచారించారు. వారి నుంచి ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో మరికొన్ని ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రశ్న పత్రాల మాయమైన ఘటనపై విద్యార్థులు ఆందోళన చెందినా.. మరోనెట్‌తో యథాతథంగా పరీక్ష నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టు ఎదుట హాజరుకాని ప్రజ్ఞాసింగ్

భోపాల్/ ముంబయి: మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి బాజపా ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకుర్ గురువారం ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఎదుట హాజరుకాలేదు. విచారణకు ఆమె గైర్హాజరు కావడం ఈ వారంలో ఇది రెండోసారి. ప్రజ్ఞ అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, భోపాల్ నుంచి ముంబయికి ప్రయాణం చేయలేని స్థితిలో ఉన్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో ఒక్కరోజుకు ఆమెకు మినహాయింపు ఇస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. శుక్రవారం హాజరుకావాలని స్పష్టంచేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కడపులో ఇబ్బంది తలెత్తడంతో ప్రజ్ఞ బుధవారం రాత్రి భోపాల్‌లో ఆసుపత్రిలో చేరారని ఆమె వ్యక్తిగత సహాయకులు చెప్పారు. గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు సంబంధించిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఆసుపత్రిలో చేరతారని వివరించారు.

వారధి నిర్మాణానికి పీఎఫ్ డబ్బులు

ఒడిశాకు చెందిన గంగాధర్ రౌత్ ఆదర్శం

కటక్, న్యూస్‌టుడే: తను పుట్టి పెరిగిన ప్రాంతంలోని ప్రజలకోసం ఓ విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగి ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన భవిష్యనిధి మొత్తంతో వంతెన నిర్మాణానికి నడుంకట్టారు. ఒడిశాలోని కేంద్పుర్ జిల్లా కాన్‌హూర్ గ్రామ సమీపంలో సాలంది నది ప్రవహిస్తోంది. ఈ నదిపై వంతెన లేకపోవడంతో మూడు పంచాయతీలకు చెందిన 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ రోజుల్లో నదిలో నడుచుకుంటూ వెళ్లిపోవచ్చు. వర్షాకాలంలో నది ఉధృతంగా ఉంటుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నది అవతల వెళ్లాలంటే 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం 15 ఏళ్ల కిందట వంతెన నిర్మాణం మొదలు పెట్టింది. మూడొంతులకుపైగా నిర్మించిన అనంతరం నిధుల కొరతతో పనులు నిలిపేసింది. కొద్ది నెలల కిందట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి గంగాధర్‌రౌత్ ఉద్యోగ విరమణ చేశారు. తనకు వచ్చిన భవిష్యనిధి డబ్బులు రూ.9 లక్షలతో మిగిలిన పనులు పూర్తిచేయాలని సంకల్పించారు. వంతెన నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ 'నాకు ఇద్దరు కుమారులు. వారికి నా డబ్బు అవసరం లేదు. వంతెన పూర్తయితే 30 గ్రామాల ప్రజలు లబ్ధిపొందుతారు. మరో రూ.3 లక్షలు ఖర్చు చేస్తే నిర్మాణం పూర్తవుతుంది. అది కూడా నేనే సమకూర్చాస్తాను' అని తెలిపారు. ఈ వంతెన వద్దకు రహదారి నిర్మాణం మాత్రం చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి విన్నవించినట్లు గంగాధర్ పేర్కొన్నారు.

నిర్మాణంలో ఉన్న వంతెన ★ గంగాధర్ రౌత్

వెబ్‌సైట్‌లో 3.82 లక్షల మంది జవాబు పత్రాలు

- 1.80 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు
- పునఃపరిశీలనలో 1,183 మంది ఉత్తీర్ణత
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్ పరీక్షల్లో తప్పిన 3.82 లక్షల మంది విద్యార్థుల జవాబు పత్రాల పునఃపరిశీలన, పునఃలెక్కింపు పూర్తయిందని, వీటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని గురువారం రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఈ ప్రక్రియలో 1,183 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో ద్వితీయ సంవత్సరానికి చెందినవారు 582 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి చెందినవారు 601 మంది ఉన్నారుంది. వెబ్‌సైట్ నుంచి 1.80లక్షల మంది జవాబు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొంది. ఆత్మహత్య చేసుకున్న 23 మంది విద్యార్థుల్లో ఇద్దరు ఇప్పటికే ఉత్తీర్ణులయ్యారని, ఒక విద్యార్థిని మూడు పరీక్షలు రాశాక ఆత్మహత్య చేసుకుందని, ఆమె రాసిన మూడింటిలో ఉత్తీర్ణురాలైందని, మిగిలిన 20 మంది ఫలితాల్లో ఎలాంటి మార్పులూ లేవని తెలిపింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఆశోక్ హైకోర్టులో కౌంటరు దాఖలు చేశారు. పరీక్ష పత్రాలను సక్రమంగా మూల్యాంకనం చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోయారని, పునఃమూల్యాంకనానికి ఆదేశించాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం చెల్లించేలా, బాధ్యులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా ఆదేశించాలంటూ బాలల హక్కుల సంఘం తరఫున వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు, న్యాయవాది రాపోలు భాస్కర్ వేర్వేరుగా పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫలితాలను విడుదల చేయడంతోపాటు జవాబు పత్రాలను అప్‌లోడ్ చేసినట్లు పత్రికల్లో చూశామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది సి.దామోదర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని చెప్పారు. జవాబు పత్రాలను పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేయలేదనగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటరుపై అభ్యంతరాలుంటే ఆపిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుంజీవ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ కొంతమంది డౌన్‌లోడ్ చేసుకోలేదని, వారికి అవసరం లేకపోయి ఉండవచ్చన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలను కోర్టుకు సమర్పించేలా ఆదేశించాలన్నారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ వారి జవాబు పత్రాలు సిద్ధంగా ఉన్నాయని, కావాలంటే ఇస్తామన్నారు. ధర్మాసనం సోమవారం కూడా అందుబాటులో ఉంచాలని సూచించింది. ఈ వివరాలన్నింటినీ టేబుల్‌రూపంలో సమర్పించాలంది. ప్రభుత్వ కౌంటరుపై అభ్యంతరాలుంటే ఆపిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశిస్తూ విచారణను 10వ తేదీకి వాయిదా వేసింది.

జేఎన్‌టీయూ బృందం నేతృత్వంలో పరిశీలన

రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ప్రక్రియను గ్లోబరీనా, డేటా టెక్ మెథడిక్స్ సంస్థలు సమాంతరంగా చేపట్టాయని ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటరులో పేర్కొంది. ఈ సాంకేతిక ప్రక్రియను జేఎన్‌టీయూ బృందం పర్యవేక్షించిందని తెలిపింది. విద్యార్థివారీగా డేటాను సిద్ధం చేశారని, రీవెరిఫికేషన్‌కు ముందు, తరువాతి మార్కులను వెబ్‌సైట్‌లో ఉంచారని తెలిపింది. పరీక్షలకు 9.43 లక్షల మంది హాజరుకాగా, 5.60 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారని, 3.82 లక్షల మంది ఫెయిలయ్యారని పేర్కొంది. ఏప్రిల్ 26 నుంచి ఫెయిలైన వారి 9.02 లక్షల జవాబు పత్రాలను రాష్ట్ర వ్యాప్తంగా 12 స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాల్లో 5,831 మంది క్వాలిఫైడ్ లెక్చరర్లు రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ చేపట్టారని పేర్కొంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఫెయిలనవారందరికీ అవకాశం కల్పించామని, ఈ నెల 7 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపింది.

పెరుగుతున్న ఉత్తీర్ణులు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్మీడియట్లో తప్పి పునఃపరిశీలన, లెక్కింపుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య విషయంలో ఇంటర్ బోర్డు రోజుకో ప్రకటన చేస్తోంది. తాజాగా హైకోర్టుకు ఇచ్చిన సమాచారం ప్రకారం పాసైన విద్యార్థుల సంఖ్య 1,183కు చేరింది. ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనంలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, సాంకేతిక తప్పిదాలతో విద్యార్థులు పాసైనప్పటికీ ఫెయిల్ అయినట్లు ఫలితాలు వెలువడటం తెలిసిందే. ఈ విషయమై భారీస్థాయిలో ఆందోళనలు జరగడంతో పునఃపరిశీలన, లెక్కింపు చేయనున్నట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో భాగంగా తొలుత 1,137 మంది విద్యార్థులు పాసయ్యారని చెప్పింది. ఆ తరువాత ఈ నెల 4న విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం ఆ సంఖ్య 1,155 కు పెరిగింది. ఫలితాలపై హైకోర్టుకు గురువారం సమర్పించిన ప్రమాణపత్రంలో 1,183గా పేర్కొనడం గమనార్హం. అంటే రెండు రోజుల వ్యవధిలో అదనంగా మరో 28 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించడం విశేషం. ఇంటర్‌బోర్డు తీరు తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆందోళనను మరింతగా పెంచేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

ఈ ఓటమి ఒక అనుభవం

- రాజకీయ వ్యవహారాలపై త్వరలో నూతన కమిటీ
- సెప్టెంబరు నుంచి పార్టీ పక్ష పత్రిక
- జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాన్ని ఓటమిగా కాక ఒక అనుభవంగా తీసుకుంటున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పారు. నాలుగేళ్ల పార్టీకి ఇన్ని లక్షల ఓట్లు రావడాన్ని ఒక విజయంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. జనసేనను ఎదగనివ్వకూడదని కొన్ని బలీయమైన శక్తులు పని చేయడంతో ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలు చూడాల్సి వచ్చిందన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడారు. జనసేనకు ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ తీర్మానం ఆమోదించింది. తన తుది శ్వాస వరకు పార్టీని ముందుకు నడిపిస్తానని ఈ సందర్భంగా పవన్ స్పష్టం చేశారు. తాను పోటీ చేసిన రెండు చోట్లా సమయాభావం వల్ల పూర్తి స్థాయిలో ఓటర్లను కలుసుకోలేకపోయినట్లు చెప్పారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన.. ప్రస్తుత రాజకీయ వ్యవహారాల కమిటీ గడువు ముగిసిందని, త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని పవన్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మరో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ భావజాలం, నిర్ణయాలను కార్యకర్తలకు చేరవేసేందుకు జనసేన పార్టీ పక్ష పత్రికను తీసుకు వస్తున్నట్లు పవన్ వెల్లడించారు. దీనిపై ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరులో పత్రిక తొలి సంచిక విడుదలవుతుందన్నారు.

భూమికి పట్టా ఇస్తలేరు..

ఆత్మహత్య చేసుకుంటా

- సీఎంకు లేఖ రాసి ముగ్గురు పిల్లలతో ఆటో డ్రైవర్ అదృశ్యం
- భువనగిరిలో అదుపులోకి తీసుకున్న ఓయూ పోలీసులు
- ఆ భూమిని ముందే అమ్ముకున్నారన్న తహసీల్దార్

మల్లారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, కాల్వ శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని ఆయన మరణించడంతో తనకు బదలాయించాలని అధికారుల్ని కోరినా పట్టించుకోవడంలేదని, పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ఓ ఆటోడ్రైవర్ సెల్ఫీ వీడియో తీసుకుని, సీఎంకు లేఖ రాసి ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పోస్టు చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది.

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన పెండ్రు మల్లారెడ్డి హైదరాబాద్‌లోని తార్నాకలో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన తండ్రి నారాయణరెడ్డి చనిపోగా స్వగ్రామంలో ఆయన పేరు మీద ఉన్న 37 గుంటల వ్యవసాయ భూమిని తనకు బదలాయించాలని వీఆర్వో, వీఆర్‌ఏల చుట్టూ తిరిగినా పట్టించుకోవటం లేదని, తాను ఆత్మహత్య చేసుకుంటానని మల్లారెడ్డి తీసుకున్న సెల్ఫీ వీడియో, ముఖ్యమంత్రికి రాసిన లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. తన తర్వాత తన తల్లి పేరు మీద ఆ భూమిని పట్టా చేయగలరని లేఖలో కోరాడు. గురువారం ఉదయం తన ముగ్గురు పిల్లలు ప్రశాంతి, శ్రీవాణి, మణికంఠ జ్ఞానేశ్వర్‌రెడ్డిలకు చెప్పులు కొనిస్తానని భార్య సరితకు చెప్పి ఆటోలో వెళ్లాడు. వారి కోసం ఎదురుచూస్తున్న ఆమె.. ఇంట్లో మల్లారెడ్డి రాసిన లేఖ కనిపించడంతో వెంటనే ఉస్మానియా విశ్వవిద్యాలయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నగరమంతా గాలించి భువనగిరి వద్ద ఆతనితోపాటు ముగ్గురు పిల్లల్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారు పోలీసుల సంరక్షణలో ఉన్నారు. ఈ విషయంపై కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్‌ను వివరణ కోరగా.. మల్లారెడ్డి తండ్రి నారాయణరెడ్డి బతికి ఉన్న కాలంలోనే వారి భూమిని ఆ కుటుంబం అమ్ముకుందని తెలిపారు.

ఇంజినీర్‌తో గుంజీలు తీయించిన బిజద ఎమ్మెల్యే

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించిందంటూ స్థానికులు ఆరోపించడంతో ప్రజల ఎదుటే ఇంజినీర్‌తో శాసనసభ్యుడు గుంజీలు తీయించిన ఘటన ఒడిశాలోని బొలంగిర్ జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లాలోని పాట్నాగడ్ నియోజకవర్గం పరిధిలోని మందన్ గ్రామం నుంచి బెల్‌పాహడ్ వరకు ప్రభుత్వ నిర్మాణాల విభాగం ఆధ్వర్యంలో తారు రోడ్డు నిర్మించారు. ఈ రహదారి నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ స్థానికులు ఆరోపించారు. దీంతో అధికార బిజు జనతాదళ్(బిజద)కు చెందిన స్థానిక శాసనసభ్యుడు సరోజ్ మెహర్.. రోడ్డ

హస్తం ఆందోళన బాట

- అవినీతి సొమ్ముతో ఎమ్మెల్యేలను కొన్నారని నాయకుల ఆరోపణ
- అనర్హత పిటిషన్‌లను పరిష్కరించకుండా ఇదేంటని ప్రశ్న
- ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేస్తున్నారని మండిపాటు
- పోలీసు స్టేషన్‌కు వెళ్లి మద్దతు పలికిన కోదండరాం

టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులను పరామర్శిస్తున్న తెజస అధ్యక్షుడు కోదండరాం

ఈనాడు - హైదరాబాద్

కాంగ్రెస్ శాసనసభా పక్షం విలీన నిర్ణయంపై కాంగ్రెస్ మండిపడింది.. ఆందోళన బాట పట్టాలని నిర్ణయించింది. ప్రజాస్వామ్యానికి చీకటిరోజని అభివర్ణించింది. విలీనానికి నిరసనగా శనివారం ఉదయం 11 గంటల నుంచి 36 గంటలపాటు ఇందిరాపార్కు వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. విలీనంపై శుక్రవారం హైకోర్టులో పిటిషన్ వేయడంతో పాటు లోక్‌పాల్‌ను ఆశ్రయిస్తామని చెప్పారు. తెరాసకు మద్దతు పలికిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఇటు సభాపతి వద్ద, అటు హైకోర్టులోనూ అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా శాసనసభాపక్షాన్ని ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇంట్లోనే భోజనం పెట్టి విలీన లేఖను స్పీకర్‌కు ఇప్పించారని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడి అనుమతి లేకుండా, అనర్హత కేసును ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు సీఎల్పీ సమావేశం పెట్టే అర్హత లేదన్నారు. విలీనం అప్రజాస్వామికమని ఆరోపిస్తూ దీనిపై శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి వివరిస్తామన్నారు. సీఎల్పీ విలీనాన్ని కాంగ్రెస్ పార్టీకి జరిగిన నష్టంగానే చూడవద్దని ఇది తెలంగాణ సమాజానికి జరిగిన నష్టమని ఉత్తమ్ పేర్కొన్నారు.

అసెంబ్లీ ఆవరణలో ధర్నా

12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సీఎల్పీ విలీనంపై లేఖ ఇచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ తదితరులు అసెంబ్లీ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు బైఠాయించారు. ఈ విషయం తెలిసిన నేతలు, కార్యకర్తలు అసెంబ్లీ వద్దకు చేరుకోగా.. పోలీసులు లోనికి అనుమతించలేదు. ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు రోడ్డుపైనే ధర్నాకు కూర్చున్నారు. దీంతో ఆయనను అరెస్టు చేసి బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. పొన్నాల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి వినోద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అసెంబ్లీ ప్రధాన గేటు ముందు ధర్నాకు దిగారు. వారిని గాంధీనగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ ఆవరణలో ధర్నాకు దిగిన ఉత్తమ్, భట్టివిక్రమార్క, షబ్బీర్‌అలీ, శ్రీధర్‌బాబు, తదితరులను టప్పాచబుత్రా పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఆవరణలోనూ అనంతరం రాత్రి గాంధీభవన్‌లోనూ కాంగ్రెస్ ముఖ్యనేతలు విలేకరులతో మాట్లాడారు.

హరీశ్ అడ్డు రామాడదనే ఇలా చేస్తున్నారు

సమాజం నాశనమైనా తాము మాత్రం బాగుండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. 2014లో తెదేపా, వైకాపా, సీపీఐ శాసనసభాపక్షాలను తెరాసలో విలీనం చేసుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతల్ని తెరాస ప్రలోభపెడుతోందన్నారు. పార్టీ మారకుంటే కేసులు పెడతామని కేసీఆర్ బంధువు ఒకరు భయపెట్టినట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చెప్పారని అన్నారు. పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు అడ్డురాకూడదనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొంటున్నారని అన్నారు. 88 మంది ఎమ్మెల్యేలు తెరాసకు ఉన్నా ప్రతిపక్షం ఉండకూడదని తెరాస ఎందుకు అనుకుంటోందని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులు చనిపోతే స్పందించలేదుకానీ విలీనానికి మాత్రం వెంటనే చర్యలు తీసుకున్నారని అన్నారు.

పార్టీ మారడానికి సిగ్గుండాలి

12 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు ఆర్నెల్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, ముందు వాళ్లమీద చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా జాతీయ పార్టీ ఎల్పీని ప్రాంతీయ పార్టీ ఎల్పీలో ఎలా విలీనం చేస్తారని నిలదీశారు. టికెట్ల కోసం చుట్టూ తిరిగిన వాళ్లు, ఎమ్మెల్యేలుగా గెలిచిన తర్వాత పార్టీ మారడానికి సిగ్గుండాలని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను ముఖ్యమంత్రి కేసీఆర్ విధ్వంసం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఒక దళితుడు సీఎల్పీ నేతగా ఉండటం కేసీఆర్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. మైనార్టీ నేత ప్రతిపక్ష నేతగా ఉన్న మండలిలోనూ సీఎల్పీని తెరాస ఎల్పీలో విలీనం చేశారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కేసీఆర్ అవమానపరుస్తున్నారని, ఎమ్మెల్యేలను కొనడాన్ని ఆయన గొప్పగా భావిస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి బిల్లుల కోసం, హర్షవర్ధన్‌రెడ్డి కోర్టు నుంచి రావాల్సిన పరిహారం కోసం తెరాసలో చేరారని అన్నారు. సీఎం తన కుటుంబం కోసం అసెంబ్లీతో పాటు అన్ని వ్యవస్థలను నాశనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

దోపిడీని ప్రశ్నిస్తామనే ఇదంతా: భట్టి

ఇందిరాపార్కు వద్ద చేపట్టే ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షకు ప్రజాస్వామ్యవాదులందరూ సహకరించాలని భట్టి విక్రమార్క కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల తరలివచ్చి మద్దతు పలకాలని కోరారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీని ప్రశ్నిస్తామనే భయంతోనే సీఎం కేసీఆర్ ప్రతిపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన రోజు అని షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ నష్టపోయిందన్నారు. పార్టీ మారిన వారిపై ప్రజలు తిరగబడాలని వీహెచ్ అన్నారు.

ఆందోళన కలిగించే అంశం: కోదండరాం

కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనం ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తోందని తెజస అధ్యక్షుడు కోదండరాం అన్నారు. అరెస్టు అయిన కాంగ్రెస్ నేతలకు టప్పాచబుత్ర పోలీసుస్టేషన్‌కు వచ్చి సంఘీభావం తెలిపిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ పరిధిలో ఉంటుందని, ఎమ్మెల్యేల ప్రత్యేక హక్కులను కాలరాసి, 151 సెక్షన్ పెట్టి అరెస్టు చేయడం చట్టవిరుద్ధమన్నారు. అసెంబ్లీ వద్ద ప్రశ్నించడమంటే, అల్లరి చేయడమా? అసెంబ్లీని నడిపేది సైఫాబాద్ పోలీసులా అని ప్రశ్నించారు. అధికార పార్టీలు వారు ఇలా వ్యవహరించడం ప్రమాదకరమని ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దని స్పీకర్‌ను కోరారు. ప్రజలు కూడా ఈ మటనపై నిరసన తెలపాలని కోదండరాం కోరారు.

తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను గురువారం ఆయన నివాసంలో కలిసిన తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ నవీన్‌రావు, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తా

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే తెరాసలో చేరా
- తాండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- అభినందించిన కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: నియోజకవర్గ అభివృద్ధి కోసమే తెరాసలో చేరుతున్నట్లు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, తాండూరు శాసన సభ్యుడు రోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, నవీన్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తానని రోహిత్‌రెడ్డి చెప్పగా కేటీఆర్ అభినందించారు. తాను అది నుంచి తెరాస సైనికుడినేనని, అనుకోని పరిస్థితుల వల్ల పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు తెరాసలో చేరాలని నిర్ణయించుకున్నట్లు రోహిత్ చెప్పారు. తెరాసలో చేరడం తనకు సొంత ఇంటికి వచ్చిన ఆనందం కలిగిందన్నారు. ఆయన నిర్ణయాన్ని కేటీఆర్ స్వాగతిస్తూ సముచిత నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. తాండూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి సీఎం కేసీఆర్, తాను అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ ప్రశంసలు

రోహిత్ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. తనతో రోహిత్ భేటీ అయిన సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఫోన్‌లో కేటీఆర్ మాట్లాడించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. యువకుడైన రోహిత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్సీ, తాండూరు మాజీ ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డితో కలిసి మెలిసి పనిచేయాలని రోహిత్‌కు సూచించారు.

మహేందర్‌రెడ్డితో రోహిత్‌రెడ్డి భేటీ

సీఎం కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ల ఆదేశాల మేరకు రోహిత్‌రెడ్డి హైదరాబాద్‌లోని పట్నం మహేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా తనను ఆశీర్వదించాలని రోహిత్ కోరారు. మహేందర్‌రెడ్డి ఆయనను అభినందిస్తూ తాండూరు నియోజకవర్గంలో తెరాస అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు పాల్గొన్నారు.

నిర్ఘాంతపోయిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వర్గం

రోహిత్‌రెడ్డి తెరాసలో చేరికతో కాంగ్రెసునేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వర్గం నిర్ఘాంతపోయింది. టీఆర్ఎస్ ప్రారంభంలో ఆ పార్టీలో ఉన్న రోహిత్‌రెడ్డి మొదట్లో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డికి అనుచరుడు. ఆ తర్వాత ఆయనతో విభేదాల కారణంగా పార్టీ నుంచి బయటకు వచ్చారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సన్నిహితుడిగా మారారు. గత డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తాండూరు నుంచి కాంగ్రెస్ టికెట్‌ను దక్కించుకుని మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. అప్పటి నుంచే కాంగ్రెస్‌పై అసంతృప్తితో ఉన్న రోహిత్‌రెడ్డి తెరాసలో చేరేందుకు పలువురు నేతల ద్వారా ప్రయత్నాలు చేశారు. అధిష్ఠానం నుంచి సానుకూలత వ్యక్తమైనప్పటికీ మహేందర్‌రెడ్డి సుముఖంగా లేకపోవడంతో ఆయన చేరిక వాయిదా పడింది. తాజాగా నేరుగా కేటీఆర్‌ను సంప్రదించి పార్టీలో చేరేందుకు రోహిత్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఈ పరిణామం విశ్వేశ్వర్‌రెడ్డి వర్గాన్ని నిర్ఘాంత పరిచింది. మరోవైపు తెరాసలో విలీన ప్రక్రియను కొనసాగించేందుకు దోహదపడింది. వాస్తవానికి ఉత్తర తెలంగాణ నుంచే ఒకరిద్దరు ఎమ్మెల్యేలు చేరితే విలీన ప్రక్రియ సాగుతుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా రోహిత్‌రెడ్డి తెరమీదకు వచ్చారు.

తెలంగాణలో పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ

ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ తరఫున గెలిచిన శాసనసభ్యులను తెరాసలో చేర్చుకోవడం.. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లుగా ఉందని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా విమర్శించారు. ఏఐసీసీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అప్రజాస్వామికంగా తెరాసలో చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఆయా నియోజకవర్గాల్లో తెరాస అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని.. వారు తెరాసలో చేరడం ప్రజాతీర్పును వంచించడమేనని ఆయన ధ్వజమెత్తారు. శాసనసభ్యుల పార్టీ పిరాయింపుల అంశంపై తమ పార్టీ న్యాయపరమైన పోరాటం చేస్తుందని పవన్ ఖేరా తెలిపారు.

కాంగ్రెస్‌లో కోవర్టులున్నారు

టీపీసీసీ ప్రక్షాళనే శరణ్యం: వీహెచ్

హైదరాబాద్, నూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు తెరాసలో చేరి ఏం సాధిస్తారని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు నిలదీశారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, తెరాస శాసనసభాపక్షంలోకి కాంగ్రెస్ శాసనసభాపక్షం విలీనమైతే కాంగ్రెస్ కార్యకర్తలందరూ తలదించుకుంటారన్నారు. పార్టీ విధేయులను అధిష్ఠానం విస్మరించడం, అమ్ముడుపోయేవారికి టికెట్లు కట్టబెట్టడంతోనే కాంగ్రెస్‌లో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో కోవర్టులు ఉన్నారని ఎప్పటినుంచో చెబుతున్నానని, వాళ్ల పేర్లతో త్వరలోనే సోనియాగాంధీతో సమావేశమవుతానని వెల్లడించారు. తెలంగాణ కాంగ్రెసును ప్రక్షాళన చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. వచ్చేవాళ్లు వస్తుంటారు, వెళ్లేవాళ్లు వెళ్తుంటారు..కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం ఎన్నడూ అడ్డిర్యపడరాదని ఆయన కోరారు. జై ఎస్. స్ఫూర్తితో రాష్ట్రమంతటా పర్యటిస్తానని, పార్టీని బలోపేతం చేస్తానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించడాన్ని ఖండించారు. 'ఏమీలో ఉన్న వైకాపాతో మనకు పనేంటి' అని వీహెచ్ సూటిగా ప్రశ్నించారు.

వారు ఇక తెరాస సభ్యులే

- విలీనం కోరుతూ లేఖ ఇచ్చిన 12 మంది కాంగ్రెస్ సభ్యులు..
- నోటిఫికేషన్‌లో పేర్కొన్న శాసనసభ కార్యదర్శి

ఈనాడు, హైదరాబాద్: విలీనం కోరుతూ తీర్మానం చేసి లేఖ ఇచ్చిన 12 మంది కాంగ్రెస్ సభ్యులు ఇకపై తెరాస సభ్యులేనని తెలంగాణ శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు తమ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాంగ్రెసుకు చెందిన 12 మంది సభ్యులు సీఎల్పీని తెరాసలో విలీనం చేయాలంటూ శాసనసభాపతికి లేఖను సమర్పించారని, సభలో కాంగ్రెసుకు 18 మంది సభ్యులు ఉండగా.. అందులో మూడింట రెండొంతుల మంది (12 మంది) రాజ్యాంగం పదో షెడ్యూల్ నాలుగో పేరాగ్రాఫ్‌లో గల సబ్ పేరా (2)ని అనుసరించి విలీనం ద్వారా తమను తెరాస సభ్యులుగా పరిగణించాలని కోరారన్నారు. తెరాస శాసనసభాపక్ష నేత సైతం సీఎల్పీ విలీనాన్ని అంగీకరిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభాపతికి లేఖ రాశారని కార్యదర్శి పేర్కొన్నారు. వీటన్నింటిని పరిగణనలోనికి తీసుకొని శాసనసభాపతి ఈ రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం విలీనాన్ని ఆమోదించారని కార్యదర్శి తెలిపారు. ఈ 12 మంది సభ్యులకు తెరాస సభ్యులతో పాటు సీట్లు కేటాయించాలని అదేశించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శాసనసభలో బలాబలాలు

మొత్తం సభ్యులు 120. ఇందులో 119 మంది ఎన్నికైనవారుకాగా ఒకరు ఆంగ్లోఇండియన్ కోటాలో గవర్నర్ ద్వారా నియమితులైన వారు. డిసెంబరులో 119స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 88 మంది తెరాస తరఫున గెలిచారు. పార్వర్డ్ బ్లాక్ తరఫున గెలిచిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, వైరాలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రాములు నాయక్ ఎన్నికల తర్వాత తెరాసలో చేరారు. దీంతో ఆ పార్టీ బలం 90కి చేరింది. నామినేటెడ్ కోటాలో స్టీఫెన్‌సన్ నియమితులవడంతో తెరాస సభ్యుల సంఖ్య 91 అయింది. తాజాగా 12 మంది కాంగ్రెస్ సభ్యుల చేరికతో మొత్తం బలం 103కి చేరింది. తెదేపా సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య కూడా తెరాసలో చేరేందుకు ముందుకొచ్చారు. ఆయన చేరితే సభ్యుల సంఖ్య 104కి చేరుతుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బలం 19కాగా నల్గొండ ఎంపీగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 18 అయింది. ఇందులో 12 మంది తెరాసలో విలీనం కావడంతో ఇప్పుడు మిగిలిన సభ్యులు ఆరుగురు.

సభలో మొత్తం సభ్యులు 120, తెరాస- 103 (ఒక ఆంగ్లో ఇండియన్ సభ్యుడు), మజ్లిస్- 7, కాంగ్రెస్- 6, భాజపా- 1, తెదేపా- 2, భాఓ- 1

■ తెరాస పార్టీకిబలం 103 కాగా మజ్లిస్ పార్టీ మిత్రపక్షంగా ఉంది. మొత్తం 110 మంది సభ్యుల మద్దతు తెరాసకు ఉన్నట్లే.

నాలుగున్నర నెలల్లో ముగిసిన ముచ్చట

- విలీనంతో కాంగ్రెస్‌కు అన్నీ తారుమారు
- విపక్షనేతకు కేటాయించే సీటు గల్లంతు
- దానిని మజ్లిస్‌కు కేటాయించే అవకాశం
- కాన్వాయ్, ప్రొటోకాల్ రద్దయినట్లే
- ఇక మిగిలిన ఆరుగురు సాధారణ సభ్యులే
- పీఏసీ పదవి దక్కనట్లే
- మజ్లిస్‌కు కలిసొచ్చిన అదృష్టం

ఈనాడు, హైదరాబాద్: తెరాస శాసనసభాపక్షంలో సీఎల్పీ విలీనం వల్ల కాంగ్రెస్ విపక్ష హోదాను కోల్పోవడంతోపాటు పలు రకాలుగా నష్టపోనుంది. గత డిసెంబరులో సాధారణ ఎన్నికలు జరగగా ఆ పార్టీ 19 స్థానాలు గెలిచింది. జనవరి 18న భట్టి విక్రమార్క సీఎల్పీ నేతగా ఎన్నికయ్యారు. సభలో విపక్ష నేత పాత్ర చాలా కీలకమైంది. బడ్జెట్, ఇతర కీలక అంశాలపై చర్చను ప్రారంభించేందుకు విపక్ష నేతకే అవకాశం ఉంటుంది. సభలో ముఖ్యమంత్రి మాట్లాడితే ఆయనను ప్రశ్నించడంతో పాటు తమ సభ్యుల తరఫున మాట్లాడడానికి విపక్ష నేత ముందుకొస్తారు. ఆది నుంచి సభలో అధికార, విపక్ష నేతల మధ్య వాడివేడి చర్చలు జరగడం ఆనవాయితీ. శాసనసభలో ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ పదవిని రెండో అతిపెద్ద పార్టీ లేదా విపక్షానికి ఇవ్వడం ఆనవాయితీ. శాసనసభ కార్యకలాపాల నిర్వహణ, సలహా కమిటీ (బీఏసీ)లోనూ శాసన సభాపక్ష నేతకు సమానంగా విపక్ష నేతకు చర్చించే అవకాశం ఉంటుంది. పార్టీ తరఫున ముగ్గురు వరకు సభ్యులను సిఫార్సు చేయవచ్చు. సభలో సభాపతికి కుడివైపు శాసన సభాపక్షనేత, ముఖ్యమంత్రి ఉంటారు. ఎడమవైపు విపక్ష నేతకు మొదటి సీటును కేటాయిస్తారు. ఆయన సీఎం, మంత్రులతో పాటు నేరుగా వాహనంలో శాసనసభ ఆవరణలోకి రావచ్చు.

సభలోనే కాక రాష్ట్రంలోనూ విపక్ష నేతకు గౌరవం, అతిథి మర్యాద (ప్రొటోకాల్) ఉంటుంది. ఆయనకు కేబినెట్ ర్యాంకు కల్పిస్తారు. భద్రత, కాన్వాయ్ ఉంటాయి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఇతర అతిథులు వచ్చినప్పుడు మంత్రుల వరుసలో ఉంటారు. సమాచార, మానవ హక్కుల కమిషన్ వంటి వాటికి ఛైర్‌పర్సన్ ఎంపిక కమిటీలో సీఎంతో పాటు విపక్ష నేత సభ్యునిగా ఉంటారు.

అన్నీ కోల్పోయినట్లే

విలీనం వల్ల కాంగ్రెస్ విపక్ష హోదా కోల్పోయింది. భట్టి విక్రమార్కకు కేబినెట్ ర్యాంకు రద్దయింది. కాన్వాయ్ ఉండదు. సభలో ఎడమ నుంచి మొదటి సీటులో రెండో అత్యధిక స్థానాలు గల పార్టీకి అవకాశం ఇస్తారు. ఈ లెక్కన మజ్లిస్‌కు ఆ స్థానం దక్కనుంది. ఆ తర్వాత వరుసలో కాంగ్రెసుకు సీట్లు కేటాయిస్తారు. రెండో అత్యధిక సభ్యుల బలం గల పార్టీకే పీఏసీ అధ్యక్ష పదవి వస్తుంది. ఈ లెక్కన మజ్లిస్ సభ్యునికి ఈ పదవి వస్తుంది. ఇదే ప్రాతిపదికన చర్చల్లోనూ మజ్లిస్‌కే ప్రారంభ అవకాశం వస్తుంది. బీఏసీలోనూ కాంగ్రెసుకు ఒకే స్థానం వస్తుంది.

మజ్లిస్‌కు లబ్ధి

సీఎల్పీ విపక్ష హోదాను కోల్పోవడంతో మజ్లిస్ పార్టీని అదృష్టం వరించనుంది. ఆ పార్టీ తెరాస తర్వాత అతిపెద్ద పార్టీగా అవతరించింది. తద్వారా సభలో మొదటి స్థానం, పీఏసీ ఛైర్మన్ పదవి, ఇతరత్రా లాభాలు కలగనున్నాయి.

మిగిలింది వీరే..

శాసన సభాపక్షనేతగా కొనసాగిన ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యేలు డి.శ్రీధర్‌బాబు (మంథని), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), జగ్గారెడ్డి (సంగారెడ్డి) సీతక్క (ములుగు), పొడెం వీరయ్య (భద్రాచలం)

ప్రతిపక్షమే లేకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధం

- మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి

మల్కాజిగిరి, నూస్‌టుడే: ప్రజా తీర్పును గౌరవించి రాష్ట్ర అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేకుండా పాలన జరగాలని ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో జరుగుతున్న అర్యూబీ పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమ పాలనలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించుకోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రజాతీర్పును అగౌరవపరుస్తూ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో విలీనం చేసుకోవటం విచారకరమన్నారు. ప్రభుత్వ తప్పులు ఎత్తి చూపుతూ ప్రతిపక్షం తెలిపే అంశాలను గౌరవిస్తూ పాలన సాగించినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. శాసనసభ నిర్వహణ బాధ్యత స్పీకర్‌దేనని, సభ లేని రోజుల్లో ఆయన ట్రిబ్యునల్‌కు జడ్జీలా పనిచేయాలన్నారు. పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రగతి భవన్‌లో కేటీఆర్ విందు ఏర్పాటు చేయటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రగతి భవన్ కేవలం ముఖ్యమంత్రి కార్యాలయమని, అక్కడ పార్టీవరంగా ఆయన విందులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు.

అనర్హత వేటుపై ఆధారాల సమర్పణ

- హైకోర్టుకు అందజేసిన మండలి తరఫు న్యాయవాది
- పదో షెడ్యూలులోని అంశాలపై భూపతిరెడ్డి లేవనెత్తిన సందేహాలపై విచారణ
- పేరా 8 రాజ్యాంగబద్ధత తేల్చడంలో సహకరించండి
- కేంద్రాన్ని కోరిన తెలంగాణ హైకోర్టు
- యాదవరెడ్డి, రాములునాయక్ పిటిషన్‌లపై నేడు విచారణ

ఈనాడు, హైదరాబాద్: ఎమ్మెల్సీ సభ్యత్వంపై అనర్హతకు సంబంధించిన రికార్డులతోపాటు వీడియోలను ఉపశీర్షికలతో (సబ్‌టైటిల్స్) ఇవ్వాలన్న గత ఆదేశాల మేరకు అన్ని రికార్డులను సీల్డ్‌కవర్‌లో మండలి తరఫు న్యాయవాది హైకోర్టుకు అందజేశారు. దీనికి సంబంధించి వార్తా కథనాలున్న పత్రికల క్లిప్పింగ్‌లు, వీడియోలు, నోటిఫికేషన్లు తదితర ఆధారాలను సమర్పించారు. ఎమ్మెల్సీ సభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ మండలి ఛైర్మన్ జనవరి 16న వెలువరించిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్సీలు కె.యాదవరెడ్డి, భూపతిరెడ్డి, ఎస్.రాములునాయక్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

అనర్హత వేటుకు సంబంధించి రాజ్యాంగంలోని 10వ షెడ్యూలులోని 8వ పేరా మౌలిక నిర్మాణ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, మండలి అనర్హత నిబంధనలోని 7(4) రాజ్యాంగ విరుద్ధమంటూ భూపతిరెడ్డి లేవనెత్తిన రాజ్యాంగ సందేహాలపై విచారణ కొనసాగింది. కేంద్రం తరఫు న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ..అనర్హతకు సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం మండలి ఛైర్మన్‌కు ఉందని, దీనికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పులను ప్రస్తావించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ..ఇప్పటివరకు పదో షెడ్యూలులోని 6, 7 పేరాల రాజ్యాంగబద్ధత గురించి మాత్రమే చర్చించిందని, 8వ పేరా గురించి ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొంది. దేశంలోనే మొదటిసారిగా ఈ హైకోర్టు ముందు 8వ పేరా రాజ్యాంగబద్ధత అంశం ఉందని, దీన్ని తేల్చడానికి సహకరించాలని కోరింది.

సహజ

వైద్య సీట్లకు దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈడబ్ల్యూఎస్ కోటాపై స్పష్టత ఇచ్చిన ఎంసీఐ
- రాష్ట్రంలో 298 ఎంబీబీఎస్ అదనపు సీట్లకు దరఖాస్తు

ఈనాడు - హైదరాబాద్

ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కోటా కింద ఎంబీబీఎస్ సీట్లను అదనంగా పొందడానికి రాష్ట్రాల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువును భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) ఈనెల 11 వరకూ పొడిగించింది. శుక్రవారం తుదిగడువుగా ఉండగా కొన్ని రాష్ట్రాల నుంచి వివిధ అంశాలపై స్పష్టత కోరుతూ అభ్యర్థనలు రావడంతో గడువు పొడిగించింది. 2019-20 వైద్య విద్య సంవత్సరం నుంచే ఈ కోటాను అమలు చేయాలని కేంద్రం ఉత్తర్వులిచ్చింది. ఈ కోటా కింద 10 శాతం సీట్లను కేటాయించాలి. ప్రస్తుతమున్న రిజర్వేషన్ల నిబంధనలకు ఆటంకం కలగకుండా సీట్లను భర్తీ చేయాలంటే.. అదనంగా 25 శాతం సీట్లను పొందాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తాజాగా పంపించిన మార్గదర్శకాల్లో పేర్కొంది. అదనంగా పెంచనున్న సీట్లకు తగ్గట్టుగా ఇప్పటికిప్పుడు బోధనా సిబ్బందిని నియమించక్కరలేదని, మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం కూడా లేదని వెసులుబాటు ఇచ్చింది. వచ్చే రెండేళ్లలో పెంపుదలకు తగ్గట్టుగా వసతులు, మానవ వనరులున్నాయా? లేవా? అనే నిబంధనలను తనిఖీ చేస్తామని పేర్కొంది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగా ఏర్పడిన మహబూబ్‌నగర్, సిద్దిపేట వైద్య కళాశాలలతో పాటు 2019-20 నుంచి అందుబాటులోకి రానున్న నల్గొండ, సూర్యాపేట కళాశాలల్లోనూ ఈ సీట్ల పెంపు విధానం అమలవుతుంది. ఇప్పటికే 250 ఎంబీబీఎస్ సీట్లున్న వైద్య కళాశాలలకు ఈ అదనపు సీట్ల పెంపుదల వర్తించదని తాజా ఆదేశాల్లో ఎంసీఐ స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రంలో ఉస్మానియా వైద్యకళాశాలలో అదనపు సీట్ల పెంపునకు మార్గం మూసుకుపోయింది. రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఉస్మానియా మినహాయించి మిగిలిన వైద్య కళాశాలల్లో అదనంగా 298 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని కోరుతూ వైద్య విద్య సంచాలకులు ఎంసీఐకి దరఖాస్తు పంపారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈఎస్ఐ వైద్య కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లుండగా.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసేది 50 సీట్లు. ఈ పరిస్థితుల్లో ఈఎస్ఐ కళాశాలలో సీట్ల పెంపుదల అంశంపై కేంద్రమే నిర్ణయం తీసుకుంటుందని, ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెంపుదల దరఖాస్తును పంపించాల్సిన అవసరం లేదని వైద్యవర్గాలు తెలిపాయి.

తాజాగా కళాశాలల వారీగా పెరగనున్న ఎంబీబీఎస్ సీట్లు

కళాశాల	ప్రస్తుతం	అదనం	మొత్తం
గాంధీ	200	50	250
కాకతీయ	200	50	250
నిజామాబాద్	100	25	125
రిమ్స్ ఆదిలాబాద్	100	25	125
మహబూబ్‌నగర్	150	37	187
సిద్దిపేట	150	37	187
నల్గొండ	150	37	187
సూర్యాపేట	150	37	187
మొత్తం	1,200	298	1,498

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు 1,08,175

- ఏఐసీటీఈ అనుమతి పొందిన 200 కళాశాలలు
- ఎంసీఏ సీట్లు 3,391కి పరిమితం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్, బీఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మా-డి కోర్సులు నిర్వహించేందుకు యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలు, జాతీయ సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతి పొందిన ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలల వివరాల్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించింది. తెలంగాణలో యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలు, ప్రైవేటు కళాశాలలతో ఇంజినీరింగ్ కళాశాల సంఖ్య 214గా ఉన్నట్లు వెల్లడించింది. వాటిలో సీట్ల సంఖ్య 1,08,715కు చేరింది. రాష్ట్రంలో యూనివర్సిటీ, అనుబంధ 14 కళాశాలల్లో దాదాపు 3,055 సీట్లు ఉన్నాయి. అనుమతి పొందిన కళాశాలల వివరాలతో పాటు గత ఏడాది కౌన్సెలింగ్‌లో ఏ ర్యాంకు విద్యార్థులకు ఏయే కళాశాలల్లో సీట్లు లభించాయన్న వివరాలతో కూడిన సమాచారాన్ని http://www.sbtet.telangana.gov.in వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు ఉన్నత విద్యామండలి వెల్లడించింది.

యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలు

కోర్సు	కళాశాలలు	సీట్లు
ఇంజినీరింగ్	14	3,055
బీఫార్మసీ	3	180
ఎంబీఏ	19	1,290
ఎంసీఏ	13	670

ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు

కోర్సు	కళాశాలలు	సీట్లు
ఇంజినీరింగ్	200	1,05,120
బీఫార్మసీ	124	10,762
ఎంబీఏ	303	41,049
ఎంసీఏ	36	2,721
ఫార్మా-డి	60	1,770

ఈ నెల 10న డిగ్రీ ప్రవేశాల తొలిజాబితా

సంప్రదాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి తొలివిడత జాబితాను ఈనెల 10న విడుదల చేయనున్నట్లు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (డోస్ట్) కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఇప్పటివరకు 1,10,361 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇచ్చారని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ నెల 10 తరువాత కొత్తగా రిజిస్టర్ చేసుకోవచ్చని సూచించారు.

నీట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

దాదాపు 150 మంది ప్రవేశాలకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలకు చెందిన 150 మంది విద్యార్థులు వైద్యవిద్య ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్ష నీట్‌లో ప్రతిభ చూపించారు. వీరంతా రిజర్వు కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు పొందే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని ఎస్సీ, ఎస్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పేదవర్గాలకు చెందిన విద్యార్థులు గురుకులాల్లో ఇంటర్మీడియట్‌తో పాటు శిక్షణ పొందారని, సొసైటీ చేపట్టిన ఆపరేషన్ బ్లూక్రిస్టల్, ఆపరేషన్ ఎమరాల్డ్ కార్యక్రమాల కింద ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. 2019-20 ఏడాదికి 150 మంది విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తాయని వివరించారు. ఎస్సీ గురుకులాల నుంచి 100 మంది, ఎస్టీ గురుకులాల నుంచి 50 మందికి అవకాశాలు ఉన్నాయని వివరించారు. 'ప్రైవేటుగా శిక్షణ ఇప్పించే ఆర్థిక స్థాయి మా తల్లిదండ్రులకు లేదు. గురుకులాల్లో ఇచ్చిన శిక్షణతో సీట్ ర్యాంకు సార్థమైంది' అని ఎస్సీ కేటగిరీలో ఆలిండియా 509 ర్యాంకు పొందిన కొవ్వూరి రసజ్ఞ తెలిపారు. గురుకుల విద్యార్థుల ర్యాంకుల పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థి	మార్కులు	ఆలిండియా ర్యాంకు
ఎస్టీ కేటగిరీలో		
దరావత్ రాజేష్	528	162
కె.చిన్న	524	174
కేతావత్ విష్ణు	488	391
భానోత్ చందూలాల్	478	467
భానోత్ రవికుమార్	472	539
రమావత్ స్నేహలత	452	802
ఎస్సీ కేటగిరీలో		
కొవ్వూరి రసజ్ఞ	543	509
ఎం.అన్వేష్	535	619
జీసీ కేటగిరీలో		
కె.రాజ్‌కుమార్	528	13,789

16 నుంచి జోసా ప్రవేశాలకు ఛాయిస్ ఫిల్లింగ్ ప్రారంభం

నిట్‌క్యాంపస్, న్యూస్‌టుడే: దేశంలోని పలు ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతో నడుస్తున్న సాంకేతిక విద్యాసంస్థల్లోని బీటెక్ కోర్సుల్లో (2019-20) ప్రవేశం కోసం జోసా ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ జూన్ 16 నుంచి ప్రారంభమవుతుందని వరంగల్ ఎన్ఐటీ ప్రవేశాల ఛైర్మన్ ఆచార్య కేఎన్ఎస్.విశ్వనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సంయుక్త సీట్ల కేటాయింపు ప్రాధికార సంస్థ(జోసా) ప్రవేశాల నిర్వహణ బాధ్యతలను తమిళనాడులోని తిరుచిరాపల్లి ఎన్ఐటీ చూస్తోంది. దేశంలోని ప్రతిష్ఠాత్మక సాంకేతిక సంస్థల్లో ప్రవేశాలను ఈసారి ఏడు దఫాలుగా కేటాయించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. జూన్ 16 నుంచి 26వ తేదీ వరకు ఛాయిస్ ఫిల్లింగ్ (కళాశాలలు, కోర్సుల ఎంపిక ప్రక్రియ)కు గడువు నిర్ణయించి 27న తొలిరౌండ్‌లో సీట్లు లభించిన వారి వివరాలను జోసా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచడానికి మరికొంత సమయం పట్టే అవకాశముంది.

జోసా కౌన్సెలింగ్‌పై వరంగల్ నిట్‌లో 14న అవగాహన

జూన్ 14న వరంగల్ నిట్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అధ్యయన కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు జోసా కౌన్సెలింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రవేశాల అధికారి తెలిపారు. జోసా కౌన్సెలింగ్‌కు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేయడం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

- ఎగ్జిబిషన్ మైదానంలో ప్రభుత్వ శాఖల ఏర్పాట్లు

హైదరాబాద్(అబిడ్స్), న్యూస్‌టుడే: మృగశిరకార్తెను పురస్కరించుకొని ఈ నెల 8న నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే చేప ప్రసాదం పంపిణీ కోసం ఏర్పాట్లన్నీ పూర్తి కావచ్చాయి. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి చేపట్టిన ఏర్పాట్లు గురువారం రాత్రికి కొలిక్కి వచ్చాయి. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ.. మైదానంలో ఏర్పాట్లు శరవేగంగా జరిగేలా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో ఉబ్బసం వ్యాధిగ్రస్తులు చేప ప్రసాదం స్వీకరించేందుకు ఎగ్జిబిషన్ మైదానం చేరుకున్నారు.

మత్స్యశాఖ లక్షా అరవై వేల చేప పిల్లలను సిద్ధం చేసినట్లు ఆ శాఖ కమిషనరు ప్రకటించారు. జలమండలి తరఫున ఎగ్జిబిషన్ మైదానం లోపల, బయట నాలుగున్నర లక్షల మంచినీటి ప్యాకెట్లను ఉచితంగా అందజేసే వ్యవస్థను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ గురువారం నుంచి ఇక్కడ రూ.5కే భోజనం ప్రారంభించింది. మూడు వందల మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించింది. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో బ్యారికేడ్లు, ఫ్లడ్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా డీసీపీ బాబూరావు; శాంతి భద్రతల పరంగా ఇబ్బంది లేకుండా మధ్య మండలం డీసీపీ విశ్వప్రసాద్ నేతృత్వంలో అబిడ్స్ ఏసీపీ బిక్షంరెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు వెయ్యి మంది పోలీసులు విధులు నిర్వహించేలా కార్యాచరణను రూపొందించి పలు సెక్టార్లుగా విభజించారు. వైద్య, ఆరోగ్య శాఖ అంబులెన్సులను సిద్ధం చేసింది. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోంది.

ట్రంప్‌ను జైల్లో చూడాలనుకుంటున్న నాన్సీ పెలోసీ

వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అమెరికా హౌస్ స్పీకరు నాన్సీ పెలోసీ జైల్లో కటకటాల వెనుక చూడాలనుకుంటున్నారని ఉవ్విళ్లూరుతున్నారట. ట్రంప్‌పై అభిశంసన తీర్మానం పెట్టడం కంటే వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఓడిపోవాలని ఆకాంక్షిస్తున్నారని అమెరికాలో ప్రసిద్ధ మీడియా "పొలిటికో" చెబుతోంది.

తోటి డెమాక్రాట్లతో జరిగిన రహస్య సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపింది. హౌస్ కమిటీ ఛైర్మన్‌తో మంగళవారం జరిగిన సమావేశంలో అభిశంసన దర్యాప్తు ప్రారంభించడంపై జ్యుడీషియరీ ఛైర్మన్ జెర్రీ నాడ్లర్‌తో ఆమె ఘర్షణ పడ్డారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓడిన తరువాత ఆయనపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపించడానికే పెలోసీ మొగ్గు చూపుతున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై జరిగిన దర్యాప్తునకు ట్రంప్ చట్టవ్యతిరేకంగా అవాంతరాలు కల్పించారని డెమాక్రాట్లు ఆరోపిస్తున్నారు. ఆయనతో వివాహేతర సంబంధం ఉన్న ఇద్దరు మహిళలకు ఎన్నికల ముందు డబ్బులు ఇచ్చి వారి నోరు మూయించారని కూడా ఆరోపిస్తున్నారు. విదేశీ ప్రభుత్వాల నుంచి అధ్యక్షపోదాలో ఆర్థిక ప్రయోజనాలు పొందారని నమ్ముతున్నారు.

ఫీజు చెల్లించినా హాల్‌టికెట్ రాలే

మరోసారి బైటపడిన ఇంటర్ అధికారుల నిర్వాకం

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: ఇంటర్ అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. సప్లిమెంటరీ పరీక్ష రుసుం చెల్లించినా విద్యార్థులకు హాల్‌టికెట్ రాలేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బి.రాజేశ్ అనే విద్యార్థి రెండో సంవత్సరంలో సప్లిమెంటరీలో ఆంగ్లం పరీక్ష కోసం గత నెల 27న రుసుం చెల్లించాడు. మరో సీఈసీ విద్యార్థి సైతం ఒక సబ్జెక్టుకు రుసుం చెల్లించాడు. శుక్రవారం నుంచి పరీక్షలు మొదలుకానున్నాయి. కానీ వారికి మాత్రం హాల్‌టికెట్లు రాలేదు.

హాల్‌టికెట్ కోసం కళాశాలకు వెళ్లగా రాలేదని చెప్పటంతో విద్యార్థులు ఖంగుతిన్నారు. దీంతో తాము సప్లిమెంటరీ పరీక్షలు రాయలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రధానాచార్యుల దృష్టికి తీసుకునివెళ్లినా తమకేమి సంబంధంలేనట్లు వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై కళాశాల ప్రధానాచార్యులను 'న్యూస్‌టుడే' సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. ఇంటర్ విద్యాధికారి అజత్ ఆలీని సంప్రదించగా నోడల్ అధికారిని సంప్రదించాలని తెలిపారు. జిల్లా నోడల్ అధికారి వెంకన్నను ప్రశ్నించగా పరిశీలిస్తామని చెప్పారు.

వాతావరణ మార్పులపై శ్రద్ధ పెట్టని భారత్, చైనా

రాజకీయ అజెండాతో పని చేస్తున్న శాస్త్రవేత్తలు: ట్రంప్

లండన్: వాతావరణ మార్పులపై భారత్, చైనాలాంటి దేశాలు తగినంత శ్రద్ధ పెట్టడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబట్టారు. ఈ దేశాల్లో శ్వాసించడం కూడా కష్టమేనని, కానీ అమెరికాలో మాత్రం స్వచ్ఛమైన గాలి ఉందన్నారు. ఇంగ్లాండులో మూడురోజుల పర్యటనను ముగించుకుని బర్మింగ్‌హామ్‌కు వెళ్తున్న ఆయన బ్రిటన్‌కి చెందిన 'ఐటీవీ ఛానల్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. "చైనా, రష్యా, భారత్, పలు ఇతర దేశాల్లో మంచి గాలి, నీరు లేవు. కాలుష్యం, పరిశుభ్రత గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. వారికి బాధ్యత లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిష్ఠాత్మక పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి 2017లో అమెరికా వైదొలగడాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. "ఒకప్పుడు భూతాపం అనేవారు. అది పనిచేయలేదు. అప్పుడు వాతావరణ మార్పు అనడం ప్రారంభించారు. ఇప్పుడు తీవ్రమైన వాతావరణం అంటున్నారు. ఎందుకంటే తీవ్రం అంటే మనం ఎక్కువ దృష్టి పెడతాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. వాతావరణ శాస్త్రవేత్తలు రాజకీయ అజెండాతో పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వాతావరణ మార్పును బూటకమని కొట్టిపారేసిన ఆయన, తరువాత తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు.

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

తితిదే, చిత్తూరు జిల్లా అధికారులకు సీఎస్ ఆదేశం

తిరుపతి(రామన్న), న్యూస్‌టుడే: భారత ప్రధాని నరేంద్ర మోదీ తిరుమల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం ఆదేశించారు. గురువారం అమరావతిలోని తన కార్యాలయం నుంచి చిత్తూరు జిల్లా కలెక్టర్ నారాయణ్ భరత్‌గుప్తా, తితిదే ఈవో సింఘాల్, అధికారులతో వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న ప్రధాని శ్రీలంక కొలంబో విమానాశ్రయం నుంచి భారత వాయుసేన విమానంలో సాయంత్రం నాలుగున్నరకు రేణిగుంటకు చేరుకుంటారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం స్వాగత ఏర్పాట్లు చేయాలని, విమానాశ్రయం బయట కొద్దిసేపు ఆగి ప్రజలనుద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రధాని పర్యటనలో పాల్గొననున్నట్లు తెలిపారు. తిరుమలలో సాయంత్రం ఆరింటికి స్వామివారి దర్శనం చేసుకుంటారని వివరించారు. వరాహస్వామిని కూడా దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేరోజు రాత్రి 7.20 గంటలకు తిరుమల నుంచి బయలుదేరి 8.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని ఢిల్లీ తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు.

రైతుల పేరుతో రుణాలు

అక్రమాలకు పాల్పడ్డ రాజకీయ నేత సంస్థలపై ఈడీ దాడులు

ముంబయి, దిల్లీ: రైతుల పేరుతో రుణాలు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డ ఓ రాజకీయ నేత సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం దాడులు చేసింది. మహారాష్ట్రలోని పర్భణీ జిల్లా, ముంబయిల్లోని తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. రత్నాకర్ గుత్తే అనే నాయకుడు గంగామ్లేడ్ సుగర్ అండ్ ఎనర్జీ పేరుతో కంపెనీని ఏర్పాటు చేశారు. 2015లో 'కేత - రావణ విధానం' కింద 600మందికిపైగా రైతుల పేర్లతో చక్కెర కర్మాగారం తరఫున బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నారు. రుణం బకాయిలను చెల్లించాలని బ్యాంకుల నుంచి రైతులకు నోటీసులు అందడంతో అందోళన మొదలయింది. కొందరు రైతులకు రూ.25 లక్షల వరకు బాకీ ఉన్నట్లు నోటీసులు అందాయని మహారాష్ట్ర శాసనమండలిలో విపక్షనేత ధనుంజయ్ ముండే ఆరోపించారు. రైతుల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకుల నుంచి రూ.5,400 కోట్ల రుణాలు పొందారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రత్నాకర్‌పై నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి.

బళ్లారి వెళ్లేందుకు అనుమతివ్వండి

గాలిజనార్దన్‌రెడ్డి మరోసారి విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ, ఈనాడు డిజిటల్, బెంగళూరు: అక్రమ గనుల కేసుల్లో మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన అనంతరం బెయిలుతో బయటకు వచ్చిన కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి బళ్లారి వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గురువారం జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అజయ్ రస్తోగిల ధర్మాసనం గాలి విజ్ఞప్తిని అనుమతిస్తూ శుక్రవారం పిటిషన్‌పై విచారిస్తామని పేర్కొంది. తన మామ అనారోగ్యంతో ఉన్నారని, బళ్లారిలోని ఓ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, తాను బళ్లారి తప్పనిసరిగా వెళ్లాల్సి ఉందని గాలి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ కేసులో 2015 జనవరిలో సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను గాలి జనార్దనరెడ్డికి మంజూరు చేసింది. ఈ కేసులకు సంబంధించిన సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో ఆయనను బళ్లారిలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప, అనంతపురం జిల్లాల్లో అడుగు పెట్టనీయకుండా సుప్రీంకోర్టు షరతులు విధించిన విషయం తెలిసిందే.

న్యాయ నిర్బంధానికి కలబుర్గి హత్య నిందితులు

బెంగళూరు, న్యూస్‌టుడే: సాహితీవేత్త ఎం.ఎం.కలబుర్గి హత్య కేసులో ప్రధాన నిందితులు అమోల్ కాళే, ప్రవీణ్ చతుర్‌లను రెండు వారాలపాటు న్యాయ నిర్బంధానికి పంపించాలని ధార్వాడలోని మూడో జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం ఆదేశించింది. బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో ఉన్న వీరిని విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు దళం ధార్వాడకు తోడ్కొని వెళ్లింది. హత్య క్రమాన్ని తెలుసుకునేందుకు పంచనామా చేసి, న్యాయస్థానం ముందు వీరిని గురువారం హాజరుపరిచారు. అవసరమైతే ఇతర నిందితులనూ ధార్వాడకు తీసుకెళ్తామని సిట్ అధికారులు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు

WANTED
Wanted well Experienced **Educationl Counsellors, Marketing Managers** and **Hostel Wardens** to work for **Abroad Medical University**
Qua: Any Graduate | **Sal:** Negotiable
Exp: 2+ years relevant experience desirable
Location: AP + TS : All Dist Head Qtrs
SOUTHWESTERN UNIVERSITY
Cebu City, Philippines
For details contact our representative - *ravikanth7979@gmail.com*
Mobile : 9030256565,9030257575

zomato
"జొమాటోలో డెలివరీ పార్టనర్‌గా జాయిన్ అవ్వండి. నెలకు 12000 వరకు సంపాదించడానికి త్వరపడండి. ఇప్పుడే జొమాటోలో జాయిన్ అయ్యి Rs. 2000 వరకు జాయినింగ్ బోనస్ పొందండి.
జాయిన్ అవ్వడానికి క్రింద ఉన్న నంబర్స్‌కి మిస్‌కాల్ ఇవ్వండి"
1) Kamareddy - 04049171490
2) Nirmal - 04049171497
3) Bodhan Rural - 04045209894
4) Nalgonda - 04049171487
5) Medak - 04049171486

GSFC Agrotech Limited
PO: FERTILIZERNAGAR-391 750. DIST. VADODARA
UNITING TALENT WITH OPPORTUNITY
GSFC Agrotech Limited (GATL) a wholly owned subsidiary of GSFC Limited, has been established with an objective to cater to its huge marketing network and promote Agro Products & Agro Services to bring revolution in Agri Business.
WALK IN INTERVIEW
Jr. Executive / Executive (Agri Business)
Date: 10/06/2019, Monday
Venue: Hampshire Plaza Hotel, 6-1-79 & 80, Telephone Bhavan Road, Lakdikapul, Hyderabad
Reporting Time: 09:30 AM
Closing Time: 15:00 PM
Fresh/ Experienced M.Sc/B.Sc (Agriculture) Graduate with minimum 50% and Computer Literacy. Age not more than 28 years as on 01.06.2019. Candidates strictly meeting the advertised criteria are invited
The desirous candidates may appear for walk-in-interview along with all the certificates in original (and self attested print outs) of Aadhar/ PAN, qualification, experience, Payslips (last 3 months), CV and 2 passport size photographs. Those unable to appear may mail their CVs at gatl@gsfcltd.com latest by 18.06.2019.


A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell: 90001 80623

JOIN US FOR SETTING THE STANDARDS OF EXCELLENCE IN MEDICAL EDUCATION
PMRIMS is now permitted by Medical Council of India. With state-of-the-art facilities and a sprawling campus it wishes to bring the best in education, research and patient care to Hyderabad. PMRIMS is managed by SR Educational Academy and Rinish Educational Society with an experience of 50 years. SR Educational Academy has been at the helm of education with several schools, junior colleges, degree colleges, engineering colleges under its belt. It wishes to bring the same expertise and management to PMRIMS.
PMRIMS requires qualified **Professors, Associate Professors, Assistant Professors, Tutors, Junior Residents and Senior Residents** in the following departments:
Clinical department (Few Vacancies Only) General Medicine, Paediatrics, General Surgery, OBG, Orthopedics, Dermatology, Psychiatry, Anesthesia, Dental, Ophthalmology, Radiology, ENT, TB and Chest.
Pre and Para Clinical Departments (Few Vacancies Only) Anatomy, Physiology, Biochemistry, Pharmacology, Pathology, Microbiology, Forensic Medicine and Community Medicine.
Required Radiographers, OT Technicians, Lab Technicians, Staff Nurses and Nursing Superintendent.
Qualifications and experience as per MCI norms | Salary is not a constraint for deserving candidates
Candidates willing to reside in campus preferred | Candidates may mail their Resume to pmrims@gmail.com with the expected date of joining.
Walk-in Interview
Date: Sunday, June 9th, 2019 | Time: 10.30 am onwards | Mobile No: 99080 60712, 98855 25300
Venue: Greenpark Hotel, Greenlands, Begumpet, Hyderabad.
SR Educational Academy
RINISH EDUCATIONAL SOCIETY
Dr. PATNAM MAHENDER REDDY INSTITUTE of MEDICAL SCIENCES
SH-4, Hyderabad, Ranga Reddy, Vikarabad Road, Chevella, Telangana-501 503.

సెన్సెక్స్	నిఫ్టీ	డోజోన్స్	నాస్‌డాక్	రూపాయి	ముడి చమురు
39530 ▼ 554	11844 ▼ 178	25628 ▲ 88	7578 ▲ 02	69.28 ▼ 2 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	60.59 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	6వ	మార్పు%
COAL INDIA	269.15	2.18
TITAN COMPANY	1269.45	1.72
HERO MOTOCORP	2788.75	1.31
POWER GRID CORP	195.45	1.30
HINDUSTAN UNILEVER	1837.75	1.22
NTPC	136.55	1.11
ASIAN PAINTS	1428.55	0.50

గ్రహణం (-)

నిఫ్టీ	6వ	మార్పు%
GAIL (INDIA)	316.30	-11.71
INDIABULLS HSG FIN	735.80	-7.62
INDUSIND BANK	1522.65	-7.04
YES BANK	143.40	-6.15
SBI	336.90	-4.40
L&T	1515.90	-3.43
BPCL	397.05	-2.77

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	63.16	73.24	బహ్రెయిన్ దీనార్	170.68	195.60
పౌండ్ స్టెర్లింగ్	80.13	92.93	కువైట్ దీనార్	188.73	234.63
యూరో	70.93	82.27	ఒమన్ రియాల్	166.85	191.63
జపనీస్ యెన్/100	58.36	67.68	సౌదీ రియాల్	16.75	19.90
ఆస్ట్రేలియా డాలరు	44.03	50.94	యూఏఈ దిర్హమ్	17.15	20.10
సింగపూర్ డాలరు	46.25	54.79	మలేషియా రింగిట్	14.82	18.22
థాయ్ బాత్/100	201.16	240.58	వైస్ యువాన్	7.1	11.53

విప్రో ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ

- అజీమ్ ప్రేమ్‌జీ జులై 30న పదవీ విరమణ
- 2024 వరకు బోర్డులో కొనసాగుతారు

తండ్రీతనయులు: అజీమ్ ప్రేమ్‌జీతో రిషద్ ప్రేమ్‌జీ

దిల్లీ: విప్రో వ్యవస్థాపకులు అజీమ్ హెచ్.ప్రేమ్‌జీ, సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. జులై 30న ఆయన పదవీ విరమణ చేసి, తనయుడు రిషద్ ప్రేమ్‌జీకి బాధ్యతలు అప్పగించనున్నారు. ప్రస్తుతం రిషద్ సంస్థ ముఖ్య వ్యూహాత్మక అధికారిగా, నాస్‌కామ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'ప్రేమ్‌జీ గత 53 ఏళ్లుగా కంపెనీని సమర్థంగా నడిపించారు. వచ్చే నెలలో ఆయన 74 ఏళ్లు పూర్తి చేసుకుని 75వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఆయన ప్రస్తుత పదవీ కాలం జులై 30న ముగియబోతోందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే, బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, వ్యవస్థాపక ఛైర్మన్‌గా అయిదేళ్లపాటు (2024 జులై వరకు) ఆయన కొనసాగనున్నారు.

విప్రో ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అబిదాలీ జెడ్.నీముచ్‌వాలాను తిరిగి నియమిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. రిషద్ ప్రేమ్‌జీని పూర్తి కాల డైరెక్టర్‌గా అయిదేళ్ల కాలానికి తిరిగి నియమిస్తూ తీర్మానం చేసింది. ఆయన 2019 జులై 31 నుంచి 2024 జులై 30 వరకు ఈ పదవిలో ఉంటూ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ మార్పులు వాటాదార్ల ఆనుమతితో 2019 జులై 31 నుంచి అమల్లోకి రానున్నాయి.

దాతృత్వ కార్యక్రమాలకే పెద్దపీట

పద్మ భూషణ్, పద్మ విభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్న అజీమ్ ప్రేమ్‌జీ పదవీ విరమణ తర్వాత ఎక్కువ సమయాన్ని దాతృత్వ కార్యక్రమాలకు కేటాయించనున్నారు. మన దేశ చరిత్రలోనే దాతృత్వం అంటే ఎక్కువగా వినిపించే పేరు ప్రేమ్‌జీదే. గత మార్చిలో కూడా కంపెనీకి చెందిన రూ. 52,750 కోట్ల విలువైన షేర్లను దాతృత్వ కార్యక్రమాల కోసమే అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌కు బహుమతిగా అందించారు. ప్రేమ్‌జీ నియంత్రణలో ఉన్న పలు కంపెనీల్లోని 34 శాతం వాటాల్ని ఆయన ప్రేమ్‌జీ ఫౌండేషన్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. వీటి విలువ సుమారు రూ.1.4 లక్షల కోట్లు. వీటిపై వచ్చే లాభాలతోనే ఫౌండేషన్ పలు దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రధానంగా విద్యా రంగంలో ఈ స్వచ్ఛంద సంస్థ సేవలు అందిస్తోంది. లాభాపేక్ష లేని సుమారు 150 సంస్థలకు ఆర్థికంగా గ్రాంటు విడుదల చేస్తోంది.

రిషద్ నాయకత్వంలో ముందుకు..

'సుదీర్ఘ, సంతృప్తికర ప్రయాణం కొనసాగించాను. భవిష్యత్తులో ఎక్కువ సమయం దాతృత్వ కార్యక్రమాలకే కేటాయించాలని అనుకుంటున్నా. నా తనయుడు రిషద్ ప్రేమ్‌జీ నాయకత్వంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కంపెనీని మరో స్థాయికి తీసుకెళ్లగలిగే సత్తా అతనికి ఉంద'ని అజీమ్ ప్రేమ్‌జీ ఆశాభావం వ్యక్తం చేశారు. 'పటిష్ఠ విలువల పునాదులు, రాజీ లేని విధానాలతోనే విప్రో గత కొన్ని దశాబ్దాలుగా విజయాలు అందుకుంటూ వచ్చింది. భవిష్యత్తులోనూ మా వాటాదార్లకు మంచి విలువ అందించేందుకు కృషి చేస్తాన'ని కొత్తగా ఎంపికైన ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ వెల్లడించారు.

చిన్న సంస్థ నుంచి దిగ్గజ సంస్థగా..

చిన్న స్థాయి నూనె తయారీ సంస్థగా మొదలైన విప్రో నేడు 8.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.60,000 కోట్లు) కంపెనీగా అవతరించిందంటే దాని వెనుక ప్రేమ్‌జీ కృషి చాలానే ఉంది. గడిచిన 53 ఏళ్లుగా ఆయన నిరంతరం శ్రమిస్తూ సంస్థను ముందుకు నడిపించారు. అంతర్జాతీయ ఎఫ్ఎంసీజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్, మెడికల్ డివైజెస్ పవర్‌హౌస్‌గా విప్రో ఎంటర్‌ప్రైజెస్‌ను తీర్చిదిద్ది, ఏడాదికి 2 బిలియన్ డాలర్ల (రూ.14,000 కోట్లు) ఆదాయం ఆర్జించే స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కృషి ఎనలేనిది. విప్రో ఎంటర్‌ప్రైజెస్‌కు ఛైర్మన్‌గా ఉంటూ, విప్రో-జీతం హెల్త్‌కేర్ బోర్డులో ఆయన కొనసాగుతారని తెలుస్తోంది.

వృద్ధి భయాలతో బెంబేలు

2.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

- పడిపోయిన స్టాక్ మార్కెట్లు
- 554 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 2019లో సూచీలకు ఒకరోజు అత్యధిక నష్టమిది

సమీక్ష

సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాలు చవిచూశాయి. ఆర్‌బీఐ కీలక రేట్ల కోత విధించినప్పటికీ.. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) సంక్షోభానికి సంబంధించి ఎటువంటి చర్యలు ప్రకటించకపోవడం, జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గించడం మదుపర్ల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం చూపాయి. కీలక రేట్ల ఆధారిత బ్యాంకింగ్, వాహన, స్థిరాస్తి షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. మదుపర్ల సంపద రూ.2.2 లక్షల కోట్లు ఆవిరైంది. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు లాభాల్లో ప్రారంభమయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 40,136.43 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అదే జోరులో 40,159.26 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. తదుపరి నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 39,481.15 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 553.82 పాయింట్ల నష్టంతో 39,529.72 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177.90 పాయింట్లు కోల్పోయి 11,843.75 దగ్గర స్థిరపడింది. 2019లో సూచీలకు ఒకరోజు అత్యధిక నష్టమిది.

■ ఆర్‌బీఐ రేట్ల కోత నేపథ్యంలో రేట్ల ఆధారిత షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్లలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ 6.97%, బీఓబీ 6.39%, యెస్ బ్యాంక్ 6.15%, ఎస్‌బీఐ 4.34%, ఫెడరల్ బ్యాంక్ 2.69%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.75%, యాక్సిస్ బ్యాంక్ 1.38%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.18% చొప్పున దీలాపడ్డాయి. వాహన షేర్లలో ఎంఆర్‌ఎఫ్ 3.12%, ఎం అండ్ ఎం 2.48%, టాటా మోటార్స్ 2.08%, అశోక్ లేలాండ్ 1.77% మేర కుదేలయ్యాయి. స్థిరాస్తి షేర్లలో గోద్రేజ్ ప్రాపర్టీస్ 4.13%, ఒబెరాయ్ రియాల్టీ 3.60%, డీఎల్‌ఎఫ్ 2.53%, ఫీనిక్స్ మిల్స్ 2.22%, ఒమాక్సే 1.64%, శోభా 1.56% వరకు పడ్డాయి.

■ దేశీయ రేటింగ్ సంస్థలు ఇక్రా, క్రిసిల్ రేటింగ్ తగ్గించడంతో డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు విలవిలలాడింది. ఇంట్రాడేలో 18 శాతం క్షీణించిన షేరు రూ.91.50 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 15.86 శాతం నష్టంతో రూ.93.90 వద్ద ముగిసింది. బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.555.2 కోట్లు తగ్గి రూ.2946.80 కోట్లకు చేరింది. ఈ ప్రభావంతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్, ఐబీ హౌసింగ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ హౌసింగ్ ఫైనాన్స్ 8.61 శాతం వరకు నష్టాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో ఎల్‌అండ్‌టీ 3.41%, టాటా స్టీల్ 2.54%, బజాజ్ ఫైనాన్స్ 2.25%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.78%, వేదాంత 1.78%, సన్‌ఫార్మా 1.74% చొప్పున దీలాపడ్డాయి. కోల్ ఇండియా 1.92%, పవర్‌గ్రిడ్ 1.27%, హెచ్‌యూఎల్ 1.19%, హీరో మోటోకార్ప్ 0.94% మేర రాణించాయి.

నష్టాలకు ఇవీ కారణాలు

గురువారం మన మార్కెట్ల పతనాన్ని ప్రధానంగా అయిదు అంశాలు శాసించాయి.

- **డీహెచ్‌ఎఫ్‌ఎల్ సంక్షోభం:** డీహెచ్‌ఎఫ్‌ఎల్ వాణిజ్య పత్రాల రేటింగ్‌ను క్రిసిల్, ఇక్రా తగ్గించడంతో మదుపర్ల సెంటిమెంట్ దెబ్బతింది. ఈ ప్రభావంతో ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల షేర్లు కుదేలయ్యాయి.
- **నగదు లభ్యత ఆందోళనలు:** నగదు లభ్యత సమస్యల పరిష్కారానికి ఆర్‌బీఐ ఎటువంటి చర్యలు ప్రకటించకపోవడం మార్కెట్ వర్గాలను నిరాశపరిచింది. ఇప్పటికే ఆందోళనతో ఉన్న మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు.
- **వృద్ధి అంచనాల తగ్గింపు:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ జీడీపీ వృద్ధి అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. గిరాకీ తగ్గడం వల్ల భారత ఎగుమతులు, పెట్టుబడుల కార్యకలాపాలపై ప్రభావం ఉండొచ్చన్న అంచనాలు నష్టాలు తెచ్చాయి.
- **వాణిజ్య ఉద్రిక్తతలు:** అంతర్జాతీయంగా చూస్తే.. వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగాయి. అమెరికా-మెక్సికో చర్చల్లో ఎటువంటి పురోగతి లేదని ట్రంప్ ప్రకటించడం ప్రతికూల ప్రభావం చూపింది.
- **అంతర్జాతీయ వృద్ధి మందగమనం:** వాణిజ్య ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ వృద్ధి మందగించవచ్చని ఐఎంఎఫ్ అధిపతి లగార్డే ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రపంచ మార్కెట్లు డీలాపడ్డాయి.

దిల్లీలో విడుదల చేసిన కొత్త గ్లాంజాతో టయోటా కిర్లోస్కర్ ఎండీ మసకజు యోషిమురా, డిప్యూటీ ఎండీ ఎన్.రాజా

టయోటా గ్లాంజా

- ధర రూ.7.22 - 8.9 లక్షలు

దిల్లీ: జపాన్ వాహన దిగ్గజం టయోటా ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మోడల్ 'గ్లాంజా'ను దేశీయ విపణిలోకి విడుదల చేసింది. సుజుకీ బాలెనోకు ఇది టయోటా వెర్షన్. సుజుకీతో భాగస్వామ్యంలో భాగంగా ఈ కారును టయోటా విడుదల చేసింది. గ్లాంజా ధరలు శ్రేణి రూ.7.22- 8.9 లక్షలు (ఎక్స్-షోరూమ్, దిల్లీ)గా నిర్ణయించారు. బీఎస్-6 ప్రమాణాలు కలిగిన 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో, రెండు వేరియంట్లలో గ్లాంజా లభించనుంది. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ సదుపాయం ఉంది. వినియోగదారులకు స్థిరంగా కొత్త ఉత్పత్తులు అందించడానికి కట్టుబడి ఉన్నామని టయోటా కిర్లోస్కర్ మోటార్ మేనేజింగ్ డైరెక్టర్ మసకజు యోషిమురా పేర్కొన్నారు. కంపెనీ మూడేళ్ల లేదా లక్ష కిలోమీటర్ల వారెంటీ అందిస్తోందని, దీన్ని 5 ఏళ్లు, 2.2 లక్షల కి.మీలకు పొడిగించుకోవచ్చని తెలిపారు. ఆండ్రాయిడ్ ఆటోతో టచ్‌స్క్రీన్ ఆడియో, యాపిల్ కార్‌ప్లే వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో టయోటా, సుజుకీ సాంకేతికత ఇచ్చిపుచ్చుకోడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఎన్ఎస్ఈ వినతిని తోసిపుచ్చిన శాట్

- సెబీ కో-లొకేషన్ కేసు

దిల్లీ: ఎన్ఎస్ఈకి చుక్కెదురైంది. కో-లొకేషన్ కేసులో సెబీకి రూ.687 కోట్లను ఎస్క్రో ఖాతా నుంచి బదిలీ చేయడానికి బదులుగా, బ్యాంకు హామీనివ్వడానికి అనుమతించాలంటూ చేసిన విజ్ఞప్తిని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్(శాట్) తిరస్కరించింది. రెండు వారాలలోగా రూ.687 కోట్లను బదిలీ చేయాలన్న మే 22 నాటి ఆదేశాలను పాటించడానికి ఆదనంగా ఒక వారం గడువును మాత్రం మంజూరు చేసింది. 'మే 22, 2019 నాటి ఆదేశాలను మార్చడానికి మాకు ఎలాంటి కారణమూ కనిపించడం లేదు. సెబీ ఆదేశాల మేరకు ఎస్క్రో ఖాతాలో ఉంచిన ఆ నగదును పిటిషనర్‌దారు(ఎన్ఎస్ఈ) సెబీకి బదిలీ చేయాల్సిందే'నని స్పష్టం చేసింది. కో లొకేషన్ కేసు విషయంలో సెబీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ గత నెలలో ట్రైబ్యునల్‌కు ఎన్ఎస్ఈ వెళ్లింది. కొత్త డెరివేటివ్ ఉత్పత్తులను తీసుకురాకుండా ఆరు నెలల పాటు నిషేధం విధించడంతో పాటు.. కో లొకేషన్ ద్వారా పొందిన రూ.687 కోట్లను బదిలీ చేయాలని ఏప్రిల్‌లో సెబీ ఆదేశించింది.

జేఎల్ఆర్ డిస్కవరీ 2019

- ప్రారంభ ధర రూ.75.18 లక్షలు

దిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ఎస్‌యూవీ డిస్కవరీ మోడల్‌లో 2019 వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. ప్రారంభ ధర రూ.75.18 లక్షలుగా ఉంది. కొత్త మోడల్ నాలుగు వేరియంట్లలో లభించనుంది. 2.0 లీటర్ డీజిల్ ఇంజన్‌ను ఇందులో అమర్చారు. అధిక శక్తి కలిగిన ఇగ్నేషియం డీజిల్ వేరియంట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా డిస్కవరీ ప్రత్యేకత మరింత పెరుగుతుందని జేఎల్ఆర్ ఇండియా అధ్యక్షుడు, ఎండీ రోహిత్ సూరి పేర్కొన్నారు. ఆకర్షణీయ ధరను నిర్ణయించడంతో మరింత మంది వినియోగదారులను చేరతామనే ఆశాభావం వ్యక్తం చేశారు. 2019 డిస్కవరీ మోడల్‌లో ఎల్లక్షణాల్లో రిక్లైనింగ్ సీట్లు, ఇంటెలిజెంట్ సీట్ ఫోల్డ్, వాతావరణ నియంత్రణ, పనోరమిక్ సన్‌రూఫ్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

హైదరాబాద్‌లో ఒప్పో విక్రయ కేంద్రం

హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో, దక్షిణాసియాలో తమ తొలి ఆధునిక ప్రత్యేక (ఫ్లాగ్ షిప్) విక్రయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో, ఒప్పో తొలుత విడుదల చేసిన ఏ సిరీస్ నుంచి తాజా రెనో శ్రేణి 10 ఎక్స్ జూం మోడళ్ల మొబైళ్లు అందుబాటులో ఉంటాయని ఒప్పో ప్రొడక్ట్ మేనేజర్ జతిన్ అబ్రహాం తెలిపారు. శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో ఈ విక్రయశాలను గురువారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఒప్పో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కోల్‌కతా, ముంబయి, అహ్మదాబాద్, దిల్లీలలో కూడా ఇలాంటి కేంద్రాలు నెలకొల్పుతామన్నారు. ఆన్‌లైన్‌లోనే విక్రయిస్తున్న రెనో 10 ఎక్స్ జూమ్‌ను ఈ స్టోర్‌లో కొనుగోలు చేయొచ్చని వెల్లడించారు. రాబోయే వేడుకల్లో రెనో శ్రేణి మరిన్ని ఉత్పత్తులు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు.

సైలస్‌లో సైయెంట్ పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: రైల్వే రంగంలో సైబర్ రక్షణ పరిష్కారాలు చూపించే ఇజ్రాయెల్ సంస్థ సైలస్‌లో పెట్టుబడులు పెట్టినట్లు సైయెంట్ వెల్లడించింది. ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందన్న విషయంలో స్పష్టత ఇవ్వలేదు. రైల్వేలో సైబర్ రక్షణకు సంబంధించి సైలస్‌వన్ పేరుతో ఒక సాఫ్ట్‌వేర్‌ను సైలస్ రూపొందించింది.

సిగ్నల్, నియంత్రణ వ్యవస్థలో ఏదైనా లోపాలు ఏర్పడినప్పుడు ఈ సాఫ్ట్‌వేర్ దాన్ని గుర్తించి, అప్రమత్తం చేస్తుంది. ఈ సంస్థలో పెట్టుబడి పెట్టడం ద్వారా రైల్వే ఇంజినీరింగ్, డిజిటలైజేషన్ విషయాల్లో ముందడుగు వేసేందుకు వీలవుతుందని సైయెంట్ పేర్కొంది.

నాట్కో ప్లాంటులో తొమ్మిది లోపాలు

ఈనాడు, హైదరాబాద్: ఔషధ ఉత్పత్తి సంస్థ నాట్కో ఫార్మా కొత్తూరు ప్లాంటులో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తొమ్మిది లోపాలను గుర్తించింది. మే 30 నుంచి జూన్ 5 వరకూ ఈ ప్లాంటులో ఎఫ్‌డీఏ తనిఖీలు నిర్వహించినట్లు నాట్కో ఫార్మా గురువారం బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో తెలిపింది. ఈ అభ్యంతరాలన్నీ విధానపరమైనవేనని, 15 పనిదినాల్లో వాటిని సరిదిద్దుతామని పేర్కొంది.



కోడిగుడ్లు 6వ ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	335	వరంగల్	338
చిల్లరగా (ఒక గుడ్డు)	3.95	విశాఖపట్నం	338
బెంగళూరు	365	చెన్నై	395
7వ తేదీకి...		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	328	నమక్కల్	385

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 426.30 (425.55) 4848580
ASIAN PAINTS 1428.55 (1421.50) 1985857
AXIS BANK LT 807.70 (822.80) 14728937
BAJAJ AUTO L 2991.65 (2983.90) 481570
BAJAJ FINANC 3452.95 (3531.15) 1314916
BAJAJ FINSER 8125.20 (8312.85) 176636
BHARTI AIRTE 353.80 (352.40) 10317108
BHARTI INFRA 273.50 (274.00) 2900691
BPCL 397.05 (408.35) 7635450
BRITANNIA 2901.35 (2963.10) 333116
CIPLA 559.80 (562.65) 1750285
COAL INDIA L 269.15 (263.40) 11211307
DR REDDYS 2657.30 (2665.35) 608496
EICHER MOTOR 20083.80 (20043.45) 126296
GAIL 316.30 (358.25) 27978741
GRASIM IND 869.55 (886.50) 2884482
HCL TECH 1079.20 (1085.85) 2350903
HDFC 2183.45 (2223.95) 3888312
HDFC BANK 2423.35 (2452.30) 3908731
HERO MOTOCOR 2788.75 (2752.70) 1231094
HINDALCO IND 194.85 (197.80) 6628617
HINDUSTAN UN 1837.75 (1815.60) 1626007
ICICI BANK 411.55 (419.10) 17762399
INDIABULLS H 735.80 (796.45) 13824784
INDIAN OIL 163.55 (165.35) 10111320
INDUSINDBANK 1522.65 (1636.00) 6402947
INFOSYS LTD 735.60 (735.30) 7563925
ITC 275.75 (279.25) 10660963
JSW STEEL LT 266.70 (274.20) 5090763
KOTAK MAHIND 1514.25 (1531.35) 2044919
LARSEN & TOU 1515.90 (1569.80) 3268594
M&M 634.10 (650.75) 3846513
MARUTI SUZIK 6988.70 (7051.80) 720856
NTPC LTD 136.55 (135.05) 12191883
ONGC 169.40 (170.60) 14152285
POWER GRID C 195.45 (192.95) 14699788
RELIANCE IND 1327.35 (1351.65) 7664319
SBI 336.90 (352.40) 41941144
SUN PHARMA 404.15 (411.15) 3483633
TATA CONSULT 2166.10 (2183.10) 3735467
TATA MOTORS 169.70 (173.25) 16874819
TATA STEEL L 484.60 (497.65) 7222799
TECH MAHINDR 738.00 (748.30) 3225967
TITAN IND 1269.45 (1248.00) 2345134
ULTRATECH 4571.20 (4692.00) 761710
UPL LIMITED 1012.20 (1010.95) 1603855
VEDANTA LIMI 163.10 (165.90) 9237166
WIPRO 291.50 (293.75) 8600880
YES BANK LTD 143.40 (152.80) 65169529
ZEE ENTERTAI 341.05 (346.05) 12082449

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1529.80 (1561.65) 57148
ACC 1592.15 (1657.65) 1247192
AMBUJA CEMEN 221.75 (226.95) 4193682
ASHOK LEYLAN 91.30 (93.05) 19319345
AUROBIND PHA 624.55 (653.75) 4729934
AVENUE SUPER 1317.65 (1333.05) 226174
BAJAJ HOLDIN 3531.85 (3503.35) 30475
BANDHAN BANK 582.10 (592.10) 295635
BANK OFBAROD 124.35 (132.60) 44472552
BHEL 68.55 (70.90) 14182515
BIOCON LTD 544.50 (540.65) 2336252
BOSCH LTD 17268.45 (17401.30) 13042
CADILA HEALT 245.70 (257.30) 2941237
COLGATE PALM 1159.75 (1149.40) 479646
CONTAINER 524.35 (537.65) 746521
DABUR INDIA 402.95 (405.55) 1621809
DIVIS LAB 1580.35 (1586.35) 925968
DLF LIMITED 190.40 (195.45) 9595362
GENERAL INS 216.60 (223.80) 190221
GODREJ CONSU 700.25 (700.40) 1705102
HAVELLS INDI 781.25 (779.90) 1696697
HDFC AMC LIM 1807.30 (1810.40) 193404
HDFC STAND L 442.25 (442.70) 1596991
HINDUSTAN ZI 243.40 (246.65) 424365
HPCL 308.10 (317.85) 7963314
ICICI LOMBAR 1172.80 (1243.85) 1077181
ICICI PRU LI 379.00 (394.80) 1005205
IDEA CELLULR 13.45 (13.85) 69427339
INTERGLOBE A 1670.85 (1686.30) 829316
L&TFIN.HOLD 126.60 (136.40) 12016274
LUPIN 732.30 (740.10) 1094898
MARICO LIMIT 374.85 (376.65) 1949514
MCDOWELL 556.95 (571.80) 2004180
MOTHERSON 114.10 (114.85) 8838440
MRF 55805.80 (57382.45) 7419
NHPC LTD 24.90 (25.00) 3296880
NMDC LTD 103.70 (103.60) 3592296
ORACLE FIN S 3338.90 (3377.20) 21938
P&G HYG&HEAL 10735.60 (10869.20) 2152
PAGE INDUSTR 19942.35 (20115.30) 54153
PETRONET LNG 236.75 (246.75) 4858719
PIDILITE IND 1270.20 (1279.50) 537351
PIRAMAL ENTE 2065.10 (2209.20) 1069956
SAIL 48.70 (50.50) 18743224
SBI LIFE INS 696.35 (698.40) 1320152
SHREE CEMENT 20618.40 (21200.50) 39208
SHRIRAM TRAN 1065.50 (1165.40) 2304331
SIEMENS 1241.65 (1267.25) 273849
THE NEW INDI 162.50 (160.85) 93626
UNITED BREWE 1315.75 (1339.65) 312069

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 4.09 (3.90) 450
AISHWARYA TE 2.23 (2.22) 831
ALPHAGEO 463.30 (469.80) 478
AMAR RAJA BA 634.35 (637.75) 10575
ANDHRA BANK 24.30 (24.80) 39535
ANDHRA CEMEN 4.43 (4.56) 11233
ANDHRA PAPER 420.40 (420.30) 9159
ANDHRA PETRO 54.50 (55.75) 23012
ANDHRA SUGAR 348.05 (367.05) 5053
ANJANI PORTL 170.95 (178.45) 1347
ASTRA MICROW 90.20 (90.85) 23561
AUROBINDO PH 624.30 (654.10) 330322
AVANTEL SOFT 274 (274) 369
AVANTI FEEDS 364.65 (368.25) 18734
AVON ORG 2.50 (2.44) 4095
BALAJI AMIN 400.40 (401.55) 1804
BARTRONICS 5.41 (5.78) 6202
BHAGIRA CHEM 503.20 (512.90) 548
BHAGYA NAG 27 (27.55) 450
BN RATHI SEC 19.95 (21.20) 7872
BRILLIANT SE 1.22 (1.28) 5930
CAMBRIDGE TE 41.40 (40.60) 2123
CIL SECURI 14.45 (14.55) 247
CONT COFFEE 264.35 (263.40) 425
COROMAN FERT 427.80 (432.45) 204767
CUBEX TUB 11.57 (12.40) 2750
CYBERMATE 2.12 (2.19) 47155
CYIENT LIMIT 561.60 (560) 2657
DECCAN CEMEN 399.95 (408.15) 518
DIVYS LAB 1579.25 (1584.30) 26673
DIVYA GRANIT 85.50 (80) 66
DR REDDY 2657.35 (2657.80) 41742
FOUR SOFT 34 (33.15) 397
GATI CORPN 72.55 (75.20) 129532
GAYATRI PROJ 177.60 (180.95) 645
GMR INFRASTR 14.95 (15.30) 2108706
GOLDST INFRA 208.85 (205.85) 7087
GOLDSTONE EN 12.11 (12.80) 1922
GRANULES (I) 108.55 (109.80) 15990
GSS AMERICA 139.05 (139.10) 42155
GVK POWER 6.89 (6.77) 344640
HBL NIFE POW 24.40 (24.55) 8341
HERITAGE FOO 418.10 (404.15) 6216
HIL LTD 1690.20 (1751.60) 1679
HIND FLUROCA 13.99 (13.47) 814
IDL INDUSTRS 275 (276.80) 1086
ILFS ENGINEE 6.54 (6.68) 5389
INCAP 35 (35.15) 294
INNAREDY COM 1.08 (1.13) 3
IVRCL INFRAS 0.73 (0.70) 5373
JEEVAN SCIEN 28 (27.20) 152
KAKATIYA CEM 199.25 (202.20) 4681
KAKATIYA TEX 3.37 (3.37) 200
KALLAM SPG 15.25 (16.15) 3600
KAVERI SEED 527.65 (534.10) 5715
KCP LTD 89.55 (88.95) 84
KERNEX MICRO 25.65 (25.60) 801
KNR CONSTRUC 275.45 (287.25) 8632
LANCO INDUS 178.70 (184.90) 2300
LAURUS LABS 355.60 (358.45) 875
MADHUCON PRO 8.07 (8.49) 5591
MEDIN

ఈనాడు బిజినెస్

ముఖ్యాంశాలు

- రెపో రేటు 6 శాతం నుంచి 5.75 శాతానికి చేరిక
- రివర్స్ రెపో రేటు 5.5 శాతం; మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎమ్ఎస్ఎఫ్) రేటు 6 శాతం వద్ద
- ఆర్‌బీఐ తన విధాన ధోరణిని 'తటస్థం' నుంచి 'సర్దుబాటు'కు మార్పు
- 2019-20 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం నుంచి 7 శాతానికి సవరణ
- రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను ఏప్రిల్-సెప్టెంబరుకు 3-3.1 శాతానికి పెంచగా; అక్టోబరు-మార్చికి 3.4-3.7 శాతానికి తగ్గించింది
- సమీప భవిష్యత్‌లో ఆహార ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం
- రుతుపవనాల్లో అనిశ్చితి, కూరగాయల ధరల పెరుగుదల, ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్ల ఊగిసలాట, ద్రవ్య పరిస్థితుల దృష్ట్యా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం
- డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించేందుకు ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ఛార్జీల మాఫీ
- బ్యాంకులు విధించే ఏటీఎమ్ ఛార్జీలు, ఫీజులను సమీక్షించడానికి ఓ కమిటీ ఏర్పాటు
- చిన్న బ్యాంకులకు లైసెన్సులు ఇవ్వడానికి ఆగస్టు కల్లా ముసాయిదా మార్గదర్శకాల జారీ
- పెట్టుబడుల్లో మందగమనం, ప్రైవేటు పెట్టుబడుల తగ్గుదల ఆందోళనకరం
- పావు శాతం రేటు కోతకు మొత్తం ఆరుగురు ఎమ్‌పీసీ సభ్యుల సానుకూల స్పందన
- జూన్ ప్రారంభానికల్లా వ్యవస్థలో సగటు రోజువారీ అదనపు ద్రవ్యలభ్యత రూ.66,000 కోట్లు
- మే 31, 2019 నాటికి విదేశీ మారక నిల్వలు 421.9 బిలియన్ డాలర్లు

తదుపరి పరపతి విధాన సమీక్ష ఆగస్టు 5-7 తేదీల్లో

ఎమ్‌పీసీ సమావేశం అనంతరం బయటకు వస్తున్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, డిప్యూటీ గవర్నర్లు

ఆర్‌బీఐ... హ్యాట్రిక్

సామాన్యులకు ఊరట కలిగించే నిర్ణయాలను ఆర్‌బీఐ తీసుకుంది. ఓ వైపు కీలక రేట్లను తగ్గించి.. గృహ, వాహన, ఇతర రుణ స్వీకర్తలకు శుభవార్త అందించింది. తమకు కలిగే ప్రయోజనంలో, బ్యాంకులు ఎంతమేర ఖాతాదారులకు బదిలీ చేస్తాయనే అంశంపై ఆధారపడి నెలవారీ వాయిదాల భారం ఎంత తగ్గుతుంది. ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ ఛార్జీలను రద్దు చేసి, ఆన్‌లైన్‌లో నగదు బదిలీని ప్రోత్సహించడంతో పాటు, ఏటీఎం ఛార్జీలపైనా సమీక్షకు ఒక కమిటీని నియమించాలని నిర్ణయించింది.

వరుసగా మూడోసారి రెపోరేటు తగ్గింపు

- ఇకపై 5.75 శాతమే
- తొమ్మిదేళ్ల కనిష్ఠానికి చేరిక
- భవిష్యత్‌లో రేట్ల పెంపులుండవ్
- ఆర్థిక మందగమన నేపథ్యం
- నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ఛార్జీల మాఫీ
- వారంలో బ్యాంకులకు మార్గదర్శకాలు
- ఏటీఎం ఛార్జీలపైనా సమీక్షకు కమిటీ

ఈ ఏడాదిలో వరుసగా మూడో సారి రిజర్వ్ బ్యాంక్ కీలక రేట్లను తగ్గించింది. దీంతో గృహ, వాహన, ఇతర రుణాల భారం తగ్గే అవకాశం కనిపిస్తోంది. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక, ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు మందగమనం పాలు కావడంతో వృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్‌బీఐ ఈ చర్యలు తీసుకుంది.

గురువారం నాటి పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) సమావేశంలో రెపో రేటు (ఆర్‌బీఐ నుంచి బ్యాంకులు తీసుకునే రుణాలపై వసూలు చేసే రేటు)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని నిర్ణయించారు. అదే సమయంలో రివర్స్ రెపో రేటు కూడా అంతే స్థాయిలో తగ్గించి 5.5 శాతానికి పరిమితం చేశారు. ఎమ్‌పీసీలోని ఆరుగురు సభ్యులూ ఏకాభిప్రాయంతో రేట్ల కోతకు ఓటు వేశారు. సమీప భవిష్యత్తులో రేట్ల పెంపులు ఉండవని చెబుతూ.. ఆర్‌బీఐ తన దోరణిని 'తటస్థం' నుంచి 'సర్దుబాటు'కు మార్చుకోవడమూ హర్షణీయమే. అదే సమయంలో ఫిబ్రవరి, ఏప్రిల్‌తో పాటు తాజాగా తగ్గించిన కీలక రేట్లను బ్యాంకులు తమ ఖాతాదార్లకు బదిలీ చేయాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కోరారు. మొత్తం మీద ఈ ఏడాది వరుసగా మూడు సార్లూ కోత వేయడంతో.. 75 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు కిందకు దిగివచ్చింది.

బడ్జెట్ ముందు కసరత్తా?: మోదీ 2.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వచ్చే నెల తొలి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. అందులోనూ కొత్త ఆర్థిక మంత్రి, తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంటుకు వినిపించనున్నారు. అయితే జనవరి-మార్చి త్రైమాసికంలో వృద్ధి అయిదేళ్ల కనిష్ఠమైన 5.8 శాతానికి చేరింది. గత కొద్ది త్రైమాసికాల్లోనే తొలిసారిగా.. వైనా కంటే వెనకబడింది. దీంతో ఆర్‌బీఐ సైతం ప్రస్తుత ఆర్థిక సంవత్సర జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గించింది. అదే వేరే సంగతి. తాజా మందగమనాన్ని అడ్డుకోవడంతో పాటు.. రుణ వృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రస్తుత సమీక్షలో చర్యలు తీసుకున్నారు. రాబోయే బడ్జెట్‌లో ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి మరిన్ని చర్యలను తీసుకోనున్నారు. ద్రవ్యలోటు లక్ష్యానికీ కట్టుబడి ఉండాల్సిన స్థితి. ఎందుకంటే 2018-19లో ఆదాయ వసూళ్లు సవరించిన అంచనాల కంటే కూడా తక్కువగా వచ్చాయి.

సానుకూలతలున్నాయే : రాజకీయ స్థిరత్వం, అధిక సామర్థ్య వినియోగం, మెరుగైన స్టాక్‌మార్కెట్లు.. రెండో త్రైమాసికంలో వృద్ధి రాణిస్తుందన్న విశ్వాసాన్ని కలిగిస్తున్నాయని ఎమ్‌పీసీ అభిప్రాయపడింది.

నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ఛార్జీలు మాఫీ చేయడం వల్ల నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేయడం పెరుగుతుందని, సురక్షితంగా, వేగంగా లావాదేవీలు పూర్తవుతాయని ఆర్‌బీఐ విశ్వాసం వ్యక్తం చేసింది. చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టుల అవసరమూ తగ్గి, వ్యయాలు కలిసొస్తాయంది. పెద్దమొత్తం నగదు బదిలీకి ఉపయోగపడే ఆర్‌టీజీఎస్ పనిదినాల్లోనే విని యోగించుకోవచ్చు. వాణిజ్య సంస్థలు ఎక్కువగా వాడుతుంటాయి. నెఫ్ట్‌ను వ్యక్తులు వినియోగిస్తుంటారు.

ద్రవ్యోల్బణ అంచనాలు: పైకి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగానికి ద్రవ్యోల్బణ అంచనాలను 3-3.1 శాతానికి ఆర్‌బీఐ పెంచింది. కూరగాయలతో పాటు ఆహార ధరలు పెరుగుతాయన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. ఏప్రిల్‌లో ఆర్‌బీఐ 2.9-3 శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను మాత్రం 3.4-3.7 శాతానికి తగ్గించింది. అంతక్రితం అంచనాలు 3.5-3.8 శాతంగా ఉన్నాయి. వేసవిలో అంచనా వేసిన దాని కంటే కూరగాయల ధరలు ఎక్కువగా పెరిగాయి. అయితే వర్షాకాలం, శీతకాలంలో ఇవి బాగా తగ్గుతాయన్న అంచనాలున్నాయని ఆర్‌బీఐ తన ద్వైమాసిక పరపతి విధాన ప్రకటనలో వెల్లడించింది. ముడి చమురు ధరల ఊగిసలాటకు తోడు.. పలు ఆహార వస్తువుల ధరలు పెరుగుతాయన్న అంచనాల వల్ల స్వల్పకాలంలో ఆహార ద్రవ్యోల్బణం పెరగవచ్చని తెలిపింది.

దిల్లీ: మొండి బకాయిల వసూళ్లకు సంబంధించి కొత్త మార్గదర్శకాలను మరో 3-4 రోజుల్లో విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంత దాస్ వెల్లడించారు. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) వసూళ్లపై ఫిబ్రవరి 12న ఆర్‌బీఐ జారీ చేసిన సర్క్యులర్‌ను ఏప్రిల్ 2న సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. 'సవరించిన సర్క్యులర్‌ను 3-4 రోజుల్లో తెస్తామని పరపతి విధాన వెల్లడి అనంతరం విలేకర్లతో దాస్ చెప్పారు. కొత్త మార్గదర్శకాల వెల్లడికి అనుకున్నదాని కంటే ఎక్కువ సమయం తీసుకున్నామని తెలిపారు. వివిధ న్యాయపరమైన అంశాల పరిశీలన, వాటాదార్లతో విస్తృత సంప్రదింపుల వల్లే జాప్యం జరిగిందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 12 సర్క్యులర్ ప్రకారం.. రూ.2000 కోట్లకు మించిన రుణ ఖాతాలకు సంబంధించి తిరిగి చెల్లించాల్సిన సమయం ఒక్క రోజు మించినా, ఆ ఖాతాపై ఎన్‌పీఏ ముద్ర పడిపోతుంది. ఆ తర్వాత 180 రోజుల్లోగా ఎన్‌పీఏ ఖాతాకు పరిష్కారం కనుగొనాలి. లేకుంటే దానిని జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు బ్యాంకులు సిఫారసు చేయాలి. ఈ నిబంధనలను బ్యాంకులు పాటించకుంటే అవి కూడా జరిమానా కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సర్క్యులర్‌తో విద్యుత్ రంగ కంపెనీలపై అధిక ప్రభావం పడింది. భిన్న రంగాలకు ఉండే ప్రత్యేక సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను ఒకటే కిందకు భావించి 180 రోజుల పరిమితి విధించడం ఎంత వరకు సమంజసమని ఆ సంస్థలు వాదించాయి. విద్యుత్ రంగ కంపెనీల ఎన్‌పీఏలను ప్రత్యేకంగా పరిగణించాలంటూ ఆర్‌బీఐ, ఆర్థిక శాఖకు అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను ఆర్‌బీఐ సవాలు చేసిన ఫిబ్రవరి 12 సర్క్యులర్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

మొండి బకాయిల వసూళ్లపై 3-4 రోజుల్లో కొత్త మార్గదర్శకాలు

ముంబయి: చిన్న రుణ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు) నెలకొల్పేందుకు 'ఆన్ ట్యాప్' పద్ధతిలో లైసెన్సుల జారీకి ఆగస్టులో ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఆర్‌బీఐ వెల్లడించింది. ఆన్ ట్యాప్ పద్ధతి అంటే.. తగిన అర్హతలున్న సంస్థలు, నిరీక్షణకు తావులేకుండా చిన్న రుణ బ్యాంకుల లైసెన్సుల కోసం రిజర్వ్ బ్యాంక్‌ను ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించడమే. చిన్న రుణ బ్యాంకుల ఏర్పాటుకు 2015 సెప్టెంబరులో 10 సంస్థలకు సూత్రప్రాయ అనుమతులను ఆర్‌బీఐ ఇచ్చింది. వీటి పనితీరును సమీక్షించాక, ఈ తరహా బ్యాంకులకు 'ఆన్‌ట్యాప్' పద్ధతిలో లైసెన్సులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అప్పట్లో అనుకున్నామని ఆర్‌బీఐ గురువారం వెల్లడించింది. ఇప్పటికే పనిచేస్తున్న చిన్న రుణ బ్యాంకులు ప్రాధాన్యతా రంగ లక్ష్యాలను సాధించినట్లు గుర్తించామని తెలిపింది. మరింత మందికి వీటి సేవలు అవసరమనే విషయం వెల్లడైందని పేర్కొంది. చిన్నమొత్తంలో రుణాలు తీసుకునే వారి అవసరాలు తీర్చేందుకు, విపణిలో పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు చిన్న రుణ బ్యాంకుల కార్యకలాపాల్లోకి మరికొన్ని సంస్థలను చేర్చాల్సిన అవసరం ఉందని వెల్లడించింది. అందుకే చిన్న రుణ బ్యాంకులకు ఆన్‌ట్యాప్ లైసెన్సుల మార్గదర్శకాలను 2019 ఆగస్టు చివరికల్లా విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

చిన్న రుణ బ్యాంకులకు ఎప్పుడైనా అనుమతులు!

చెల్లింపుల బ్యాంకులపైనా సమీక్ష

చెల్లింపుల బ్యాంకులను కూడా ఆన్‌ట్యాప్ లైసెన్సు విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మరోసారి వీటి పని తీరు సమీక్షించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది.

వృద్ధి మందగమనంపై ఆందోళనల నేపథ్యంలోనే మూడో సారీ రెపో రేట్లను తగ్గించాల్సి వచ్చింది. సరైన సమయంలో తీసుకున్న సరైన నిర్ణయం ఇది. ఆర్‌బీఐ విధానాన్ని 'తటస్థం' నుంచి 'సర్దుబాటు ధోరణి'కి మార్పు చేశాం కాబట్టి ఇక రేట్ల పెంపు ఉండబోదు. ఏడాది కాలంగా ద్రవ్యలభ్యత సమస్య వేధించింది. ఇపుడు అదనపు నిధులు ఉన్నాయి. ప్రతి ఉత్పాదక అవసరానికి సరిపోయే నిధులు ఉండేలా మేం చూస్తాం. దేశ ఆహార అవసరాలకంటే 3.4 రెట్ల నిల్వలు మన వద్ద ఉన్నాయి. (వర్షపాతం తక్కువగా నమోదైనా, రేట్లు పెరగకపోవచ్చన్న సంకేతాలిచ్చారు). ఫిబ్రవరి, ఏప్రిల్‌తో పాటు ఇపుడు తగ్గించిన రేట్ల కోతలను బ్యాంకులు తమ ఖాతాదార్లకు బదిలీ చేయాలని కోరుకుంటున్నాను. మోదీ నేతృత్వంలో గత అయిదేళ్లలో ప్రభుత్వం ద్రవ్య స్థిరీకరణ బాటలో నడిచింది. ఇపుడు ద్రవ్య లభ్యతపై తిరిగి పనిచేసి, వృద్ధిని గాడిన పెడుతుందనే భావిస్తున్నాం'.

- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

ఇక తక్కువ వడ్డీ రేట్లే.. పరిశ్రమ వర్గాలు

వృద్ధి అంచనాలు కిందకు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐ 7 శాతానికి తగ్గించింది. ఏప్రిల్ పరపతి విధానంలో 7.2 శాతంగా అంచనా వేసింది. అయితే దేశీయ కార్యకలాపాల్లో మందగమనం, అంతర్జాతీయ వాణిజ్య భయాలు పెరగడంతో తాజా నిర్ణయం తీసుకుంది. జనవరి-మార్చి 2018-19లో దేశీయ పెట్టుబడుల కార్యకలాపాలు బలహీనపడ్డాయి. మొత్తం మీద గిరాకీ తగ్గడంతో ఎగుమతులూ తగ్గాయని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవలి కొద్ది నెలల్లో ప్రైవేటు వినియోగం తగ్గిందని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అది ఎక్కువగా కనిపిస్తోందని వివరించింది. కొన్ని సానుకూలతలున్నా.. ప్రతికూల ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తొలి అర్ధభాగంలో 6.4-6.7 శాతం, ద్వితీయార్ధంలో 7.2-7.5 శాతం మేర వృద్ధి నమోదవుతుందని అంచనా వేసింది.

'విధాన వైఖరిని 'సర్దుబాటు ధోరణి'కి మార్చడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ తక్కువ వడ్డీ రేట్ల విధానానికి మారేందుకు తోడ్పడుతుంది. వృద్ధి అంచనలు తొలగేందుకూ దోహదం చేస్తుంది. ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌పై రుసుముల తొలగింపుతో డిజిటల్ లావాదేవీలకు ఊతం లభిస్తుంది'

- రజనీశ్ కుమార్, ఛైర్మన్, ఎస్‌బీఐ

'వృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వడ్డీ రేట్లను తగ్గించడంపై బ్యాంకులు నిర్ణయం తీసుకోవాలి'

- సునీల్ మెహతా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఛైర్మన్

'కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలో నెలకొన్న సంక్షోభంపై ఆర్‌బీఐ ప్రకటన ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకొచ్చేందుకు బరోసా కలిగిస్తుంది.

- జి.ప్రసన్న, ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ హెడ్

'రిటైల్, కార్పొరేట్ రుణాల వడ్డీ రేట్లను బ్యాంకులు తగ్గించాలి. వినియోగం పుంజుకోవడంతో పాటు ప్రైవేటు పెట్టుబడులు పెరిగే విధంగా ఆకర్షణీయ బడ్జెట్ ప్రవేశపెట్టాలి'

- సందీప్ సోమాని, ప్రెసిడెంట్, ఫిక్కీ

'బ్యాంకులు రేట్ల కోత ప్రయోజనాలను బదలాయిస్తే నగదు లభ్యత మెరుగుపడి, రుణ వ్యయాలు తగ్గుతాయి'

- జేకే గోయెంకా, అధ్యక్షుడు, అసోచామ్

'బ్యాంకులు కనుక వడ్డీరేట్లు తగ్గిస్తే, స్థిరాస్తి రంగానికి సానుకూలత ఏర్పడుతుంది. పెట్టుబడులు ఊపందుకుంటాయి.'

- క్రెడాయ్ ఛైర్మన్ జాక్సే షా

బ్యాంకులు శుభవార్త వినిపిస్తాయా?

ఈనాడు - హైదరాబాద్

రుణగ్రహీతలకు మరోసారి శుభవార్త వినిపించింది ఆర్‌బీఐ. రెపో రేటును వరసగా మూడుసార్లు తగ్గించి, తొమ్మిదేళ్ల కనిష్ఠం 5.75శాతానికి చేర్చింది. మొత్తంగా చూస్తే ఈ ఆరు నెలల కాలంలో బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ 0.75శాతం తగ్గినట్లే. కానీ, ఆర్‌బీఐ ఇచ్చిన వరాన్ని.. బ్యాంకులు తమ రుణగ్రహీతలకు అందకుండా చేస్తున్నాయి. వడ్డీ రేట్లను తగ్గించడంలో ఆలస్యం చేస్తున్నాయి.. కొన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాల రేటును తగ్గించలేదు సరికదా.. స్వల్పంగా పెంచాయి కూడా.. ఈసారి కూడా ఏం చేస్తాయన్నదే ఇప్పుడు చర్చనీయాంశం..

'తగ్గించిన వడ్డీ రేట్లను రుణగ్రహీతలకు బదిలీ చేసేందుకు బ్యాంకులు నాలుగు నుంచి ఆరు నెలల సమయం తీసుకుంటున్నాయి.. ఈసారి అలా కాకుండా ఈ బదిలీ వేగంగా జరుగుతుందని భావిస్తున్నాను' అంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నదాన్ని బట్టే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.. బ్యాంకులు తమ ఖాతాదార్లకు వడ్డీ రేట్లను తగ్గించడంలో ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయో! గవర్నర్ చెప్పిన ప్రకారం చూస్తే.. గతంలో తగ్గించిన 0.50శాతం రేటులో బ్యాంకులు 0.21శాతం ప్రయోజనాన్ని మాత్రమే రుణగ్రహీతలకు బదిలీ చేశాయి. పాత తగ్గింపును బ్యాంకులు వర్తింపచేయకపోవడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. తగ్గింపు ప్రయోజనాన్ని వేగంగా బదిలీ చేయాల్సిందిగా బ్యాంకులకు సూచించారు. గృహ రుణాలే కాకుండా... వినియోగ, వాహన రుణాలపై కూడా వడ్డీ రేట్లు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లు తగ్గిస్తే, నెలవారీ వాయిదాల భారంలో కాస్త ఉపశమనం లభిస్తుంది.

నెలవారీ చెల్లింపు తగ్గుతున్నా, వాయిదాల సంఖ్య తగ్గిపోతుంది.

బ్యాంకులు ఇష్టపడటం లేదు..: గతంలో ఆర్‌బీఐ వడ్డీ రేటు తగ్గించగానే.. ఆ నిర్ణయాన్ని తమ ఖాతాదార్లకు వెంటనే బదలాయించేవి బ్యాంకులు. కానీ.. ఇప్పుడు పరిస్థితులు మారాయి. బ్యాంకులకు వస్తున్న ఆదాయాలు తగ్గడం, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరగడంతో పాటు.. డిపాజిట్ల సేకరణలో పోటీ నేపథ్యంలో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించడానికి బ్యాంకులు అంతగా ఇష్టపడటం లేదు. అందుకే, రెపో రేటు తగ్గినా.. అందులో సగభాగాన్నే అప్పులు తీసుకున్న వారికి బదిలీ చేస్తున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్ సూచనతో ఈసారైనా ఇవి సానుకూలంగా స్పందిస్తాయా? లేదా వేచి చూడాలి.

ప్రధాన సూచీలు ఎప్పుడు?: ప్రస్తుతం బ్యాంకులు అనుసరిస్తున్న 'మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్)లో కొన్ని చిక్కులు ఉన్నాయనీ, దీనికి బదులుగా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేట్లను ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ డిసెంబరు 6, 2018 నాటి సమీక్షలో పేర్కొంది. దీనిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఆర్‌బీఐ తగ్గించిన వడ్డీ రేటును ఎంసీఎల్ఆర్‌కు వర్తింపచేస్తున్నాయా లేదా అనేదే ప్రస్తుతానికి పరిశీలిస్తున్నామని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. అంటే కొత్త వడ్డీ రేట్ల విధానం ఇప్పట్లో లేనట్లే అనుకోవచ్చు.

ఆదాయం తగ్గుతుంది

రెపో రేటు తగ్గింపుతో వడ్డీ రేట్లు తగ్గడంతో పాటు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే ఆదాయమూ పడిపోనుంది. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపు పథకాలు, రికరింగ్ డిపాజిట్లపై ఈ ప్రభావం ఉంది. 'ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది.. ద్రవ్యోల్బణం అధికంగా ఉండి.. వడ్డీ రేట్లు తక్కువగా ఉంటే.. ఇబ్బంది. ఉదాహరణకు ద్రవ్యోల్బణం 10 శాతం ఉండి, ఎఫ్‌డీలపై వచ్చే వడ్డీ 9శాతం అంటే.. నికరంగా -1 శాతం నష్టం. కానీ, ద్రవ్యోల్బణం 4.5శాతం ఉన్న నేపథ్యంలో ఎఫ్‌డీలపై 7.5శాతం వడ్డీ లభిస్తోంది. అంటే 3శాతం నికర లాభమే. ఇప్పటికీ ఇది సానుకూల పరిణామమే'నని బ్యాంక్‌బజార్.కాం సీఈఓ అదిల్ శెట్టి పేర్కొన్నారు. కాస్త అధిక రాబడి రావాలని కోరుకునేవారు.. డెట్ ఫండ్లలో దీర్ఘకాలిక బాండ్ పథకాల వైపు చూడొచ్చని సూచించారు.

ఎన్‌బీఎఫ్‌సీలకు సాయం చేస్తాం

ఆర్‌బీఐ స్పష్టీకరణ

ముంబయి: ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో పరిణామాలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఆ రంగంలో ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎటువంటి చర్యలకైనా వెనకాడబోమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ద్రవ్య లభ్యత సమస్యల వల్ల ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నామని, అవసరమైన సాయం చేస్తామని వివరించారు. దేశీయ రేటింగ్ ఏజెన్సీలు క్రిసిల్, ఇక్రాలు డీహెచ్ఎఫ్ఎల్ వాణిజ్య పత్రాల(సీపీ) రేటింగ్‌ను తగ్గించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, ఎన్‌బీఎఫ్‌సీ ఆస్తుల పోర్ట్‌ఫోలియో పుస్తకాల నాణ్యత మొత్తం మీద బాగుందని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేర్కొంది. గత 10 నెలల్లో తమ బ్యాంక్ నుంచి ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చిన రుణాల స్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. 'ఎన్‌బీఎఫ్‌సీ రంగంపై విశ్లేషణ చేసే సమయానికి డీహెచ్ఎఫ్ఎల్ వంటి ఖాతాలు ఎదుర్కొంటున్న సవాళ్ల ప్రభావం ఈ రంగంపై పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొండి బకాయిలు, కేటాయింపులను పరిగణనలోకి తీసుకున్నామ'ని ఎస్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇంతలో ఎంత మార్పు..!

జ్ఞాపకాలు ఎప్పుడూ మధురంగానే ఉంటాయి. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ తన స్నేహితురాలు, సూరత్ ఎంపీ దర్శనా జర్దోష్‌తో కలిసి కొన్నేళ్ల క్రితం ఒక ఫొటో తీయించుకున్నారు. తాజాగా తామిద్దరం కలిసున్న ఫొటో కూడా కలిసి.. అప్పట్లో తాను చాలా సన్నగా ఉండేదాన్నని, ఇప్పుడు ఒళ్లు చేశానని అంటూ.. రెండు ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.

చైనా 5జీ.. మనమూ బిజీ

క్రమంగా 5జీ మొబైల్ సేవల ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. ఇప్పటికే కొన్ని దేశాల్లో ఈ కొత్త తరం నెట్‌వర్క్ ప్రయోగాత్మకంగా ప్రారంభం కాగా.. తాజాగా వాటి సరసన చైనా చేరింది. భారత్ కూడా త్వరలోనే ఈ సేవలకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో నిత్యజీవితంలో సాంకేతికంగా పెను మార్పులు చూడవచ్చు.

ఏయే దేశాల్లో ప్రారంభం?

బ్రిటన్, దక్షిణ కొరియా, అమెరికా, ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో 5జీ వాణిజ్య సేవలను ప్రారంభించాయి. ఇటీవలే బ్రిటన్‌లో 'ఈఈ' సంస్థ తన సేవలకు శ్రీకారం చుట్టింది. జులై నుంచి సేవలు ప్రారంభిస్తామని వొడాఫోన్ ప్రకటించింది. ఇప్పుడు చైనా రంగ ప్రవేశం చేయడంతో.. భవిష్యత్‌లో 5జీ సేవల్లో ఆ దేశం అగ్రగామి అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఏ తరంలో ఏం మెరుగు?

- 1జీ: వాయిస్ కాల్స్
- 2జీ: టెక్స్ట్ సందేశాలు
- 3జీ: ఇంటర్నెట్ సంధానత
- 4జీ: వీడియో
- 5జీ: వేగవంతమయిన డేటా బట్వాడా, స్మార్ట్‌గా జీవన సదుపాయాలు

వేగం ఎంత?

5జీ సేవల ఆరంభంలోనే ఎక్కువ ఇంటర్నెట్ వేగం రాకపోవచ్చని భావిస్తున్నారు. తొలుత ప్రస్తుత 4జీ (లాంగ్ టర్మ్ ఎవల్యూషన్-ఎల్‌టీఈ) సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దీన్ని ఒక మార్గంగా నెట్‌వర్క్ ఆపరేటర్లు ఉపయోగించుకుని, స్థిరమైన సేవలు అందించేందుకు ప్రయత్నించవచ్చు. అంతిమంగా ఆపరేటర్ ఏ స్పెక్ట్రమ్ బ్యాండ్‌పై 5జీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు? కొత్త టవర్లు, ట్రాన్స్‌మిటర్లపై ఎంత డబ్బు వెచ్చించారన్నదానిపై వేగం ఆధారపడి ఉంటుంది. 4జీతో పోలిస్తే 5జీతో 10 నుంచి 100 రెట్లు డౌన్‌లోడ్ వేగం సాధించవచ్చని విశ్లేషిస్తున్నారు. క్రమంగా 10వేల ఎంబీపీఎస్ వేగాన్ని అందుకోవచ్చని భావిస్తున్నారు.

దేని స్పీడు ఎంత

3జీ	4జీ	5జీ
3.1 ఎంబీపీఎస్	1000 ఎంబీపీఎస్	10,000 ఎంబీపీఎస్

బోలెడు ఉపయోగాలు..

ప్రస్తుతం మనం మొబైల్ ఫోన్లతో చేస్తున్న పనులన్నింటినీ మరింత వేగంగా, మెరుగ్గా చేపట్టవచ్చు. మరిన్ని ఎక్కువ పరికరాలను ఏకకాలంలో మొబైల్ ఇంటర్నెట్‌కు అనుసంధానించడానికి వీలవుతుంది. విస్తృత కవరేజీ, మరింత స్థిరమైన కనెక్షన్లు కూడా సాధ్యమవుతాయి. వీడియోలు స్తంభించడం ఉండదు. వీడియో కాల్స్ కూడా మరింత స్పష్టంగా, కుదుపులు లేకుండా ఉంటాయి.

- 4జీ కనెక్షన్లు సరాసరిన ఒక హెచ్‌డీ సినిమాను డౌన్‌లోడ్ చేసుకోవడానికి దాదాపు అర గంట పడుతుంది. 5జీ ద్వారా దాదాపు 25-40 సెకన్లలో అది పూర్తవుతుంది.
- ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, మొబైల్ వర్చువల్ రియాల్టీతో కూడిన మరింత మెరుగైన స్మార్ట్ గ్లాసెస్ సాధ్యమవుతాయి. అనేక వస్తువులను ఇంటర్నెట్‌కు అనుసంధానించే 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐవోటీ), కృత్రిమ మేధస్సు విస్తృతమవుతాయి. దీనివల్ల ఇళ్లు, నగరాలు మరింత స్మార్ట్‌గా రూపుదిద్దుకుంటాయి.

- డ్రోన్ కార్యకలాపాలు మరింత మెరుగవుతాయి. అవి సమూహంగా వ్యవహరిస్తూ, వేగంగా పరస్పరం సహకరించుకుంటూ విశ్లేషణలు, ట్రాఫిక్ పర్యవేక్షణ; సహాయ, గాలింపు చర్యలు వంటివి చేపట్టగలవు.
- స్వయం చోదక వాహనాలు పరస్పరం కమ్యూనికేషన్లు సాగించడంలోను మ్యాప్‌సు, ట్రాఫిక్ డేటాను అప్పటికప్పుడు విశ్లేషించడంలో 5జీ సేవలు కీలకం కాబోతున్నాయి.
- సమాచార బట్వాడాలో జాప్యం తక్కువగా ఉంటుంది.
- శరీరానికి ధరించే ఫిట్‌నెస్ సాధనాలు మరింత మెరుగ్గా, ఎప్పటికప్పుడు మన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తాయి. అత్యవసర సమయంలో శరవేగంగా వైద్యులను అప్రమత్తం చేస్తాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

భారత్‌లో ధరపై తకరారు

5జీ మొబైల్ నెట్‌వర్క్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించే ప్రక్రియ 100 రోజుల్లో ప్రారంభమవుతుందని, ఈ ఏడాది చివర్లోగా స్పెక్ట్రమ్‌ను వేలం వేస్తామని కేంద్ర టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇటీవలే ప్రకటించారు. అయితే వేలానికి సంబంధించిన మూల ధర భరించలేని స్థాయిలో ఉందని భారత సెల్యులర్ ఆపరేటర్ల సంఘం (సీఓఏఐ) ఆక్షేపించింది. ప్రపంచంలో ఇతర దేశాల కన్నా చాలా ఎక్కువగా ఉందని వివరించింది. అయితే 5జీ వ్యవస్థ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నందువల్ల ధరను తగ్గిస్తేనే తాము 5జీ గురించి ఆలోచించగలమని కొన్ని కంపెనీలు తెగేసి చెబుతున్నాయి. దీంతో భారత్‌లో 5జీ సేవలు ఆలస్యమయ్యే అవకాశం కనపడుతోంది. మూల ధర ప్రాతిపదికన చూస్తే దేశవ్యాప్తంగా 5జీ స్పెక్ట్రమ్ సేవల కోసం ఒక కంపెనీకి 142 కోట్ల డాలర్లు ఖర్చవుతుంది.

స్పెక్ట్రమ్ సిద్ధం

5జీకి కేటాయించిన స్పెక్ట్రమ్: భారత్‌లోని 3300-3600 మెగా హెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో 20 మెగా హెర్ట్జ్

ధర: మెగా హెర్ట్జుకు రూ.492 కోట్లు

జీఎస్ఎం అసోసియేషన్ అంచనాల ప్రకారం..

2025 నాటికి (భారత్‌లో)

- 92 కోట్లు: మొబైల్ చందాదారుల సంఖ్య
- 8.8 కోట్లు: 5జీ కనెక్షన్లు ఉండే వారి సంఖ్య

2025 నాటికి (చైనాలో)

- 30%: మొత్తం కనెక్షన్లలో 5జీ వాటా

ఏమిటీ 5జీ?

5జీ లేదా ఫిఫ్త్ జనరేషన్ (ఎదో తరం) అనేది మొబైల్ ఇంటర్నెట్‌లో అదునాతన వెర్షన్. ఇందులో డేటా డౌన్‌లోడ్, అప్‌లోడ్ వేగం చాలా ఎక్కువగా ఉంటుంది. రేడియో తరంగాల స్పెక్ట్రమ్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకోవడం ఇందులో కీలకం.

- ఇందులో రేడియో తరంగాలను ఏ పౌనఃపున్యంలో ఉపయోగించాలి, నెల్ టవర్ల తీరుతెన్నులు ఎలా ఉండాలన్నదానిపై కొత్త నిబంధనలు వచ్చాయి. గత ఏడాది మే నెలలో కాలిఫోర్నియాలో జరిగిన ఒక సదస్సులో ఇవి ఖరారయ్యాయి.
- 5జీ ప్రమాణాల వల్ల బేస్ స్టేషన్లు చాలా చిన్నగా ఉంటాయి. దీనివల్ల సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయాల్సిన స్థలం విషయంలో కొంత వెసులుబాటు లభిస్తుంది.

చైనాలో 5జీ సేవలు

4 ప్రభుత్వరంగ కంపెనీలకు వాణిజ్య లైసెన్సులు

బీజింగ్: అత్యంత వేగవంతమైన వైర్‌లెస్ నెట్‌వర్క్‌ను ప్రారంభించేందుకు ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న పోటీలో సత్తా చాటేందుకు చైనా తహతహలాడుతోంది. ఈ దిశగా 5జీ మొబైల్ సేవలను ఆరంభించేందుకు ప్రభుత్వ రంగంలోని నాలుగు టెలికం కంపెనీలకు గురువారం లైసెన్సులు జారీ చేసింది. సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య అంశాలపై అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ చర్యకు ప్రాధాన్యం ఏర్పడింది. చైనా టెలికం, చైనా మొబైల్, చైనా యూనికామ్, చైనా రేడియో అండ్ టెలివిజన్ సంస్థలకు ఈ లైసెన్సులు మంజూరయ్యాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధంతో నేపథ్యంలో హువావే, జడ్‌టీఈ వంటి చైనా టెలికం కంపెనీలకు సాయం చేసే ఉద్దేశంతో ఈ చర్యను చేపట్టారా అన్న ప్రశ్నకు.. 5జీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని విదేశీ కంపెనీలనూ ఆహ్వానిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ తెలిపారు.

మమతకు ప్రశాంత్ కిశోర్ సలహాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సలహాదారునిగా వ్యవహరించనున్నారు. వారిరువురు గురువారం ఇక్కడ రెండు గంటల పాటు సమావేశమయ్యారు. 'ఎన్నికల విజయం' ప్యాకేజీపై సంతకాలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బాజపాను అడ్డుకునేందుకు ప్రశాంత్ కిశోర్ సహాయం తీసుకోవాలని మమత నిర్ణయించారు. 2014లో మోదీ, 2015లో నితీశ్‌ల గెలుపునకు ఆయన సహకారం అందించారు. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు సలహాలు ఇచ్చినా అవి ఫలించలేదు.

మోదీ, ఇమ్రాన్‌ల భేటీ ఉండదు

దిల్లీ: షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సమావేశాల విరామ సమయంలో భారత్, పాక్ ప్రధానులు నరేంద్ర మోదీ, ఇమ్రాన్ ఖాన్‌ల భేటీ ఉండబోదని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న ఈ సమావేశాల సందర్భంగా ఇరువురు నేతల భేటీకి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయలేదని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ చెప్పారు. కాగా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్‌శంకర్ తన తొలి అధికార పర్యటనను భూటాన్‌తో ప్రారంభించనున్నారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై చర్చలు జరపనున్నారు.

చిన్నారి కళ్లు పెరికి.. చేతులు విరిచి!

అలీగఢ్: మానవత్వం మంటగలిసింది. ముక్కుపచ్చలారని చిన్నారి చేతులు విరిచి.. కనుగుడ్లు పెరికి దారుణాతి దారుణంగా హతమార్చారు. అది కూడా కేవలం రూ.5వేల అప్పు విషయమై జరిగిన గొడవలో! ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ప్రాంతంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. బాలిక మృతదేహాన్ని కుక్కలు పీక్కుతింటుండగా స్థానికులు గమనించడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. తాము పిర్యాదు చేసినా పోలీసులు సరిగా స్పందించకపోవడం వల్లే తమ కూతురి ప్రాణాలు పోయాయని చిన్నారి తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు.

నర్సురూప రాక్షసుడికి జీవితఖైదు

అల్టెన్‌బర్గ్: ఆసుపత్రులలో రోగులకు ప్రమాదకరమైన ఇంజెక్షన్లు ఇచ్చి 85 మందికి పైగా ప్రాణాలు బలిగొన్న జర్మన్ నర్సుకు అక్కడి కోర్టు జీవితఖైదు విధించింది. నీల్ హోగెల్ (42) ఎందుకింత దారుణాలకు పాల్పడ్డాడో అర్థం కావడం లేదని జడ్జి సెబాస్టియన్ బ్యూర్‌మన్ అన్నారు. 2000 నుంచి 2005 వరకు హోగెల్ తాను పనిచేసిన వివిధ ఆసుపత్రులలో రోగులను ఇంజెక్షన్లు ఇచ్చి చంపుతూనే ఉన్నాడు. 2005లో ఒకసారి ఇలా ఇంజెక్షన్ ఇస్తూ పట్టుబడ్డాడు. ఇంతకుముందు ఆరు హత్యల కేసులో జీవితఖైదు పడి, పదేళ్లుగా హోగెల్ జైల్లోనే ఉన్నాడు. మూడో కేసులో అతడికి మరోసారి జీవితఖైదు శిక్ష పడింది.

అమెరికాలో భారతీయ మాజీ సీఈవోపై కేసు

వాషింగ్టన్: అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీ నాస్‌డాక్‌లో నమోదు కోసం ఓ కంపెనీకి అధికంగా ఆదాయం ఉన్నట్లు చూపించి మోసగించిన భారతీయ మాజీ సీఈవోపై కేసు నమోదయింది. లాంగ్‌పిన్ కార్పొరేషన్ కోసం వెంకట మీనవల్లి (49) ఈ అక్రమాలకు పాల్పడ్డారని అమెరికా అటార్నీ బ్రెయిర్ కార్పెంటియా బుధవారం ఇక్కడ చెప్పారు. క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నామని, బ్లాక్ చెయిన్ ఆధారిత సేవలు అందిస్తున్నామంటూ 2017, 2018లో 66 మిలియన్ డాలర్లు (రూ.457 కోట్లు) లేని ఆదాయాన్ని చూపించారు. దాంతో 2017లో షేరు ధర ఒకేసారి 2,000 శాతం మేర పెరిగింది. దీనిపై అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ కూడా కేసు నమోదు చేసింది.

ప్రశ్నపత్రాల లీకేజీ... ముగ్గురి అరెస్టు

దిల్లీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సీబీఐ ముగ్గుర్ని అరెస్టు చేసింది. లీకేజీలో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించిన అక్షయ్‌కుమార్ మాలిక్‌తో పాటు సందీప్ మాథుర్, ధర్మేంద్రలను అరెస్టు చేశామని సీబీఐవర్గాలు తెలిపాయి. లీకేజీ కేసులో పది మంది 'సిఫీ టెక్నాలజీస్' ఉద్యోగులతో పాటు 17 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పాయి.

యూట్యూబ్‌లో విద్వేష వీడియోలకు అడ్డుకట్ట!

దిల్లీ: విద్వేషపూరిత వీడియోల వ్యాప్తికి అడ్డుకట్ట వేసే దిశగా 'యూట్యూబ్' చర్యలకు ఉపక్రమించింది. హింస, వేధింపులు, విద్వేషం, వివక్షత పురిగొల్పేలా ఉన్న వీడియోలను తొలగించేందుకు వీలుగా వేగవంతమైన నూతన విధివిధానాలను గురువారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. కులం, మతం, జాతి, లింగం, వయసు వంటి ఏ అంశాల ఆధారంగానైనాసరే వివక్షకు తావిచ్చేలా ఉండే వీడియోలను ఇకపై నిషేధించనున్నట్లు 'యూట్యూబ్' తమ బ్లాగులో తెలిపింది. నాజీ సిద్ధాంతాలను ప్రోత్సహించే వీడియోలను విద్వేష, వివక్షాపూరిత వీడియోలకు ఉదాహరణగా సూచించింది.

నీతి ఆయోగ్‌లో రాజీవ్ కుమార్ కొనసాగింపు

ఈనాడు, దిల్లీ: నీతి ఆయోగ్‌లో దాదాపుగా పాత బృందాన్నే కొనసాగిస్తూ గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి పదవుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఉపాధ్యక్షుడిగా రాజీవ్‌కుమార్, ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా అమితాబ్ కాంత్ కొనసాగనున్నారు. శాశ్వత సభ్యుల్లో బిబేక్ దేబ్రాయ్‌ను తొలగించి, వీకే సారస్వత్, ప్రొఫెసర్ రమేశ్‌చంద్, డాక్టర్ వీకే పాల్‌లను కొనసాగించారు. పదవీరీత్యా సభ్యులుగా మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నిర్మలా సీతారామన్, నరేంద్రసింగ్ తోమర్ వ్యవహరిస్తారు. ప్రత్యేక ఆహ్వానితులుగా నితిన్ గడ్కరీ, థావర్ చంద్ గహ్లోత్, పీయూష్ గోయెల్, రావు ఇందర్‌జిత్ సింగ్‌లను నియమించారు.

అన్ని సంఘాల్లోనూ అమిత్ షా

- కేబినెట్ కమిటీలు ఏర్పాటు చేసిన కేంద్రం
- ఎనిమిదింటిలో హోంమంత్రికి స్థానం
- పార్లమెంటరీ కమిటీకి రాజ్‌నాథ్ సారథ్యం



ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 8 కేబినెట్ కమిటీల్లోనూ ప్రధాని మోదీకి అత్యంత విశ్వాసపాత్రుడిగా గుర్తింపు పొందిన హోంమంత్రి అమిత్ షాకు చోటు దక్కింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పార్లమెంటరీ వ్యవహారాల కమిటీకి నేతృత్వం వహిస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ తప్పించి చాలా వాటికి ప్రధాని మోదీ నాయకత్వం వహిస్తారు. ముందుగా.. కొన్ని కమిటీల్లో రాజ్‌నాథ్ పేరు కనిపించలేదు. తర్వాత ప్రభుత్వం సవరించిన జాబితాను కేబినెట్ సెక్రటేరియట్ వెబ్‌సైట్‌లో ఉంచింది. కేబినెట్ నియామకాల కమిటీలో ప్రధానిమోదీ, అమిత్‌షా మాత్రమే ఉండనున్నారు.

రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ(సీసీపీఏ): ప్రధాని మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్, కేంద్రమంత్రులు నితిన్‌గడ్కరీ, నిర్మలాసీతారామన్, రవిశంకర్‌ప్రసాద్, నరేంద్రసింగ్ తోమర్, రాంవిలాస్ పాస్వాన్, హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, హర్షవర్ధన్, పీయూష్ గోయెల్, ప్రహ్లాద్‌జోషి, అరవింద్ సావంత్ ఉన్నారు.

భద్రతపై కేబినెట్ కమిటీ(సీసీఎస్): ప్రధాని మోదీ నేతృత్వం వహిస్తారు. రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, జయ్‌శంకర్, నిర్మలాసీతారామన్ సభ్యులుగా ఉంటారు.

వసతులపై కేబినెట్ కమిటీ: అమిత్‌షా నేతృత్వం వహిస్తారు. నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్ సభ్యులుగా ఉంటారు. జితేంద్రసింగ్, హర్‌దీప్‌సింగ్ పురి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ(సీసీఈఏ): రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, గడ్కరీ, సదానందగౌడ, నిర్మలాసీతారామన్, తోమర్, రవిశంకర్‌ప్రసాద్, హర్‌సిమ్రత్ సభ్యులుగా ఉంటారు. జయ్‌శంకర్, గోయెల్, ధర్మేంద్ర ప్రధాన్ కూడా ఇందులో ఉన్నారు.

పార్లమెంటరీ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ: రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వం వహిస్తారు. అమిత్‌షా, నిర్మలాసీతారామన్, పాస్వాన్, తోమర్, రవిశంకర్‌ప్రసాద్, థావర్‌చంద్ గెహ్లోత్, ప్రకాష్ జావడేకర్, ప్రహ్లాద్‌జోషి సభ్యులుగా ఉంటారు. అర్జున్‌రాంమేఘ్వాల్, మురళీధరన్ ప్రత్యేక ఆహ్వానితులు. ఈ కమిటీ ముందుగా అమిత్‌షా నేతృత్వం వహిస్తారని ప్రభుత్వ ఆదేశాలు పేర్కొన్నా, ఆ తర్వాత సవరించారు. బుధవారం ప్రభుత్వం పెట్టుబడులు, వృద్ధిపై, ఉద్యోగిత, నైపుణ్యాభివృద్ధిపై రెండు కమిటీలను ఏర్పాటు చేసింది.

ఆరు కమిటీల్లో రాజ్‌నాథ్..

రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను చాలా కమిటీల నుంచి దూరంగా ఉంచిన ప్రభుత్వం గురువారం రాత్రి పలు కమిటీల్లో చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీనిద్వారా కీలక కమిటీల కూర్పును సమతౌల్యం చేసినట్లుగా బావిస్తున్నారు. గురువారం ఉదయం వెలువడిన అధికారిక ప్రకటన ప్రకారం రాజ్‌నాథ్ పేరు ఆర్థిక వ్యవహారాలు, భద్రత కమిటీల్లో మాత్రమే ఉంది. తర్వాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని నాలుగు కమిటీల్లో చోటు కల్పించింది. రాజకీయ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాలు, పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగిత నైపుణ్యాభివృద్ధి కమిటీల్లో రాజ్‌నాథ్‌కు అవకాశం దక్కింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొత్తం ఎనిమిది కమిటీల్లోనూ అమిత్‌షా ఉన్న నేపథ్యంలో చివర్లో మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాజ్‌నాథ్ పార్లమెంటరీ వ్యవహారాలపై కమిటీకి నేతృత్వం వహించనుండగా, ఇందులో సభ్యులుగా ప్రధాని లేరు, అమిత్‌షా ఉన్నారు. రాజ్‌నాథ్ నియామకాలు, వసతుల కమిటీల్లో లేరు. నియామకాల కమిటీలో సంప్రదాయంగా ప్రధాని, హోంమంత్రి సభ్యులుగా ఉంటారు. వసతుల కమిటీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఒకటి తప్పించి అన్ని కమిటీల్లోనూ చోటు దక్కించుకున్నారు.

వలస బాలలకు న్యాయ సేవల నిరాకరణ

- నిధుల్లేవంటూ ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం

వీనిక్స్: అమెరికాలో వలస చిన్నారులకు అందించే సేవల్లో ట్రంప్ ప్రభుత్వం కోత విధించనుంది. ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న సదరు బాలలకు ఇకపై ఆంగ్ల భాష కోర్సులు, న్యాయ సేవలు దూరం కాబోతున్నాయి. ఈ రెండు అంశాలకు అయ్యే ఖర్చును ఇక తాము చెల్లించబోమంటూ దేశవ్యాప్తంగా అన్ని సంరక్షణ కేంద్రాలకు 'ఆరోగ్యం, మానవ సేవల శాఖ' గత నెల 30న సమాచారం అందించింది. దేశంలోకి వలస వచ్చే చిన్నారుల సంఖ్య భారీగా ఉంటోందని, వారందరికీ అన్ని సేవలు అందించేందుకు సరిపడా నిధులు తమ వద్ద అందుబాటులో లేవని తెలిపింది. వాస్తవానికి వలస చిన్నారులకు సంరక్షణ కేంద్రాల్లో విద్య బోధించడంతోపాటు వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేసే బాధ్యత అమెరికా ప్రభుత్వంపైనే ఉందని 'ప్లోరెస్ ఒప్పందం' స్పష్టం చేస్తోంది. ట్రంప్ ప్రభుత్వ తాజా నిర్ణయం ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13,200 మంది వలస చిన్నారులు సంరక్షణ కేంద్రాల్లో ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది.

అమిత్ షాకు వాజ్‌పేయీ నివాసం

దిల్లీ: కేంద్ర మంత్రి అమిత్ షాకు దిల్లీలో క్రిష్ణ మేనన్ మార్గ్‌లోని మాజీ ప్రధాని వాజ్‌పేయీ నివాసాన్ని ప్రభుత్వం కేటాయించినట్లు సమాచారం. 2004లో అధికారం కోల్పోయిన తర్వాత వాజ్‌పేయీ ఈ ఇంట్లోకి వెళ్లారు. 14 ఏళ్లపాటు అక్కడే గడిపారు. ఆయన మరణించిన నేపథ్యంలో వాజ్‌పేయీ కుటుంబ సభ్యులు ఆ ఇంటిని ఖాళీ చేశారు. ప్రస్తుతం మరమ్మతులు జరుగుతున్నాయనీ, ఒకట్రెండు నెలల్లో ఇంటిని మంత్రికి అప్పగించే అవకాశముందని సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి.

సిద్ధూ శాఖలలో కోత

పలువురు మంత్రుల శాఖల్లో మార్పు

చండీగఢ్: పంజాబ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం రేగింది. ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్‌తో ఉన్న విభేదాల కారణంగా రాష్ట్ర మంత్రి, మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ శాఖలలో కోత పడింది. కీలకమైన స్థానిక సంస్థల శాఖను, పర్యాటక.. సాంస్కృతిక వ్యవహారాల శాఖను ఆయన నుంచి తప్పించి.. విద్యుత్, నవ, పునరుద్ధరణీయ ఇంధన వనరుల శాఖలను ఇచ్చారు. నలుగురు తప్ప రాష్ట్ర మంత్రులందరి శాఖలలో మార్పుచేర్పులు చేశారు. సార్వత్రిక ఎన్నికలలో సరైన ఫలితాలు రాని చోట్ల ఉన్న మంత్రులందరికీ శాఖలను సీఎం మార్చారు. ఈ మార్పు వల్ల ప్రభుత్వం గాడిలో పడుతుందని, శాఖల పనితీరులో సమర్థత పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. అంతకుముందు నిర్వహించిన మంత్రివర్గ సమావేశానికి సిద్ధూ గైర్హాజరయ్యారు. మంత్రిత్వశాఖల తొలగింపుపై ఆయన మండిపడ్డారు. "అంతర్జాతీయ క్రికెట్, జెఫ్రీ బాయ్‌కాట్‌తో కలిసి ప్రపంచస్థాయి వ్యాఖ్యానం, టీవీ కార్యక్రమాలు, సూర్రిమంతమైన ప్రసంగాలు.. ఇలా రంగం ఏదైనా గత 40 ఏళ్లలో నా పని తీరు బాగుంది" అని విలేకరులతో అన్నారు.

పశుపతినాథుడి సంపద 120 కోట్లు!

కాఠ్‌మాండూ: నేపాల్‌లోని ప్రఖ్యాత పశుపతినాథ్ ఆలయం తొలిసారి స్వామి సంపద వివరాలను వెల్లడించింది. ఆలయానికి రూ. 120 కోట్ల నగదుతో పాటు 9.276 కిలోల బంగారం, 316 కిలోల వెండి ఉన్నాయని ఆలయ కమిటీ తెలిపింది. స్వామి ఆస్తుల వివరాలను తొలిసారి బయట పెడుతున్నట్లు పశుపతి ప్రాంత అభివృద్ధి ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ ఉప్రేటి తెలిపారు. వివిధ బ్యాంకులలో రూ. 120 కోట్ల నగదుతో పాటు.. 186 హెక్టార్ల భూమి కూడా స్వామికి ఉంది.

'డిప్యూటీ స్పీకర్' ఇవ్వండి: శివసేన

ముంబయి: ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో ఒకేఒక్క మంత్రి పదవి పొందిన శివసేన తాజాగా లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని కూడా ఆశిస్తోంది. ఇదే విషయాన్ని బాజపా దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు శివసేన నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్‌రౌత్ తెలిపారు. తమ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్‌ఠాక్రేతో పాటు 18 మంది లోక్‌సభ ఎంపీలు వచ్చే వారం అయోధ్యను సందర్శించనున్నట్లు చెప్పారు.

కళ్ల ముందే కనిపించకుండా పోయిన పైలట్ భర్త

- 'ఏటీసీ' విధి నిర్వహణలో భార్య
- ఏఎన్-32 విమాన దుర్ఘటన

దిల్లీ: నాలుగు రోజుల క్రితం రాడార్‌కు అంతుచిక్కకుండా పోయిన భారత వైమానిక దళాని(ఏఎఫ్)కి చెందిన రవాణా విమానం 'ఏఎన్-32'కి సంబంధించి గురువారం హృదయాన్ని కలచివేసే విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఆ విమానాన్ని నడిపిన పైలట్ ఆశీశ్ తన్వర్ (29) భార్య అయిన సంధ్య తన్వర్ ఆ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)లో విధుల్లో ఉన్నారు. ఆశీశ్ నడుపుతున్న విమానం గాల్లోకి లేచిన అరగంటలోనే రాడార్‌పై కనిపించకుండా పోవడాన్ని మొదట గమనించిన కొద్దిమందిలో ఆమె కూడా ఒకరని అధికారులు వెల్లడించారు. ఏఎన్ 32 రవాణా విమానం సోమవారం మధ్యాహ్నం 12.27 గంటలకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని దట్టమైన అటవీప్రాంతమైన మెంచుకాప్రాంతంలో ప్రవేశించాక అదృశ్యమైన సంగతి తెలిసిందే. జోర్‌హాట్ వైమానిక స్థావరంలో 'ఏటీసీ' విభాగంలో పనిచేసే సంధ్య ఫ్లైట్ లెఫ్టినెంట్ ఆశీశ్‌ను 2018లో వివాహమాడారు. హరియాణాలోని పల్

దిగుబడి తగ్గి దిగాలు

- పండ్లు, టమాటా పంటలది అదే దారి
- తెలుగు రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి
- దేశంలో ఆలుగడ్డ దిగుబడి పెరుగుదల
- జాతీయ ఉద్యానశాఖ నివేదికలో వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

దేశవ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లో కీలకమైన పండ్లు, కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. ప్రజలు అధికంగా తినే మామిడి, దానిమ్మ, పుచ్చకాయ వంటి పండ్లతో పాటు టమాటాల దిగుబడి నిరాశాజనకంగా ఉందని కేంద్ర ఉద్యాన మండలి(ఎన్‌హెచ్‌బీ) వెలువరించిన నివేదిక 2018-19 స్పష్టం చేసింది. మొత్తమ్మీద ఇతర అన్ని రకాల పండ్లు, కూరగాయలతో కలిపి చూస్తే ఉద్యాన పంటల దిగుబడి ఒక్క శాతం పెరిగింది. గతేడాది(2018-19)లో అన్ని రకాల పండ్లు, కూరగాయలు కలిపి రికార్డు స్థాయిలో 27.47 కోట్ల టన్నులకు చేరాయి. ఇది అంతకుముందు ఏడాది(2017-18)తో పోలిస్తే 29.73 లక్షల టన్నులు అధికం. ఇతర సాధారణ ఆహార ధాన్యాల పంటలు 28 కోట్ల టన్నులు దాటితే వాటితో పోటీగా పండ్లు, కూరగాయల మొత్తం దిగుబడి పెరుగుతున్నట్లు ఉద్యానశాఖ తెలిపింది. కానీ సామాన్యులు ఎక్కువగా తినే ప్రధానమైన కూరగాయలు, పండ్ల దిగుబడి తగ్గడం గమనార్హం. ఉత్తరాది రాష్ట్రాల్లో అధికంగా సాగుచేసే ఆలుగడ్డ రికార్డు స్థాయిలో 16.49 లక్షల టన్నులు పెరగడం విశేషం.

ఆంధ్రప్రదేశ్‌లో...

6 లక్షల టన్నుల వరకూ కూరగాయల దిగుబడి తగ్గడం గమనార్హం. రాయలసీమలో రికార్డు స్థాయిలో 30 శాతానికి వర్షపాతం లోటు ఉండటంతో పండ్ల తోటలు ఎండిపోయి దిగుబడి పతనమైంది.

తెలంగాణలో...

తెలంగాణలో సాగునీటి కొరత, భూగర్భ జలాలు అడుగంటడంతో ఏడాది వ్యవధిలో పండ్లు 31 వేల టన్నులు, కూరగాయలు 13 వేల టన్నులు తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లలో టమాటాల ధర కిలో రూ.60కి చేరింది. ఈ రెండింటి సాగు విస్తీర్ణం పెరిగినా దిగుబడి రాకపోవడం గమనార్హం. దీంతో ఇక్కడకు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు, పండ్లు అధికంగా వస్తున్నాయి. దేశవ్యాప్తంగా టమాటాల దిగుబడి ఏకంగా 99 వేల టన్నులు తగ్గడం వల్ల ఇక్కడి చిల్లర మార్కెట్లలో ధరలు మండిపోతున్నట్లు రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకుడు వెంకట్రాంరెడ్డి చెప్పారు. ఇక్కడ సాగు పెంచడానికి పంటల కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన 'ఈనాడు'కు చెప్పారు.

దేశంలో పరిస్థితి ఇలా..

దేశంలో బాగా దిగుబడి తగ్గిన వాటిలో మామిడి 8.67 లక్షల టన్నులు, ద్రాక్ష 5.25 లక్షల టన్నులు, టమాటా 99 వేల టన్నులు న్నాయి. దేశంలో ద్రాక్ష సాగు విస్తీర్ణం 1.39 లక్షల హెక్టార్ల నుంచి 1.15 లక్షల హెక్టార్లకు పడిపోయింది. ద్రాక్ష పండ్లు ఇప్పుడు చైనాతో పాటు, ఆస్ట్రేలియా నుంచి అధికంగా దిగుమతి అవుతుండటంతో ఇక్కడి రైతులు గిట్టుబాటు కాక వదిలేస్తున్నారు.

ఉల్లిగడ్డల ముందస్తు నిల్వలు

దేశవ్యాప్తంగా దాదాపు అన్ని కుటుంబాలు వినియోగించే ఉల్లిగడ్డలు కేవలం 22 వేల టన్నులే అధికంగా పండాయి. ఈ పంట అధికంగా సాగుచేసే మహారాష్ట్రలో వర్షాలు లేక దిగుబడులు పెద్దగా రాలేదు. వచ్చే అక్టోబరు నుంచి పండగల సీజన్‌లో వీటి ధరలు మండే అవకాశాలున్నాయని కేంద్రం ముందస్తు నిల్వలు పెట్టాలని తాజాగా నిర్ణయించింది. ఇప్పుడే రైతుల నుంచి 50 వేల టన్నులు కొని నిల్వ చేయాలని 'జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య'(నాఫెడ్)ను ఇటీవల ఆదేశించింది. ఇప్పటికే 35 వేల టన్నుల వరకూ రైతుల నుంచి కొన్నది. దేశంలో ధరలు పెరిగితే వీటిని బహిరంగ మార్కెట్‌లోకి తీసుకు రావాలని ముందస్తు నిల్వలు పెంచుతున్నారు.





తెలంగాణలో పండ్లు కూరగాయల దిగుబడి తీరు (లక్షల టన్నులు)		
పంట	2017–18	2018–19
పండ్లు	19.39	19.08
కూరగాయలు	27.53	27.40

ఆంధ్రప్రదేశ్‌లో పండ్లు కూరగాయల దిగుబడి తీరు (లక్షల టన్నులు)		
పంట	2017–18	2018–19
పండ్లు	152.15	150.22
కూరగాయలు	69.08	63.08

ఎంపీపీలు కీలకం

- బలమున్న ప్రతిచోటా గెలవాలి
- నేతలకు తెరాస అధిష్ఠానం ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగే మండల పరిషత్ అధ్యక్షుల పరోక్ష ఎన్నికల్లో బలమున్న ప్రతి స్థానంలోనూ తెరాస గెలవాలని ఆ పార్టీ అధిష్ఠానం అన్ని జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, ఇన్‌చార్జులకు సూచించింది. నిర్లక్ష్యంతో ఏ ఒక్క స్థానాన్ని కోల్పోయినా సహించేది లేదని పేర్కొంది. ఎంపీటీసీ స్థానాల్లో 90 శాతానికి పైగా గెలిచామని, దీనికి అనుగుణంగా ఎంపీపీ స్థానాలు పార్టీకి దక్కాలంది. చాలామంది తిరుగుబాటు అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల్లోని సభ్యులు సైతం తెరాసకు అనుకూలంగా ఓటు వేయవచ్చని తెలిపింది. దీనికి అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం ఎంపీపీ ఎన్నికల సరళిపై ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతి ఎంపీపీ స్థానాన్ని కీలకంగా భావించాలని సూచించారు. ప్రతి మండలంలో గులాబీ జెండాను ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ నేతలు సమన్వయంతో వ్యవహరించాలని, విభేదాల వల్ల పార్టీకి నష్టం జరగరాదన్నారు. ఎంపీపీలుగా పార్టీ తరఫున సమర్థుల ఎంపిక జరిగిందని, వారిని గెలిపించేందుకు కృషి చేయాలని కేటీఆర్ చెప్పారు. పార్టీ ఇన్‌చార్జులు ప్రతిచోటా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

జడ్పీటీసీ సభ్యులతో సమావేశాలు కొనసాగింపు

జడ్పీ చైర్‌పర్సన్ల పరోక్ష ఎన్నికలపైనా కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల్లో మంత్రులు, ఇన్‌చార్జులతో మాట్లాడారు. శనివారం జరగనున్న జడ్పీ చైర్‌పర్సన్ల ఎంపికకు సభ్యులందరినీ సన్నద్ధం చేయాలని, సాధ్యమైనంత మేరకు ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 32 జిల్లా పరిషత్‌లకు సంబంధించిన చైర్‌పర్సన్లను శుక్రవారం అధిష్ఠానం ఎంపిక చేయనుంది. ఇప్పటికే ఆయా జిల్లాల్లో సభ్యుల అభిప్రాయసేకరణ పూర్తయింది. ఒకటి, రెండు జిల్లాల్లో సమన్వయం కోసం యత్నాలు జరుగుతున్నాయి. వాటిని శుక్రవారం మధ్యాహ్నం వరకు పూర్తిచేసి, సాయంత్రానికి అధికారికంగా అభ్యర్థులను ఖరారు చేయాలని అధిష్ఠానం భావిస్తోంది.

పాలిటెక్నిక్ విద్యార్థులకు సున్నా మార్కులు

- సాంకేతిక విద్యాశాఖాధికారుల నిర్వాకం
- 53 మంది విద్యార్థుల ఆందోళన

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒకపక్క ఇంటర్‌బోర్డు నిర్వాకాలు విద్యార్థులను, తల్లిదండ్రులను చికాకు పెడుతుండగా ఇప్పుడు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి కూడా ఆదే బాట పట్టినట్టు కనిపిస్తోంది. మండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మైనింగ్ ప్రాక్టికల్స్‌లో సున్నా మార్కులు వేసి మెమోలు పంపారని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివే 53 మంది విద్యార్థులు పేర్కొంటున్నారు. మే 9న మైనింగ్ డిప్లొమా చివరి సంవత్సరం విద్యార్థులకు ఆరో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. స్థానిక అధ్యాపకులు విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులు వేసి రాష్ట్ర సాంకేతిక విద్యా మండలికి పంపించారు. కానీ జూన్ 1న ప్రకటించిన ఫలితాల్లో మాత్రం ఆ 53 మంది విద్యార్థులకు మైనింగ్ ప్రాక్టికల్స్‌లో సున్నా మార్కులు వచ్చినట్టుంది. స్థానిక కళాశాల అధ్యాపకులు సాంకేతిక విద్యా మండలికి పంపించిన ప్రాక్టికల్స్ మార్కులను పరిశీలించగా అందులో విద్యార్థులకు మార్కులు బాగానే వచ్చినట్టుంది. దాంతో వారు విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ స్పందన లేకపోవడంతో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా సాంకేతిక విద్యా మండలి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టారు. సాంకేతిక సమస్య వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ఉపరాష్ట్రపతి సిఫార్సు లేఖ ఫోర్జరీ

- కోలారు భక్తుడి నిర్వాకం
- అరెస్టు చేసిన తిరుమల పోలీసులు

కిశోర్‌కుమార్

తిరుమల, న్యూస్‌టుడే: ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పేరిట పోర్జరీ సిఫార్సు లేఖ సృష్టించడం తితిదే వర్గాల్లో సంచలనం రేపింది. నిందితుడిని తితిదే విజిలెన్స్ విభాగం అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించింది. కర్ణాటక రాష్ట్రం కోలారుకు చెందిన కిశోర్‌కుమార్(20) ఎంబీఏ పట్టభద్రుడు. శ్రీవారిని దర్శించుకోవడానికి ఉప రాష్ట్రపతి సిఫార్సు లేఖను తనే సొంతంగా తయారు చేసుకుని తిరుమలకు బుధవారం వచ్చారు. జేఈవో కార్యాలయానికి చేరుకుని ఎల్-1 కింద 12 టిక్కెట్లకు దరఖాస్తు చేసి రశీదులు పొందారు. అనంతరం కార్యాలయ పర్యవేక్షకులు దరఖాస్తుతో పాటు సిఫార్సు లేఖను పరిశీలించగా.. ఉప రాష్ట్రపతి పేరిట ఎన్నడూ సిఫార్సు లేఖలు వచ్చిన దాఖలాలు లేవని తేలింది. అనుమానంతో పర్యవేక్షకులు విజిలెన్స్‌కు సమాచారమిచ్చారు. నిఘా విభాగం అధికారులు దర్యాప్తు చేయగా.. అది పోర్జరీ లేఖగా బయటపడింది. తిరుమలలోనే ఉన్న కిశోర్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పోర్జరీ లేఖను తయారు చేసినట్లు అంగీకరించాడు. తిరుపతి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మరో వంద 'బాలాకోట్ బాంబులు'!

ఇజ్రాయెల్ నుంచి కొనుగోలుకు రూ.300 కోట్లతో భారత్ ఒప్పందం

దిల్లీ: ఇజ్రాయెల్ నుంచి వంద 'స్పైస్-2000' బాంబులను కొనుగోలు చేసేందుకు భారత వైమానిక దళం గురువారం రూ.300 కోట్లతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అధునాతనమైన ఈ బాంబులను పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరంపై దాడి చేయడానికి భారత్ ఉపయోగించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ అడ్వాన్స్డ్ డిఫెన్స్ సిస్టమ్స్ సంస్థ ఈ ఆయుధాలను తయారుచేస్తోంది. నరేంద్ర మోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక కుదుర్చుకున్న మొట్టమొదటి రక్షణ ఒప్పందం ఇదే. అత్యవసర కొనుగోలు కింద ఈ బాంబులను సమీకరించుకుంటున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ ఏడాది చివర్లోగా అవి మన అమ్ములపొదిలో చేరతాయని వివరించారు. 900 కిలోల ఉక్కు కవచంలో 80 కిలోల పేలుడు పదార్థాలు ఉంటాయి. లక్ష్యంగా నిర్దేశించిన భవనంలోకి చొచ్చుకెళ్లక కొంత సమయం తీసుకొని ఈ బాంబు పేలుతుంది. పదునైన వస్తువులను వెదజల్లుతుంది. ఫలితంగా సదరు భవనంలోని వారంతా అక్కడికక్కడే చనిపోతారు.

రవిప్రకాశ్ అరెస్టుకు రంగం సిద్ధం!

- విచారణకు సహకరించకపోవడంతో ఆ దిశగా అడుగులు
- న్యాయనిపుణులతో పోలీసుల సంప్రదింపులు
- మరో కేసులో బంజారాహిల్స్ పోలీసుల నోటీస్

ఈనాడు, హైదరాబాద్: టీవీ9 వాటాల వివాదంలో ఆ సంస్థ మాజీ సీఈవో రవిప్రకాశ్ అరెస్టు దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలుత నోటీస్ ఇచ్చిన అనంతరం అరెస్ట్ చేయాలనే యోచనతో ఉన్నట్లు తెలిసింది. 48 గంటల ముందు సమాచారం ఇచ్చిన తర్వాతే అరెస్ట్ చేసే యోచనలో భాగంగా గురువారం న్యాయనిపుణులను కూడా సంప్రదించినట్లు సమాచారం. టీవీ9 మాతృసంస్థ ఏబీసీఎల్‌లో సింహభాగం వాటాలు కొనుగోలు చేసిన ఆలంద మీడియా సంస్థ రవిప్రకాశ్‌పై పోర్జరీ, తప్పుడు పత్రాల సృష్టి, లోగో విక్రయం ఆరోపణలతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్, బంజారాహిల్స్ ఠాణాల్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుల విచారణలో భాగంగా రవిప్రకాశ్‌ను విచారించేందుకు పోలీసులు తొలుత ఇచ్చిన నోటీసులకు రవిప్రకాశ్ స్పందించలేదు. ముందస్తు బెయిల్ ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు మూడు రోజుల క్రితం సైబరాబాద్ ఠాణాలో విచారణకు హాజరయ్యారు. ఆయనను విచారిస్తున్న పోలీసులు.. రవిప్రకాశ్ దర్యాప్తునకు సరైన రీతిలో సహకరించడంలేదని చెప్పడాన్ని బట్టే రవిప్రకాశ్ అరెస్ట్ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు సైబరాబాద్‌లో గురువారం విచారణ జరుగుతున్న సమయంలో బంజారాహిల్స్ పోలీసులు రవిప్రకాశ్‌కు నోటీసు అందజేశారు. టీవీ9 లోగోను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించారనే ఆరోపణలతో రవిప్రకాశ్‌పై నమోదైన కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఉదయం బంజారాహిల్స్ ఠాణాలో హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రవిప్రకాశ్ తమ విచారణకు సహకరించడం లేదనే కారణాన్ని చూపి, ఈ సందర్భంగా పోలీసులు ఆయనను అరెస్ట్ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

టీవీ9 సృష్టికర్తను నేనే

మూడు రోజులుగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు రవిప్రకాశ్ ముక్తసరిగా సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో మరో నిందితుడు మూర్తితోపాటు ఓ న్యాయవాది నుంచి సేకరించిన వాంగ్మూలాల ఆధారంగా కీలక సమాచారాన్ని రాబట్టినట్లు సమాచారం. రవిప్రకాశ్ ఇంట్లో, కార్యాలయాల్లో స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లు, పత్రాలను విశ్లేషించి మరిన్ని వివరాల్ని క్రోడీకరించారు. అసలు విషయానికొచ్చేసరికి రవిప్రకాశ్ దర్యాప్తును మళ్లించే దిశగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టీవీ9 సృష్టికర్తను తానేనని రవిప్రకాశ్ పలుమార్లు పోలీసులతో పేర్కొన్నారు. తానెలాంటి తప్పూ చేయలేదని చెబుతూ అసలు విషయాన్ని మరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మూడో రోజు విచారణలో పోలీసులు చాలా సేపు అయన్ను ఖాళీగానే కూర్చోబెట్టారు. విడతలవారీగా సైబర్‌క్రైమ్ వేర్వేరు పోలీస్ అధికారులు విచారించినా, కీలక అంశాల ప్రస్తావన పెద్దగా రాలేదని తెలిసింది.

మృతుడి పేరుతో రిజిస్ట్రేషన్ కేసులో..

ప్రధాన సూత్రధారి సహా ఇద్దరి అరెస్టు

- పరారీలో మరో ముగ్గురు నిందితులు
- మృతిచెందిన యజమాని పేరుతో నకిలీ ఆధార్‌కార్డు రిజిస్ట్రేషన్

వెంకట చైతన్య

దస్తగిరి

మూసాపేట, న్యూస్‌టుడే: చనిపోయిన వ్యక్తి స్థలాన్ని నకిలీ ఆధార్‌కార్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో కూకట్‌పల్లి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడితోపాటు అతనికి సహకరించిన ఇంకో వ్యక్తి పట్టుబడగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. గురువారం కేసు వివరాలను కూకట్‌పల్లి ఇన్‌ఛార్జి సీఐ వి.రామకృష్ణ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ముదినేపల్లికి చెందిన చింతపల్లి వెంకట చైతన్య(28) బీటెక్ చదివాడు. నాలుగు నెలల నుంచి కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో ఉంటున్నాడు. ఓ రోజు అదే కాలనీకి చెందినవారు స్థానికంగా ఉన్న 159 నంబరు ఖాళీ స్థలానికి యజమాని ఎవరూ రావడం లేదని అనుకుంటుండగా విన్నాడు. దీంతో ఆ స్థలంపై కన్నేశాడు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సదరు ప్లాటుకు చెందిన తప్పనీ, సీసీ కెమెరాను తీసుకున్నాడు. స్కానర్ సహాయంతో నకిలీ దస్తావేజులు రూపొందించాడు.

బ్రోకర్ల సలహాతో..

స్థలాన్ని ఎలా అమ్మాలో తెలియక బ్రోకర్లను సంప్రదిస్తే.. స్థలం యజమాని ప్రకాష్‌రావు పేరుతో ఉన్న ఆధార్ కార్డు కావాలని సలహా ఇచ్చారు. దీంతో అప్పికట్ల శ్రీనివాస్, పణిదీప్, అజిత్‌లను సంప్రదించాడు. ఇప్పటి వరకు ఆధార్, రేషన్ కార్డులేని వ్యక్తి కోసం గాలించగా హైటెక్‌సిటీలో ఉంటున్న కూలీ నాటకారి దస్తగిరి(45) దొరికాడు. అతనికి ఆధార్ కార్డు చేయిస్తామని, తాము చెప్పినట్లు చేస్తే రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించారు. అతనికి మొదట స్థల యజమాని పేరైన కొమరగిరి ప్రకాష్‌రావు పేరుతో నకిలీ పాన్‌కార్డు.. దాని సాయంతో నకిలీ ఆధార్‌కార్డును తయారు చేయించారు. వినయ్‌రెడ్డి అనే వ్యక్తికి స్థలాన్ని విక్రయించేందుకు రూ.1.20 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. అందుకు మొదటి విడతగా వినయ్‌రెడ్డి వీరికి రూ.60 లక్షలు చెల్లించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి తనకు రెండు నెలల గడువు ఇవ్వాలని కోరడంతో వెంకట చైతన్య మురా సభ్యులు అంగీకరించారు.

కబ్జా కుట్ర ఇలా వెల్లడైంది...

ఆ తర్వాత సదరు స్థలం గోడలపై యజమానిగా పేర్కొంటూ వినయ్‌రెడ్డి తన ఫోన్ నంబరును రాసుకున్నారు. స్థలం అసలు యజమాని ప్రకాష్‌రావు మేనల్లుడు శ్రీధర్ అది గమనించి, ఆ నంబరుకు ఫోన్ చేసి 'ఇది తన మేనమామ స్థలమని.. చెప్పారు. ఈ విషయాన్ని వెంకటచైతన్యకు వినయ్‌రెడ్డి ఫోన్‌లో వివరించారు. ఆందోళనకు గురైన చైతన్య.. దస్తగిరి సాయంతో మార్చి 1న కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ మురాలోని సభ్యుడైన అప్పికట్ల శ్రీనివాస్ కొనుగోలు చేసినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత దాని లింకు డాక్యుమెంట్ సాయంతో వినయ్‌రెడ్డి మరదలైన సంజన కొనుగోలు చేసినట్లుగా మరో రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత అదే స్థలాన్ని కీర్తి కుమార్ జైన్‌కు విక్రయించారు. కొద్ది రోజులకే స్థలం అసలు యజమాని బంధువు శ్రీధర్ రావడంతో వీరి వ్యవహారం బయటపడింది. శ్రీధర్ రిజిస్ట్రేషన్ అధికారుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసులో ప్రధాన సూత్రధారి వెంకట చైతన్యతో పాటు, దస్తగిరిలను అరెస్టు చేసిన పోలీసులు గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా అప్పికట్ల శ్రీనివాస్, పణిగిరి, అజిత్ పరారీలో ఉన్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.


మంటల్లో కాలిపోతున్న బస్సు

పూర్తిగా కాలిపోయిన బస్సు

దగ్ధమైన ప్రైవేటు బస్సు

- సురక్షితంగా బయటపడిన 29 మంది ప్రయాణికులు
- కర్నూలు జిల్లా ఏనుగుమర్రి వద్ద ఘటన

డోన్, ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సులోని డీగల్లో రాపిడి కారణంగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా కాలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు ముందుగా గుర్తించి అప్రమత్తం చేయడంతో 29 మంది ప్రాణాలతో బయటపడ్డారు. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఏనుగుమర్రి సమీపంలోకి చేరుకోగానే మంటలు చెలరేగాయి. బస్సు వెనుక సీటులో ఉన్న నదీమ్ అనే యువకుడు డీగలు కాలిన వాసన రావడంతో తోటి ప్రయాణికులను నిద్రలేపి డ్రైవర్ దగ్గరకు వెళ్లారు. ముందు తలుపులు వేయడంతో ఆయన స్పందించే సరికి ఐదు నిమిషాల సమయం పట్టింది. ఈలోగా బస్సులో పొగలు అలుముకున్నాయి. కొందరు అత్యవసర ద్వారం తెరవడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో అందరూ ఒకే దారిలో దిగిన రెండు నిమిషాలకే బస్సులో మంటలు వ్యాపించాయి. ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లు, చరవాణులు, బంగారు ఆభరణాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. డోన్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. పలువురు ప్రయాణికులు రెండు గంటలపాటు అక్కడే గడిపారు. పోలీసుల వాహనాల్లో ప్యాపిలి స్టేషన్‌కు చేరుకొని వారి బంధువులకు క్షేమసమాచారాలను తెలిపారు. తెల్లవారాక ఇతర బస్సుల్లో బెంగళూరుకు పయనమయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 29 మంది ఉన్నట్లు సీఐ మొలకన్న తెలిపారు. బస్సుకు సంబంధించిన ఎలక్ట్రికల్ సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించారు. డీగలు ఒకదానికి ఒకటి రాపిడికి గురై ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఉపవాస దీక్షే కాపాడింది...

బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన నదీమ్ రంజాన్ సందర్భంగా చేపట్టిన ఉపవాస దీక్ష అందరి ప్రాణాలను కాపాడింది. రంజాన్ ముగిశాక ఆరురోజుల పాటు కొందరు దీక్ష కొనసాగిస్తారు. అదేవిధంగా ఆయన దీక్షలో ఉన్నారు. బెంగళూరులో ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఉండటంతో ఈ బస్సులో బయలుదేరారు. 3.15 గంటల సమయంలో ఖర్జూరాలు తిని మళ్లీ నిద్రకు ఉపక్రమించే క్రమంలో ప్రమాదం గుర్తించి అందరినీ అప్రమత్తం చేశారు. మంటల్లో ఆయన చరవాణి, వస్తువులు కాలిపోవడంతో ఇంటర్వ్యూకు వెళ్లకుండా హైదరాబాద్‌కు వెనుదిరిగారు. ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన నదీమ్‌ను పలువురు అభినందించారు.

పండగకు వచ్చిన జవాన్‌ను కాల్చి చంపిన ఉగ్రవాది!

శ్రీనగర్: ప్రాదేశిక సైన్యంలో పనిచేస్తూ... రంజాన్ పండగకని ఇంటికొచ్చిన జవాన్‌ను ఓ ఉగ్రవాది కాల్చి చంపాడు! దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో చోటుచేసుకుందీ ఘటన. సదూరా గ్రామానికి చెందిన మాస్‌జూర్ అహ్మద్ బేగ్ రాష్ట్రీయ రైఫిల్స్‌లో జవాను. షోపియాన్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన... ఈద్ సందర్భంగా సెలవుపై ఇంటికి వచ్చారు. అయితే గురువారం గుర్తుతెలియని వ్యక్తి ఒకరు ఆయన ఇంటికి వచ్చి బేగ్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఇది ఉగ్రవాదుల పనేనని పోలీసులు భావిస్తున్నారు.

Eenadu epaper

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.రేట్
న్యూజిలాండ్	2	2	0	4	+2.279
ఆస్ట్రేలియా	2	2	0	4	+1.059
వెస్టిండీస్	2	1	1	2	+2.054
ఇంగ్లాండ్	2	1	1	2	+0.900
భారత్	1	1	0	2	+0.302
బంగ్లాదేశ్	2	1	1	2	+0.008
శ్రీలంక	2	1	1	2	−1.517
పాకిస్థాన్	2	1	1	2	−2.412
దక్షిణాఫ్రికా	3	0	3	0	−0.952
అఫ్గానిస్థాన్	2	0	2	0	−1.264

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, ఓ: ఓటమి, పా: పాయింట్లు, నె.రేట్: నెట్ రన్‌రేట్

92

ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ కౌల్టర్‌నైల్ స్కోరిది. ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన నంబర్ 8 బ్యాట్స్‌మన్ అతడే. హీత్ స్ట్రీక్ (72)ను అతడు అధిగమించాడు

6

వన్డే క్రికెట్లో ఐదు వికెట్ల ఘనత సాధించడం స్టార్క్‌కు ఇదే ఆరోసారి. వన్డే క్రికెట్లో అత్యంత వేగంగా 150 వికెట్ల మైలురాయిని చేరుకున్న బౌలర్‌గా అతడు రికార్డు సృష్టించాడు. సక్లయిన్ ముస్తాక్ (78 వన్డేల్లో)ను అతడు అధిగమించాడు. స్టార్క్ 77 మ్యాచ్‌ల్లో 151 వికెట్లు పడగొట్టాడు.

వస్తానన్నా.. వద్దన్నారు..!

జొహన్నెస్‌బర్గ్: ఇంకా కొన్నేళ్ళు అంతర్జాతీయ క్రికెట్ ఆడే సత్తా ఉన్నప్పటికీ.. గత ఏడాది హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్. అప్పటి నుంచి అతను లేని లోటు దక్షిణాఫ్రికా జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. అందులోనూ ఇప్పుడు ప్రపంచకప్‌లో సఫారీ జట్టు పేలవ ప్రదర్శన చేస్తుండటంతో అందరూ ఏబీని తలుచుకుంటున్నారు. నిజానికి దక్షిణాఫ్రికా సెల్కర్లు ఒప్పుకుని ఉంటే ఈ ప్రపంచకప్‌లో డివిలియర్స్ ఆడేవాడట. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని ప్రపంచకప్‌లో ఆడాలని అతను అభిలషించాడట. ఈ విషయాన్ని కెప్టెన్ డుప్లెసిస్, కోచ్ గిబ్సన్‌ల దృష్టికి తీసుకెళ్తే వాళ్ళు సానుకూలంగా స్పందించారట. ప్రపంచకప్ కోసం దక్షిణాఫ్రికా జట్టును ఎంపిక చేయడానికి ఒక్క రోజు ముందు ఏబీ.. తన మనసులో మాటను చెప్పాడట. కానీ సెల్కర్లు అతడిని ఎంపిక చేసేందుకు ఒప్పుకోలేదట. ఈ విషయాన్ని దక్షిణాఫ్రికా క్రికెట్ సెల్కర్ కమిటీ ఛైర్మన్ లిండా జోండినే ధ్రువీకరించారు. "2018లో డివిలియర్స్ రిటైర్మెంట్ నిర్ణయం గురించి చెప్పినప్పుడు వద్దని చెప్పా. ప్రపంచకప్ ఆడాలని కోరినా వినలేదు. రిటైర్ అవ్వాలన్న నిర్ణయానికే కట్టుబడ్డాడు. డివిలియర్స్ వెళ్లిపోయాక శూన్యత నెలకొంది. అతడి స్థానాన్ని భర్తీ చేయడానికి ఏడాది పాటు ఆటగాళ్లను ప్రయత్నించాం. ఈ సమయంలో ఏబీ మళ్లీ జట్టులోకి వస్తానన్న సంకేతాలు ఎప్పుడూ ఇవ్వలేదు. చివర్లో అడిగితే మేం ఏమీ చేయలేకపోయాం. డివిలియర్స్ ప్రపంచంలోనే గొప్ప క్రికెటర్లలో ఒకడు. కానీ మేం విలువలకే కట్టుబడ్డాం" అని జోండి తెలిపాడు.

చాంపియన్

పాపం.. విండీస్! కంగారూలకు చెమటలు పట్టిస్తూ.. ఈ ప్రపంచకప్‌లో తాను గట్టి పోటీదారునేనని చాటుకుంది కానీ ఓ చక్కని అవకాశాన్ని చేజార్చుకుంది. ఎంతో కష్టపడ్డా.. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో అవకాశాలు సృష్టించుకున్నా.. గట్టి పట్టును వదులుకుని విజయాన్ని దూరం చేసుకుంది. కంగారుపడ్డా ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. ఆసక్తికర పోరులో కరీబియన్ జట్టును ఓడించింది. 79కే ఐదు వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను కౌల్టర్‌నైల్, స్మిత్ అద్భుత పోరాటంతో కుప్పకూలే ప్రమాదం నుంచి తప్పిస్తే.. స్టార్క్ సూపర్ బౌలింగ్‌తో విండీస్ పతనాన్ని శాసించాడు. ప్రపంచకప్‌లో ఆసీస్‌కు ఇది రెండో విజయం.

కంగారుపడ్డా కొట్టేసింది

- ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు రెండో విజయం
- మెరిసిన కౌల్టర్‌నైల్, స్మిత్
- పోరాడి ఓడిన వెస్టిండీస్

నాటింగ్‌హామ్

ఆస్ట్రేలియా పడిలేచింది. గురువారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మొదట ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. కాట్రెల్ (2/56), థామస్ (2/63), రసెల్ (2/41) దాటికి ఆరంభంలో దెబ్బతిన్నా.. నాథన్ కౌల్టర్‌నైల్ (92; 60 బంతుల్లో 8×4, 4×6), స్టీవెన్ స్మిత్ (73; 103 బంతుల్లో 7×4)ల పోరాటంతో ఆసీస్ కోలుకుంది. చేదనలో షై హోప్ (68; 105 బంతుల్లో 7×4), హోల్డర్ (51; 57 బంతుల్లో 7×4, 1×6) పోరాడినా విండీస్.. విజయానికి కొద్ది దూరంలో నిలిచిపోయింది. 9 వికెట్లకు 273 పరుగులే చేయగలిగింది. స్టార్క్ (5/46) అద్భుత బౌలింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. కమిన్స్ (2/41) కూడా సత్తా చాటాడు.

పోరాడిన హోప్: లక్ష్యం మరీ పెద్దదేమీ కాకపోయినా ఆరంభంలోనే వెస్టిండీస్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. 31 పరుగులకే ఓపెనర్లు లూయిస్ (1), గేల్ (21) నిష్క్రమించడంతో విండీస్ చిక్కుల్లో పడింది. మరింత ఒత్తిడి పెంచేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలను హోప్ అడ్డుకున్నాడు. పూరన్ (40; 36 బంతుల్లో 5×4, 1×6)తో కలిసి పరిస్థితిని చక్కదిద్దాడు. హోప్ క్రీజులో వట్టుదలతో పాతుకుపోగా.. పూరన్ దాటిగా ఆడాడు. జట్టు స్కోరు 99 వద్ద పూరన్ ఔటైనా హోప్ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. హెట్‌మయర్ (21; 28 బంతుల్లో 3×4)తో కలిసి మరో విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. విండీస్ 149/3తో లక్ష్యం దిశగా సాఫీగా సాగుతున్న దశలో హెట్‌మయర్ రనౌటయ్యాడు. అయినా.. హోప్, హోల్డర్ నిలవడంతో చేదన ఆసక్తికరంగా సాగింది. ఐదో వికెట్‌కు 41 పరుగులు జోడించాక హోప్ ఔటైనా.. రసెల్ (15; 11 బంతుల్లో 2×4, 1×6), హోల్డర్ దాటిగా ఆడడంతో స్కోరు వేగం పెరిగింది. కానీ విండీస్ వడివడిగా లక్ష్యం దిశగా సాగుతున్న దశలో రసెల్ అనవసరంగా ఓ భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. 39వ ఓవర్లో ఆరో వికెట్‌గా అతడు నిష్క్రమించేటప్పటికి స్కోరు 216. బ్రాత్‌వైట్ (16) అండగా హోల్డర్ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించడంతో చేదనలో విండీస్ ముందుకు సాగింది. 45 ఓవర్లలో 251/6తో నిలిచింది. 30 బంతుల్లో 38 పరుగులు చేయాల్సిన స్థితిలో విజయావకాశాలు మెండుగానే ఉన్నాయి. కానీ 46వ ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసిన స్టార్క్.. ఒకే ఓవర్లో బ్రాత్‌వైట్, హోల్డర్‌లను ఔట్ చేసి విండీస్ ఆశలపై నీళ్లు చల్లాడు.

పడి లేచిన ఆస్ట్రేలియా: ఆస్ట్రేలియా ఈ ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటి. కానీ విండీస్‌తో పోరు ఆరంభమే ఆ జట్టుకు పెద్ద షాక్! కరీబియన్ పేసర్ల దాటికి విల విల్లాడిన కంగారూ జట్టు 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కుప్పకూలే ప్రమాదంలో పడింది. కనీసం పోటీలో నిలిచే స్కోరైనా చేయలేదనిపించింది. స్మిత్, కౌల్టర్‌నైల్ అసాధారణ పోరాటంతో మంచి స్కోరుతో ముగించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను విండీస్ ఫాస్ట్ బౌలర్లు షార్ట్ పిచ్ బంతులతో బెంబేలెత్తించారు. తొలి మ్యాచ్‌లో ఆఫ్గాన్‌ను సులువుగా ఓడించిన ఆసీస్.. ఈసారి 38 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకుంది. ఫించ్ (6), వార్నర్ (3), ఖవాజా (13), మ్యాక్స్‌వెల్ (0) పెవిలియన్ చేరారు. తొలి 4 ఓవర్లలో 11 పరుగులే ఇచ్చిన కాట్రెల్ రెండు వికెట్లు పడగొట్టగా.. రసెల్, థామస్ చెరో వికెట్ తీశారు. కాసేపు నిలిచిన స్టాయినిస్ (19) జట్టు స్కోరు 79 వద్ద వెనుదిరిగాడు. ఆ దశలో స్మిత్ అద్భుత పోరాటంతో ఇన్నింగ్స్‌ను నిలబెడితే.. కౌల్టర్‌నైల్ అసాధారణ విధ్వంసంతో ఆసీస్‌కు ఊహించని స్కోరును అందించాడు. వీళ్లిద్దరి 102 పరుగుల భాగస్వామ్యం ఇన్నింగ్స్‌లో అత్యంత కీలకం. ఆరంభంలో అద్భుతంగా బౌలింగ్ చేసిన విండీస్ అనవసరంగా వైడ్లు వేసి ఆసీస్‌పై ఒత్తిడి తగ్గించారు. విండీస్ ఫీల్డర్లు స్మిత్, కౌల్టర్‌నైల్‌ల క్యాచ్‌లు వదిలేయడం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది.

'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'
కౌల్టర్‌నైల్
92

కౌల్టర్ అదరహో

మ్యాచ్‌లు 28.. **పరుగులు** 154 **పరుగులు**.. **సగటు** 12.83.. **అత్యధిక స్కోరు** 34.. ఇలాంటి రికార్డున్న టెయిలెండర్ కలిసొచ్చిన రోజు మహా అయితే అర్ధసెంచరీ చేయగలడేమో! కానీ గురువారం వెస్టిండీస్‌పై ఒక టాప్‌ఆర్డర్ బ్యాట్స్‌మన్ స్థాయిలో సాధికారిక ఇన్నింగ్స్ ఆడి 92 పరుగులు చేశాడు కౌల్టర్‌నైల్. 147/6.. అతను క్రీజులోకి వచ్చేసరికి ఆస్ట్రేలియా పరిస్థితిది. ఈ దశలో కౌల్టర్‌నైల్ స్మిత్‌కు సహకారం ఇవ్వడమే కాదు.. ఒక దశ దాటాక స్మిత్‌ను సహాయ పాత్రకు మారుస్తూ తనే ప్రధాన బ్యాట్స్‌మన్‌లా చెలరేగాడు. అతనేమీ గుడ్డిగా షాట్లు ఆడేయలేదు. 41 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించిన కౌల్టర్‌నైల్.. తర్వాత మరింత దాటిగా ఆడాడు. ఇంకో 2 ఓవర్లుండగా కౌల్టర్‌నైల్ స్కోరు 92కు చేరుకోవడంతో సెంచరీ ఖాయమనిపించింది. కానీ ఔటైపోయాడు. శతకం సాధించకపోయినా.. ప్రపంచకప్‌లో ఓ టెయిలెండర్ ఆడిన గొప్ప ఇన్నింగ్స్‌ల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుంది.

వారెవా ఏమి క్యాచు!

ప్రపంచకప్‌లో మరో అద్భుత ఫీల్డింగ్ విన్యాసం! ఆరంభ మ్యాచ్‌లో బెన్ స్టోక్స్ క్యాచ్ కళ్ల చెదిరిపోయేలా చేస్తే.. గురువారం దానికి ఏమాత్రం తీసిపోని రీతిలో అద్భుత క్యాచ్ అందుకున్నాడు వెస్టిండీస్ బౌలర్ కాట్రెల్. స్టీవ్ స్మిత్ లాంగ్ లెగ్‌లో కొట్టిన బంతి బౌండరీ అవల పడబోతుండగా.. దూరం నుంచి పరుగెత్తుకొచ్చిన కాట్రెల్ ఎడమ చేత్తో దాన్ని ఒడిసిపట్టేశాడు. అతడి విన్యాసం అంతటితో ఆగిపోలేదు. తన అదుగులు బౌండరీ అవతల పడబోతుండగా.. మరుగ్గా స్పందించి బంతిని గాల్లోకి విసిరేశాడు. బౌండరీ వెలుపలికి వెళ్లి, తిరిగి మైదానంలోకి వచ్చి బంతిని అందుకుని అబ్బురపరిచాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

గేల్... 1, 2, 3

అది వెస్టిండీస్ ఇన్నింగ్స్ మూడో ఓవర్. ఐదో బంతి ఫుల్ లెంగ్త్‌లో వేశాడు స్టార్క్. బంతి గేల్ ప్యాడ్‌ను తాకింది. అంపైర్ వెంటనే వేలెత్తేశాడు. గేల్ అంతే వేగంగా సమీక్ష కోరాడు. బంతి స్టంప్‌ను తాకేది కాదని తేలడంతో గేల్ నాటౌట్‌గా మిగిలాడు. ఆ తర్వాతి బంతికే మళ్లీ అంపైర్ అతడిని ఎల్బీగా ప్రకటించాడు. గేల్ సమీక్షకు వెళ్లాడు. ఈసారి బంతి స్టంప్‌లకు మరింత దూరంగా వెళ్లేదని రీప్లేలో తేలింది. స్టార్క్ ఐదో ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చాడు. మళ్లీ బంతి అతడి ప్యాడ్లకు తాకడం, అదే అంపైర్ వేలెత్తడం, గేల్ సమీక్ష కోరడం చకచకా జరిగిపోయాయి. ఎతే ఈసారి గేల్‌కు అదృష్టం కలిసి రాలేదు. లెగ్ స్టంప్ పక్కగా బంతి తాకేదని తేలింది. అంపైర్ నాటౌట్ ఇచ్చి ఆస్ట్రేలియా రివ్యూ కోరితే గేల్ బతికేవాడు. కానీ అంపైర్ ఔటిచ్చాడు. కాబట్టి సమీక్షలో నిర్ణయం 'అంపైర్ కాల్'గా రావడంతో గేల్ వెనుదిరగక తప్పలేదు. కొసమెరుపు ఏంటంటే.. దీనికి ముందు బంతికి స్టార్క్ నోబాల్ వేశాడు. కానీ అంపైర్ గుర్తించలేదు. దాన్ని నోబాల్‌గా ప్రకటించి ఉంటే.. ఫ్రీహిట్ ఆడాల్సింది. ఆ బంతికే గేల్ ఎల్బీగా వెనుదిరిగాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) హెట్‌మయర్ (బి) కాట్రెల్ 3, ఫించ్ (సి) హోప్ (బి) థామస్ 6, ఖవాజా (సి) హోప్ (బి) రసెల్ 13; స్మిత్ (సి) కాట్రెల్ (బి) థామస్ 73, మ్యాక్స్‌వెల్ (సి) హోప్ (బి) కాట్రెల్ 0, స్టాయినిస్ (సి) పూరన్ (బి) హోల్డర్ 19; కేరీ (సి) హోప్ (బి) రసెల్ 45, కౌల్టర్‌నైల్ (సి) హోల్డర్ (బి) బ్రాత్‌వైట్ 92; కమిన్స్ (సి) కాట్రెల్ (బి) బ్రాత్‌వైట్ 2, స్టార్క్ (సి) హోల్డర్ (బి) బ్రాత్‌వైట్ 8; జంపా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 27 **మొత్తం:** (49 ఓవర్లలో ఆలౌట్) **288; వికెట్ల పతనం:** 1-15, 2-26, 3-36, 4-38, 5-79, 6-147, 7-249, 8-268, 9-284; **బౌలింగ్:** ఒషేన్ థామస్ 10-0-63-2; కాట్రెల్ 9-0-56-2, రసెల్ 8-0-41-2; కాట్రెల్ బ్రాత్‌వైట్ 10-0-67-3, హోల్డర్ 7-2-28-1; ఆష్లే నర్స్ 5-0-31-0

వెస్టిండీస్ ఇన్నింగ్స్: గేల్ ఎల్బీ (బి) స్టార్క్ 21; లూయిస్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 1; హోప్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 68; పూరన్ (సి) ఫించ్ (బి) జంపా 40; హెట్‌మయర్ రనౌట్ 21; హోల్డర్ (సి) జంపా (బి) స్టార్క్ 51; రసెల్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టార్క్ 15; బ్రాత్‌వైట్ (సి) ఫించ్ (బి) స్టార్క్ 16; నర్స్ నాటౌట్ 19; కాట్రెల్ (బి) స్టార్క్ 1; థామస్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 20 **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **273; వికెట్ల పతనం:** 1-7, 2-31, 3-99, 4-149, 5-190, 6-216, 7-252, 8-252, 9-256; **బౌలింగ్:** స్టార్క్ 10-1-46-5; కమిన్స్ 10-3-41-2; కౌల్టర్‌నైల్ 10-0-70-0; మ్యాక్స్‌వెల్ 6-1-31-0; జంపా 10-0-58-1; స్టాయినిస్ 4-0-18-0

ధోని గ్లోవ్స్‌పై 'బలిదాన్'

సౌథాంప్టన్: దేశంపై అభిమానాన్ని, సైన్యంపై ఉన్న ప్రేమను ధోని మరోసారి చాటాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో కీపింగ్ చేస్తున్న సమయంలో మహి ధరించిన ఆకుపచ్చ గ్లోవ్స్‌కు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. వాటిపై భారత పారా ప్రత్యేక సైనికదళం అధికార చిహ్నం 'బలిదాన్' గుర్తు ఉండడమే దానికి కారణం. దీంతో అభిమానులు ధోనీని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. అతడికి సైన్యంపై ఎనలేని ప్రేమ ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికే ధోని ప్యారాచూట్ సైనికదళ విభాగంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న సంగతి తెలిసిందే. ఒకవైపు గ్లోవ్స్‌పై ఉన్న గుర్తు గురించి అభిమానులు తెగ పొగిడేస్తుంటే.. బీసీసీ మాత్రం భిన్నంగా స్పందించింది. గ్లోవ్స్‌పై సైనికదళానికి సంబంధించిన గుర్తులు వేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని.. తర్వాతి మ్యాచ్‌లో వాటిని తొలగించాలని బీసీసీఐని ఐసీసీ కోరింది. "అది నిబంధనలకు విరుద్ధం. ఆ గుర్తును తొలగించాలని కోరాం" అని ఐసీసీ ప్రతినిధి క్లెయిర్ తెలిపింది.

ఈ వికెట్ల వెనుక చెస్

సౌథాంప్టన్: ఒకప్పుడు చదరంగం బోర్డుపై ఎత్తులు వేసేవాడు రాహుల్. ప్రపంచ యూత్ చెస్‌లో దేశం తరఫున ఆడాడు కూడా. ఇప్పుడు క్రికెటర్‌గా తాను రాణించడానికి చెస్ వ్యూహాలే కారణమంటున్నాడు ఈ లెగ్ స్పిన్నర్. "ప్రశాంతంగా ఉండడాన్ని, ప్రణాళికలు రచించడాన్ని చెస్ నాకు నేర్పింది. చెస్ ఆడినపుడు ముందుగానే ఓ పదిహేను ఎత్తుల గురించి ఆలోచించాల్సి ఉంటుంది. క్రికెట్లో కూడా అచ్చం అలాగే ఉంటుంది. డుప్లెసిస్ లాంటి ఆటగాణ్ని పెవిలియన్ చేర్చాలంటే గూగ్లీ వేయాలా లేదా ఫ్లిప్పర్‌తో బోల్తా కొట్టించాలా అని ఆలోచిస్తా. ఎలాంటి బంతినైతే బ్యాట్స్‌మన్ ఆడతాడు.. ఎలాంటి బంతులేస్తే పదిలేస్తాడు అని పరిశీలిస్తా. డుప్లెసిస్‌ను ఔట్ చేయడం పట్ల సంతోషంగా ఉన్నా. ఆఫ్ స్టంప్‌కు కొద్ది దూరంలో బంతి వేద్దామని ముందే అనుకున్నా. దాన్ని అతను ఆడలేకపోయాడు" అని తెలిపాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాహుల్ బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉంటాడని కోహ్లి ప్రశంసించాడు.

భారత్ 10 రష్యా 0

ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ టోర్నీ

భువనేశ్వర్: ఒలింపిక్స్ అర్హత టోర్నీ ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ హాకీ టోర్నీలో భారత పురుషుల జట్టు చెలరేగింది. ఫేవరేట్‌గా బరిలో దిగిన భారత్ గురువారం తన తొలి మ్యాచ్‌లో 10-0 తేడాతో రష్యాను చిత్తు చిత్తుగా ఓడించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ (32వ, 48వ నిమిషాల్లో), అక్షదీప్ సింగ్ (41వ, 55వ నిమిషాల్లో) చెరో రెండు గోల్స్‌తో సత్తాచాటారు. నీలకంఠ శర్మ (13వ నిమిషంలో), సిమ్రాన్‌జీత్ సింగ్ (19వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (20వ నిమిషంలో), వరుణ్‌కుమార్ (33వ నిమిషంలో), గుర్జంట్‌జిత్ సింగ్ (38వ నిమిషంలో), వివేక్ సాగర్‌ప్రసాద్ (45వ నిమిషంలో) తలో గోల్ కొట్టాడు. మ్యాచ్ ఆరంభం నుంచి భారత్ దూకుడుగా ఆడింది. ప్రత్యర్థిని గోల్స్‌తో విరుచుకుపడింది. పేలవమైన రష్యా డిఫెన్సును సొమ్ము చేసుకొన్న భారత ఆటగాళ్ల గోళ్ల వర్షం కురిపించారు. ప్రత్యర్థి నుంచి అసలు భారత జట్టుకు ఎలాంటి ప్రతిఘటన ఎదురవలేదు.

సింధు, సాయి నిష్క్రమణ



- ముగిసిన భారత్ పోరాటం
- ఆస్ట్రేలియన్ ఓపెన్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. స్టార్ షట్లర్లు పి.వి.సింధు, సాయిప్రణీత్, సమీర్‌వర్మ ఇంటిముఖం పట్టారు. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మూడో సీడ్ సింధు 19-21, 18-21తో 29వ ర్యాంకర్ జిందాపోల్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. ఈ మ్యాచ్‌కు ముందు వీరిద్దరు ఆరు సార్లు తలపడగా.. 5వ ర్యాంకర్ సింధు ఐదింట్లో గెలవగా, జిందాపోల్ ఒకదాంట్లో నెగ్గింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సమీర్‌వర్మ 16-21, 21-7, 13-21తో వాంగ్ వీ (చైనీస్ తైపీ) చేతిలో, సాయిప్రణీత్ 23-25, 9-21తో ఆంథోని గింటింగ్ (ఇండోనేసియా) చేతిలో, కశ్యప్ 17-21, 22-20, 14-21తో లిన్ డాన్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజు-చిరాగ్‌శెట్టి 19-21, 18-21తో లీ జున్హు- ల్యూ యుచెన్ (చైనా) చేతిలో ఓడారు.

ఛాంపియన్స్

హలెప్

కెరీర్ స్లామ్ సాధించే దిశగా జకోవిచ్ ప్రయాణం నిరాటంకంగా సాగుతోంది. వరుసగా నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన ఈ నంబర్‌వన్ ఆటగాడు ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. మూడో సీడ్ హలెప్.. అన్‌సీడెడ్ అనిసిమోవా చేతిలో చిత్తయింది.

హలెప్‌కు షాక్

అన్‌సీడెడ్ అనిసిమోవా చేతిలో ఓటమి ● సెమీస్‌లో జకోవిచ్

పారిస్

ఫ్రెంచ్ ఓపెన్‌లో నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. ట్రోఫీ లక్ష్యంగా బరిలో దిగిన అతను దాన్ని అందుకోవడానికి రెండు అడుగుల దూరంలో నిలిచాడు. అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ సెమీస్ చేరాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ జకోవిచ్ 7-5, 6-2, 6-2 తేడాతో ఎడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై విజయం సాధించాడు. తొలి సెట్లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదుర్కొన్న జకోవి.. తర్వాతి రెండు సెట్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. ఆటగాళ్లిద్దరూ హోరాహోరీగా తలపడడంతో తొలి సెట్ ఉత్కంఠభరితంగా సాగింది. ఒక్కో గేమ్ కోసం పోటాపోటీ వాతావరణం నెలకొంది. ఐతే చివర్లో 5-5తో స్కోరు సమమైన దశలో వరుసగా రెండు గేమ్‌లు సొంతం చేసుకున్న జకో తొలి సెట్ గెలుచుకున్నాడు. ఇక ఆ తర్వాత అతనికి ఎదురులేకుండా పోయింది. జ్వెరెవ్ కనీసం పోటీ ఇవ్వలేకపోయాడు. వరుస సెట్లలో చిత్తయ్యాడు. మ్యాచ్‌లో ఒక ఏస్ సంధించిన జకో.. ఆరు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. మరో క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రేలియా) 6-2, 6-4, 6-2తో కనవోవ్ (రష్యా)పై నెగ్గి తుది నాలుగు జాబితాలో చోటు దక్కించుకున్నాడు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన థీమ్ వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేశాడు. మూడు ఏస్‌లు కొట్టిన థీమ్.. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు.

కథ ముగిసె: డిఫెండింగ్ ఛాంపియన్ సిమోనా హలెప్ (రొమేనియా) కథ ముగిసింది. మూడో సీడ్ హలెప్‌కు పదిహేడేళ్ల అమెరికా యువ తార అనిసిమోవా షాకిచ్చింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో హలెప్ 2-6, 4-6 తేడాతో అన్‌సీడెడ్ అనిసిమోవా చేతిలో పరాజయం పాలైంది. కీలక సమరంలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన హలెప్ తగిన మూల్యం చెల్లించుకుంది. మరోవైపు అంచనాలకు మించి రాణించిన అనిసిమోవా సగర్వంగా సెమీస్ గడప తొక్కింది. తనకంటే ఎంతో మెరుగైన హలెప్‌ను వరుస సెట్లలో ఓడించింది. నాలుగు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి ముందంజ వేసింది. మరో క్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ బార్టీ (ఆస్ట్రేలియా) 6-3, 7-5తో మాడిసన్ కీస్ (అమెరికా)పై జయకేతనం ఎగురవేసింది. శుక్రవారం సెమీస్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

అనిసిమోవా

సెమీస్‌లో ఎవరితో ఎవరు?

పురుషుల సింగిల్స్	మహిళల సింగిల్స్
జకోవిచ్ × థీమ్	బార్టీ × అనిసిమోవా
ఫెదరర్ × నాదల్	జొహన్న × మార్కెటా

బ్రిస్టల్

పాక్‌ను లంక అడ్డుకునేనా!

● మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియాదే ఎప్పుడూ పైచేయి. ఇప్పటి వరకు ఆరు మ్యాచ్‌లాడగా.. ఆరింట్లోనూ టీమ్‌ఇండియా నెగ్గింది. దాదాపు ఆలస్యంగా రికార్డే శ్రీలంకపై పాక్‌ది. ఇప్పటిదాకా ప్రపంచ కప్‌లో పాక్‌ను శ్రీలంక ఓడించలేదు. ఏడు మ్యాచ్‌లాడగా ఏడింట్లోనూ శ్రీలంకపై పాకిస్థానే పైచేయి. ఇప్పుడు మరో మ్యాచ్‌కు ఇరుజట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం పాక్‌తో శ్రీలంక అమీతుమీ తేల్చుకోనుంది. ఫేవరెట్ ఇంగ్లాండ్‌కు షాకిచ్చిన పాక్ జోరుమీదుంది. మరి ఆ జట్టును శ్రీలంక నిలువరిస్తుందా? ప్రపంచ కప్‌లో పరాజయాల రికార్డుకు అడ్డుకట్ట వేస్తుందా?

కీలక ఆటగాళ్లు

పాకిస్థాన్: బాబర్ ఆజాం, ఇమామ్‌ఉల్ హక్, ఇమాద్ వసీం, మహ్మద్ ఆమిర్

శ్రీలంక: కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, మలింగ, నువాన్ ప్రదీప్

ర్యాంకింగ్: పాకిస్థాన్ (6), శ్రీలంక (9)

153 పాక్, శ్రీలంక ఆడిన వన్డేల సంఖ్య. పాక్ 90 గెలవగా.. శ్రీలంక 58 నెగ్గింది. ఒక మ్యాచ్ టై అవగా.. నాల్గింట్లో ఫలితం తేలలేదు

7 ప్రపంచ కప్‌లో పాక్, శ్రీలంక తలపడిన మ్యాచ్‌లు. అన్నింట్లోనూ పాక్‌దే పైచేయి

వేదిక: బ్రిస్టల్

ఇంకో 20-30 చేయాల్సింది

మొర్తజా

లండన్: తమకు 20-30 పరుగుల తక్కువయ్యాయని న్యూజిలాండ్ చేతిలో ఓటమి అనంతరం బంగ్లా దేశ్ కెప్టెన్ మష్రఫె మొర్తజా అన్నాడు. "పేస్ బాగుంది. మేం 20-30 పరుగులు తక్కువ చేశాం. బ్యాట్స్‌మెన్ నిలదొక్కుకున్నాక ఔట్ కావడం మమ్మల్ని దెబ్బతీసింది. మాకు మరో ఏడు మ్యాచ్‌లు ఉన్నాయి. తర్వాతి మ్యాచ్‌లో పుంజుకుంటామని ఆశిస్తున్నా" అని అతడు చెప్పాడు. బుధవారం రాత్రి ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. 245 పరుగుల లక్ష్యాన్ని కివీస్.. 47.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి చేదించింది. టేలర్ (82) ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతడు విలియమ్సన్ (40)తో మూడో వికెట్‌కు 105 పరుగులు జోడించాడు. జట్టు స్కోరు 191 వద్ద ఆతడు ఔటయ్యాక.. నీషమ్ (25), గ్రాండ్‌హోమ్ (15), శాంట్నర్ (17 నాటౌట్) న్యూజిలాండ్‌ను గట్టెక్కించారు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: 244 (షకిబ్ 64, సైఫుద్దీన్ 29, మిథున్ 26, సౌమ్య సర్కార్ 25, తమీమ్ 24; హెన్రీ 4/47, బౌల్ట్ 2/44)

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: 248/8 (టేలర్ 82, విలియమ్సన్ 40, నీషమ్ 25, గప్‌ల్ 25; మిరాజ్ 2/47, షకిబ్ 2/47, మొసాదెక్ 2/33, సైఫుద్దీన్ 2/41)

బుమ్రాను అడ్డుకోవాలంటే..!

పీటర్సన్

సౌథాంప్టన్: కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ బుమ్రాను ఎదుర్కోవాలంటే ఆఫ్‌సైడ్‌లో ఆడకుండా.. లెగ్‌సైడ్ మాత్రమే పరుగులు రాబట్టే ప్రయత్నం చేయాలంటున్నాడు ఇంగ్లాండ్ మాజీ బ్యాట్స్‌మన్ కెవిన్ పీటర్సన్. "కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ గమనించండి. బుమ్రా బౌలింగ్‌లో ఆఫ్‌స్టంప్ వైపు జరిగి బంతిని స్క్వేర్‌లెగ్ దిశగా ఆడేందుకు ప్రయత్నించాలి. ఆఫ్‌సైడ్‌ను పూర్తిగా వదిలేయాలి" అని పీటర్సన్ సూచించాడు.

వాళ్లను ఊపిరి పీల్చుకోనివ్వలేదు

వీవీఎస్ లక్ష్మణ్

ప్రపంచకప్‌లో భారత్ ఆరంభం బాగుంది. కష్టమైన సౌథాంప్టన్ పిచ్‌పై దక్షిణాఫ్రికాను బుమ్రా బెదరగొట్టాడు. ఆమ్లా, డికాక్‌లను ఔట్ చేసి సఫారీల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీశాడు. చాహల్, కుల్‌దీప్ ఎప్పట్లానే ఆకట్టుకున్నారు. తమ కోటా 20 ఓవర్లలో 5 వికెట్లు తీసి దక్షిణాఫ్రికాకు ఊపిరి పీల్చుకునే వ్యవధి కూడా వీరు ఇవ్వలేదు. టెయిలెండర్లు పోరాడినా.. ఇంకో 30, 40 పరుగులు చేసుంటే సఫారీల పరిస్థితి మెరుగ్గా ఉండేదేమో. గెలవాలంటే దక్షిణాఫ్రికన్లు భారత్‌ను ఆలౌట్ చేయాల్సిన పరిస్థితి.

అందుకు తగ్గట్టే బుమ్రాలానే ఆరంభంలో రబాడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అయితే రోహిత్ విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆరంభంలో ఇబ్బంది పడినా.. ఆ తర్వాతా ఎక్కడా తడబడలేదు. అవసరానికి తగ్గట్టు ఆడాడు. ఈ మ్యాచ్‌లో భారత్‌కు చాలా సానుకూలాంశాలు ఉన్నాయి. రోహిత్, చాహల్, బుమ్రా సత్తా చాటారు. విరాట్, రాహుల్, ధోని, పాండ్యలు కూడా క్రీజులో కొంత సేపు గడిపారు. కఠినమైన తొలి పరీక్షలో భారత్ నెగ్గింది. ఈ విజయం కచ్చితంగా ముమ్ముందు మ్యాచ్‌ల్లో విరాట్ సేనకు ఓ గొప్ప ఔషధంలా పనిచేస్తుందనడంలో సందేహం లేదు.

అలా చేస్తే పాక్‌కే నష్టం!

గ్రేమ్‌స్మిత్

ఫేవరెట్ ఇంగ్లాండ్‌పై గెలుపుతో గొప్పగా పుంజుకున్న పాకిస్థాన్.. శ్రీలంకను ఓడించాలంటే 'అస్థిరత'ను దరిచేరనీయొద్దు. రెండు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో అత్యంత చెత్తగా.. మరోదాంట్లో అత్యుత్తమంగా పాక్ ఆడటం చూశాం. ఇది కొత్తకాదు. నిలకడ విషయంలో ఎన్నో ఏళ్లుగా పాక్ తడబడుతూనే ఉంది. బాబర్ ఆజాం రూపంలో నాణ్యమైన బ్యాట్స్‌మన్ పాక్‌కు దొరికాడు. సాధికారిక ఆటతో నిలకడగా రాణిస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటింగ్ విభాగమంతా సత్తాచాటింది. ఇంగ్లాండ్ గడ్డపై విజయాలు సాధించాలంటే బౌలర్లకు మంచి స్కోర్లు ఇవ్వాల్సిందే. వాహబ్ రియాజ్‌ను తిరిగి రప్పించడం మంచి ఎత్తుగడ. ట్రెంట్ బ్రిడ్జ్‌లో ఆతడు ఎక్కువగా పరుగులిచ్చినా.. జట్టు బాధ్యతను భుజాలపై వేసుకుని కీలకమైన సమయాల్లో ముఖ్యమైన వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ ఆమిర్ మళ్లీ ఫామ్‌ను దొరకబుచ్చుకున్నాడు. శ్రీలంక అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ జట్టును పాక్ తేలిగ్గా తీసుకోవద్దు. శ్రీలంకను తక్కువ అంచనా వేస్తే పాక్‌కే నష్టం.

నాదల్‌కు ఎదురుందా..?

నాదల్

● నేడు సెమీస్‌లో ఫెదరర్‌తో ఢీ ● సాయంత్రం 4.20 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్లో ఇప్పటికే పదకొండుసార్లు ట్రోఫీని ముద్దాడిన నాదల్.. ఆ గ్రాండ్‌స్లామ్‌లో తనకు ఎవరూ పోటీకాదని చాటాడు. మరీ ఈ జోరు ఆగేనా? ఫెదరర్.. నాదల్‌కు ఎదురు నిలిచేనా? ఈ విషయం తేలాలంటే శుక్రవారం వరకు ఆగాల్సిందే. ఈ సారి ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్ చేరిన నాదల్, ఫెదరర్.. ఫైనల్లో స్థానం కోసం తలపడనున్నారు. ఇప్పటి వరకు ఫ్రెంచ్ ఓపెన్‌లో 93 మ్యాచ్‌లాడిన నాదల్ కేవలం రెండిట్లో మాత్రమే పరాజయం పాలయ్యాడు. పైగా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫెదరర్‌తో తలపడిన ఐదుసార్లు నాదలే విజేతగా నిలిచాడు.


ఫెదరర్

ప్రాంగణ ప్రభ..!

- బీటెక్‌లో ఏటేటా పెరుగుతున్న ప్రాంగణ నియామకాలు
- మొత్తం ఎంపికైనవారిలో 20 శాతం తెలుగు విద్యార్థులే
- 2017-18 కంటే 2018-19లో పెరిగిన కొలువులు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్‌లో చేరేవాళ్లు క్రమేణా తగ్గుతున్నా.. ప్రాంగణ నియామకాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. 2012-13 నుంచి దేశవ్యాప్తంగా ఏటా(2017-18లో తప్ప) నియామకాలు అధికమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంగణ కొలువులు ఎక్కువగానే జరుగుతున్నాయి. అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) తాజా గణాంకాలను ఇటీవల వెల్లడించింది. దేశవ్యాప్తంగా గత విద్యాసంవత్సరంలో సుమారు 3.80 లక్షల మంది బీటెక్ విద్యార్థులు కొలువులకు ఎంపికైనట్లు వాటిలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2017-18 విద్యా సంవత్సరంలో 7,29,125 మంది బీటెక్‌లో ఉత్తీర్ణులవగా అందులో 3,43,034 మంది (47 శాతం) కొలువులకు ఎంపికయ్యారు. తెలంగాణలో 56,682 మందిలో 29,128 మంది(51.38 శాతం), ఆంధ్రప్రదేశ్‌లో 73,908 మందిలో 35,607 మంది(48.17 శాతం) మంది ఉద్యోగాలు దక్కించుకున్నారని ఏఐసీటీఈ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

తెలుగు విద్యార్థుల సత్తా..

దేశవ్యాప్తంగా ప్రాంగణ కొలువులకు ఎంపికవుతున్న వారిలో 20 శాతానికిపైగా ఏపీ, తెలంగాణ విద్యార్థులే ఉంటున్నారు. గత విద్యా సంవత్సరం(2018-19)లో 3,79,687 మందిలో రెండు రాష్ట్రాల తెలుగు విద్యార్థులు 76,733 (20 శాతం) మంది ఉన్నారు. దీనికితోడు ఈ రెండు రాష్ట్రాల వారు కనీసం 6 వేల నుంచి 10 వేల మంది వరకు తమిళనాడు, కర్ణాటక, దిల్లీ చుట్టుపక్కల ఉన్న డీమ్డ్, ప్రైవేటు వర్సిటీల్లోనూ చదువుతున్నారు. వారిని కూడా కలుపుకుంటే ఈ శాతం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం(2019-20)లో ప్రాంగణ నియామకాలు ఇంకా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. 'ఆన్‌లైన్ పరీక్షల్లో ఎంపికకాని వారిని టీసీఎస్ తాజాగా ముంబా ముఖీలకు పిలిచింది. అవసరం ఎక్కువగా ఉందని దీన్ని బట్టి తెలుస్తోంది. కొన్ని పరిశ్రమలు వార్షిక వేతనాన్ని(ప్రవేశ దశలో) పెంచుతున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి' అని సన్‌టెక్ కార్ప్ సొల్యూషన్స్ సీఈఓ వెంకట్.కె తెలిపారు. అయితే, ప్రాంగణ నియామకాలకు సంబంధించిన ఈ సమాచారం ఎంత వరకు కచ్చితమన్న దానిపై సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు కళాశాలలు ఆన్‌లైన్ ద్వారా పంపించే సమాచారం ఆధారంగా ఏఐసీటీఈ గణాంకాలను విడుదల చేస్తోందని.. అవి ఎంత వరకు వాస్తవమన్న దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయటం లేదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బీటెక్‌లో చేరారంటేనే.. మీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు ఎలా ఉంటాయి..? వార్షిక ప్యాకేజీ ఎంతుంటుంది..? అనే రెండు ప్రశ్నలు ఎక్కువ మంది నుంచి దూసుకొస్తాయి. ప్రాంగణ కొలువులకు అంత ప్రాధాన్యం ఉంటుంది మరి.

ప్రవేశాలు తగ్గుముఖం..

బీటెక్‌లో ప్రవేశాలు పొందే వారు గత కొద్ది సంవత్సరాలుగా తగ్గిపోతున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా 2014-15 నుంచి 2018-19 వరకు దాదాపు 1.60 లక్షల మంది తగ్గిపోవడం గమనార్హం. అయితే, ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు పెరగడంతో వాటిలో సీట్ల సంఖ్య పెరిగిందని, మరికొందరు విదేశాలకు వెళుతున్నారని చెబుతున్నారు. ఆ మేరకు ప్రవేశాల సంఖ్య తగ్గుతున్నా.. అది స్వల్పంగానే ఉందని ఉన్నతవిద్యామండలి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బీటెక్‌లో ప్రవేశాలు

సంవత్సరం	దేశవ్యాప్తంగా	తెలంగాణ	ఏపీ
2014-15	8,75,234	77,871	87,955
2015-16	7,86,919	74,519	96,721
2016-17	7,85,500	74,366	89,996
2017-18	7,50,320	70,329	90,098
2018-19	7,09,671	69,541	87,836

బీటెక్ కోర్సుల్లో ప్రాంగణ నియామకాలు

సంవత్సరం	దేశవ్యాప్తంగా	తెలంగాణ	ఏపీ
2012-13	2,73,129	24,947	23,742
2013-14	2,95,214	25,399	25,066
2014-15	3,34,503	26,199	30,508
2015-16	3,61,380	26,739	34,128
2016-17	3,63,544	26,175	34,330
2017-18	3,43,034	29,128	35,607
2018-19	3,79,687	32,896	43,837

ఉత్తీర్ణులైన విద్యార్థులు..

సంవత్సరం	దేశవ్యాప్తంగా	తెలంగాణ	ఏపీ
2014-15	7,60,023	67,744	76,527
2015-16	7,86,919	63,358	77,164
2016-17	7,97,373	65,167	73,908
2017-18	7,29,125	56,682	70,264

కన్సల్టెంట్ నియామకానికి లోక్‌పాల్ దరఖాస్తుల ఆహ్వానం

దిల్లీ: అవినీతి నిరోధక సంస్థ లోక్‌పాల్ తన కార్యకలాపాల్లో తోడ్పడేందుకుగాను కన్సల్టెంట్‌ను నియమించుకోనుంది. ఈ మేరకు ఆ పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు గురువారం ఓ అధికారి వెల్లడించారు. లోక్‌పాల్‌లో సిబ్బంది కొరత ఉందని, అవసరమైన మానవ వనరుల ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని పేర్కొన్నారు. డిప్యూటీ కార్యదర్శి/ డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయిలో పదవీ విరమణ పొందిన ఉన్నతాధికారుల నుంచి కన్సల్టెంట్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు.

తొలి సమావేశాల్లో 10 ఆర్డినెన్సులకు చట్ట రూపం!

దిల్లీ: త్వరలో ప్రారంభం కానున్న 17వ లోక్‌సభ తొలి సమావేశాల్లో 10 అత్యవసర ఆదేశాలను చట్టాలుగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం యోచిస్తోంది. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడం సహా పలు అంశాలకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి-మార్చిలో గత ప్రభుత్వం అత్యవసర ఆదేశాలు(ఆర్డినెన్సులు) జారీ చేసింది. లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన 45 రోజుల్లోగా అత్యవసర ఆదేశాలను చట్ట రూపంలోకి తీసుకురావాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అవి మురిగిపోతాయి. ట్రిపుల్ తలాక్ సంబంధిత ఆర్డినెన్సుతోపాటు భారత వైద్యమండలి(సవరణ) ఆర్డినెన్స్, కంపెనీల(సవరణ) ఆర్డినెన్స్, క్రమబద్ధీకరించని డిపాజిట్ పథకాల నిషేధ ఆర్డినెన్స్, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ) ఆర్డినెన్స్, ఆధార్-ఇతర చట్టాల(సవరణ) ఆర్డినెన్స్, దిల్లీ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం ఆర్డినెన్స్, హోమియోపతి కేంద్ర మండలి(సవరణ) ఆర్డినెన్స్, ప్రత్యేక ఆర్థిక మండలి(సవరణ) ఆర్డినెన్స్, కేంద్రీయ విద్యాసంస్థల(టీచర్ల కేడర్‌లో రిజర్వేషన్) ఆర్డినెన్సులను చట్టాలుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

బ్రిటన్‌కు స్టిరాయిడ్ సరఫరా కేసులో... భారత మూలాలున్న వ్యక్తికి శిక్ష!

లండన్: నిషేధిత అనాబోలిక్ స్టిరాయిడ్‌లను భారత్ నుంచి బ్రిటన్‌కు పెద్దమొత్తంలో అక్రమంగా ఎగుమతిచేస్తూ... కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న అంతర్జాతీయ ముఠా పాపం పండింది! ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన భారతీయ మూలాలున్న వ్యక్తిని స్థానిక న్యాయస్థానం దోషిగా తేల్చింది. ముంబయిలో ఉంటున్న డెన్మార్క్ దేశస్థుడు జాకబ్ స్పోరాన్-ఫేల్టర్‌తో గుర్‌జయ్‌పాల్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, కావాల్సిన స్టిరాయిడ్‌లను తరలిస్తున్నట్టు పోలీసులు తేల్చారు.

For a test drive, SMS 'RENAULT' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm). Also available in CSD. Special offers for Defence Personnel, Government, PSU and Corporate employees.

*Terms and conditions apply. #Price mentioned is for KWID and DUSTER base variant for ex-showroom Hyderabad and is exclusive of local taxes. Offers may vary across variants and cities. Benefits are applicable only on select variants of 2019 manufacturing. The abovementioned offers are valid till 30th June, 2019. ^^0% Rate of Interest for KWID is calculated on a loan amount of ₹185 000/- for a tenure of 18 months for 0.8L variants and on a loan amount of ₹ 235 000/- for a tenure of 18 months for 1.0L MT & AMT variants. **Warranty of 4 years include (Manufacturer Warranty of 2 Years or 50 000 km + Extended Warranty of 2 Years or 50 000 km). Additional offers available on select stocks only. ^0 % Rate of Interest for DUSTER is calculated on a loan amount of ₹ 727 000/- for a period of 18 months. Rate of interest may vary based on loan amount and tenure. Finance at sole discretion of Renault Finance. ^^^Insurance at ₹1/- through Renault dealership. Offers mentioned are for Diesel versions only. ##Paytm offer available on Renault KWID & DUSTER models across all authorised dealerships of Renault India Pvt. Ltd. For detailed offers, visit www.renault.co.in/offers. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned schemes and conditions without prior notice.

SHOWROOMS: TELANGANA: KARIMNAGAR: RENAULT Karimnagar Mob: +91 9582305983. **MAHBUBNAGAR**: RENAULT Mahbubnagar Mob: +91 7799766431. **NIZAMABAD**: RENAULT Nizamabad Mob: +91 7799739175. **NIRMAL**: RENAULT Nirmal Mob: +91 8527232744. **KHAMMAM**: RENAULT Khammam Mob: +91 8527234093. **SIDDIPET**: RENAULT Siddipet Mob: +91 8527235114. **MANCHERIAL**: RENAULT Mancherial Mob: +91 9582571953. **WARANGAL**: RENAULT Warangal Mob: +91 9582230038.

SAATCHI & SAATCHI

ఏపీలో రైతుకు భరోసా

- అక్టోబరు 15 నుంచి కొత్త పథకం
- ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.12,500

ఈనాడు, అమరావతి: ఏపీలో అక్టోబరు 15 నుంచి 'రైతు భరోసా' పథకానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ పథకం కింద పెట్టుబడి సాయంగా ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.12,500 చొప్పున అందించనుంది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏటా రూ.13,125 కోట్లు నేరుగా రైతులకు దక్కనుంది. ఇందులో కౌలు రైతులకు రూ.2,500 కోట్లు అందనుంది. నవరత్నాల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచి 'రైతు భరోసా' అందుబాటులోకి తెస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన.. తొలి ఏడాది నుంచే అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారు. రబీ నుంచే రైతులకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదవశాత్తు చనిపోయిన, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు వైఎస్సార్ బీమా కింద రూ. 7 లక్షల సాయం అందించనున్నట్లు చెప్పారు. సహకార డెయిరీలకు పాలు పోసే ప్రతి రైతుకు లీటరుకు రూ.4 చొప్పున బోనస్ చెల్లించాలని ఆదేశించారు. 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. కర్నూలులో నిర్మిస్తున్న మెగా సీడ్ పార్కు కార్యకలాపాలను ప్రస్తుతానికి నిలిపేసి.. మరింత మెరుగైన ఆలోచనలతో రావాలని స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. వివిధ పథకాలపై నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంటలకు మద్దతు ధర అందించేందుకు రూ.3 వేల కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను సమీక్షించాలని ముఖ్య సలహాదారు ఆజేయ కల్లంకు సీఎం సూచించారు. పలు పథకాలకు కేటాయించిన నిధులను మళ్లించడంపైనా దృష్టి పెట్టాలన్నారు. తమ ప్రభుత్వ విధానాలన్నీ పారదర్శకంగా ఉంటాయని, అవినీతి ఎక్కడ జరిగినా క్షమించలేని చర్యలుంటాయని హెచ్చరించారు. 'ఉత్తమ సలహాలిస్తే సంతోషిస్తా.. అలాంటి వారికి సన్మానం చేస్తా' అన్నారు.

హెచ్‌సీయూలో ఈ-లెర్నింగ్ సెంటర్ రూపొందించిన 'డిజిటల్ వెల్‌నెస్' వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గౌరవ వేతనాలకు మరో రూ.23 కోట్లు

- 'స్థానిక' ప్రజా ప్రతినిధుల సంఖ్య పెరుగుదలతో ఇక ఏటా రూ.125 కోట్ల వ్యయం
- జడ్పీ ఛైర్మన్‌కు ఇప్పటి మాదిరిగానే రూ.లక్ష వేతనం
- వేతనాల పెంపు ప్రతిపాదన ప్రస్తుతానికి లేనట్లే!

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీరాజ్ సంస్థల్లోని ఎంపీటీసీ సభ్యులు మినహా మిగతా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగటంతో వారికి గౌరవ వేతనాల రూపేణా బడ్జెట్ కేటాయింపునూ ప్రభుత్వం పెంచాల్సిన అవసరం ఏర్పడింది. గ్రామ సర్పంచి మొదలుకొని జడ్పీ ఛైర్మన్ వరకు గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం ఇంతకు ముందు ఏటా రూ. 102 కోట్లను ఇస్తుండగా.. ఇక నుంచి రూ.125 కోట్లకు పెరగనుంది. మరో వైపు.. 2015 నుంచి ఇస్తున్న గౌరవ వేతనాలను ఇప్పట్లో పెంచే ప్రతిపాదనలు ఏమీ లేవని సమాచారం.

క్షేత్ర స్థాయిలోని ప్రజా ప్రతినిధులు కీలక భూమిక వహించగలిగితే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామీణ ప్రజానీకం ముంగిటకు తీసుకెళ్లేందుకు పుష్కలంగా అవకాశాలు ఉంటాయి. వీరిని ఈ క్రతువులో మమేకం చేయాలనే సంకల్పంతోనే వీరిలో పంచాయతీ వార్డు సభ్యులు తప్ప మిగతా వారికి గౌరవ వేతనాలను ఇచ్చే విధానం చాలా కాలంగా అమల్లో ఉంది. తెలంగాణ ప్రభుత్వం 2015లో వారి గౌరవ వేతనాలను బాగా పెంచింది. ఇలా మంచి వేతనాలు ఇవ్వటంతో ఆయా స్థానిక సంస్థల్లో ఆర్థిక వనరులనూ మెరుగుపర్చేందుకు వారు నడుంకడతారని సర్కారు భావించింది. దీంతో అంతవరకు నామమాత్రంగా ఉన్న వేతనాల బడ్జెట్ కేటాయింపు 2015 నుంచి రూ.102 కోట్లకు చేరింది. ప్రభుత్వం ఇటీవల పంచాయతీల సంఖ్యను 8,684 నుంచి 12,751కు పెంచటంతో 2019 జనవరి నుంచి సర్పంచుల గౌరవ వేతనాల ఖర్చు పెరిగింది. జడ్పీ ఛైర్మన్లు, జడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షుల సంఖ్య కూడా పెరగనుండటంతో వారందరిపై చేయాల్సిన ఖర్చూ ఎగబాకనుంది. ఎంపీటీసీల ఫునర్‌వ్యవస్థీకరణలో భాగంగా వాటి సంఖ్య 584 తగ్గటంతో ఆ మేరకు ఎంపీటీసీ సభ్యుల ఖర్చు ఏడాదికి రూ.3 కోట్లమేర తగ్గుతుంది. అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులకు కలిపి ఇక ఏటా రూ. 125 కోట్లమేర బడ్జెట్‌ను ప్రభుత్వం వినియోగించనుంది. ప్రజా ప్రతినిధుల గౌరవాన్ని మెరుగుపర్చటం ద్వారా క్షేత్ర స్థాయిలో వారి సేవలను మరింతగా వినియోగించుకోవాలనే లక్ష్యమే అప్పట్లో వేతనాల పెంపునకు ప్రధాన కారణమని పంచాయతీరాజ్ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవవేతనాలను ఇంకా పెంచాలనే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతానికి లేదని ఆయన తెలిపారు. జడ్పీ ఛైర్మన్‌కు ప్రస్తుతం నెలకు రూ. లక్ష వేతనం వస్తుండగా.. ఇక ముందూ అంతే మొత్తం అందనుంది.





పంచాయతీరాజ్ సంస్థల్లోని ప్రజా ప్రతినిధుల సంఖ్య పెరుగుదల ఇలా..

ప్రజాప్రతినిధి	2018 వరకు	ఇక ముందు
జడ్పీ ఛైర్మన్	9	32
జడ్పీటీసీ సభ్యులు	438	538
మండల పరిషత్ అధ్యక్షులు	438	538
ఎంపీటీసీ సభ్యులు	6,441	5,857
పంచాయతీ సర్పంచులు	8,684	12,751

ప్రతినెలా ఇవ్వాలి

గౌరవ వేతనాలను ఏ నెలకు ఆ నెల ఇవ్వటం లేదు. పంచాయతీరాజ్ సంస్థలకు నిధులను ఇవ్వాలని అడగటంతో పాటు ప్రజా ప్రతినిధులకు నెలల తరబడి పేరుకుపోతున్న వేతనాలను విడుదల చేయాలంటూ విజ్ఞప్తులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇకనైనా ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేయాలి

-మనోహర్ రెడ్డి, అధ్యక్షులు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం

సాంకేతికతతో సమయం ఆదా

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా విలువైన సమయం ఆదా అవుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఈ-లెర్నింగ్ సెంటర్ రూపొందించిన 'డిజిటల్ వెల్‌నెస్' వెబ్‌సైట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. స్వాతంత్ర్యం వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ సమాజంలో పేదరికం, అసమానతలు, అత్యాచారాలు వంటి సాంఘిక దురాచారాలు సవాళ్లు విసురుతున్నాయన్నారు. ఎన్నో సంక్లిష్ట సమస్యలకు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ పరిష్కారంగా నిలుస్తుందని వివరించారు. నైపుణ్యాల కొరత ఉన్నా.. వాటిని గుర్తించడం, వాటికి సానపెట్టడం అవసరమన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను స్వాగతించాలన్నారు. గ్రామీణ విద్యార్థులకు చేరువయ్యేందుకు ఆన్‌లైన్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఆన్‌లైన్ కోర్సులు గ్రామీణులకు చేరువయ్యేందుకు విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని సూచించారు. హెచ్‌సీయూ చేపడుతున్న పలు కార్యక్రమాలను ఈ-లెర్నింగ్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య జె.ప్రభాకర్‌రావు.. ఉపరాష్ట్రపతికి వివరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, హెచ్‌సీయూ ఉపకులపతి ఆచార్య పి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పసిడి పతకాలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎంసెట్, సీట్, ఐ.ఐ.టి లేదా జె.ఇ.ఇ (అడ్వాన్స్‌డ్) ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులను బంగారు పతకాలతో సత్కరించనున్నట్లు ఆచేపా బ్యాంక్‌మెన్ హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019వ సంవత్సర ఫలితాల్లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారిని కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఈనెల 23న ఉదయం 10గంటలకు సన్మానిస్తారు. అర్హులైన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇంజినీరింగ్, వైద్య విభాగ విద్యార్థులు తమ పూర్తిపేరు, చిరునామా, మొబైల్ నంబరు, హాల్‌టికెట్ నంబరు, ర్యాంకు, మార్కుల నకలు తదితర వివరాలను జూన్ 15లోగా... డోర్ నం. 2-2-16 బి అండ్ సి (403) అర్మాన్ టవర్స్, వీధి నం.1, డి.డి.కాలనీ, హైదరాబాద్ చిరునామాకు పోస్టులో లేదా స్వయంగానైనా చేర్చవచ్చని సంస్థ అధ్యక్షుడు పి.వి.రమణయ్య వివరించారు. వివరాలకు ప్రాజెక్టు కన్వీనరు కొత్త రామానందను 92905 29133, 040-27422013 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆ ముగ్గురు సీఎంలతోనూ మాట్లాడుతున్నా

'ఆయుష్మాన్ భారత్' అమలుపై కేంద్ర మంత్రి హర్షవర్ధన్

ఈనాడు, దిల్లీ: కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై)లో చేరే అంశంపై దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తోపాటు తెలంగాణ సీఎం కేసీఆర్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌లతోనూ మాట్లాడుతున్నానని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. పథకం అమలుపై గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి మొత్తంమీద 32 ప్రభుత్వాలు జాతీయ ఆరోగ్య అథారిటీతో ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. కొత్తగా 4 ప్రభుత్వాలనూ ఇందులో చేర్చడానికి కృషిచేస్తున్నానని, ఈ దిశగా చర్చలు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పథకాన్ని 4 రాష్ట్రాల్లోనూ అమలు చేసి పేదలకు లబ్ధి చేకూర్చాలంటూ ఆయా ముఖ్యమంత్రులకు లేఖల ద్వారా విజ్ఞప్తి చేశానన్నారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు నేడు విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టికెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. సెప్టెంబరు మాసానికి సంబంధించి వివిధ ఆర్జిత సేవా టికెట్లను www.tirumala.org వెబ్‌సైట్‌లో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంచనుంది. శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం టికెట్లను డిప్ విధానంలో భక్తులను ఎంపిక చేసి కేటాయించనుంది. విశేష పూజ, కల్యాణోత్సవం, డోలోత్సవం, అర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను కరెంటు బుకింగ్ కింద వెంటనే బుక్ చేసుకోవచ్చు.

భద్రాచలం అడవుల్లో 'రాకాసి బండ'!

గొందిగూడెం సమీప అడవిలో వెలుగు చూసిన అలనాటి సమాధి బండ ఇదే..

ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని గొందిగూడేనికి 10 కిలోమీటర్ల దూరంలో.. అటవీ ప్రాంతం వద్ద పలు ఏళ్లనాటి సమాధి బండను తెలంగాణ జాగృతి చరిత్ర పరిశోధకుల' బృందం గుర్తించింది. అలనాడు రాతిపలకలతో ఏర్పాటుచేసుకున్న సమాధుల్లో ఇది ఒకటని, చారిత్రక ప్రాధాన్యమున్న దీన్ని 'రాకాసి బండ'గా భావించేవారని, ఇంత భారీగా కనిపించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. మృతదేహాల పైభాగంలో నిర్మించే సమాధులను ఇటువంటి వాటితో కప్పి ఉంచేవారని అన్వేషకుల బృంద సభ్యులు జగన్మోహన్‌రావు, నారాయణ, రామారావు, శేషు వెల్లడించారు. సమాధి లోపలి దేహం నుంచి ఆత్మ బయటకు వెళ్లరాదన్న భావనతో.. పైకప్పుగా.. ఈ ప్రాంతంలో ఈ బరువైన బండను ఉంచారేమోనని మరో సభ్యుడు కొండపోటి గోపీవరప్రసాదరావు అభిప్రాయపడ్డారు. పురావస్తుశాఖ స్పందించి మరిన్ని తవ్వకాలు జరిపితే ఇంకెన్నో చారిత్రక అంశాలు వెల్లడవుతాయని బృందం ముఖ్య ప్రతినిధి హరగోపాల్ పేర్కొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

రయ్ రయ్

autopage@eenadu.in
మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512

ప్రమాదంలో సాక్షిలా ఉపయోగపడుతుంది...
నిబంధనల ఉల్లంఘనుల్ని నిలువరిస్తుంది...
బీమా వాదనలో మన తరపున వకాల్తా పుచ్చుకుంటుంది...
కారులో డాష్‌కామ్ బిగిస్తే కలిగే సౌలభ్యాలెన్నో...
ఖరీదు తక్కువ.. వాడటం తేలిక...
ప్రతి వాహనంలో తప్పనిసరి గ్యాడ్జెట్‌లా మారిపోతున్న
ఈ డాష్‌బోర్డ్ కెమెరా ఉపయోగాలు, వాడే విధానం, జాగ్రత్తలు..
వివరంగా తెలుసుకుందాం.

బండిలో.. బ్రహ్మాస్త్రం

తేలిగ్గా చెప్పాలంటే డాష్‌బోర్డ్ మీద బిగించే కెమెరానే డాష్‌కామ్. దీన్ని రేయర్‌వ్యూ మిర్రర్‌కి ముందూ అతికించుకోవచ్చు. ప్రయాణంలో విండ్‌షీల్డ్‌కి ఆవలివైపు రోడ్డుపై జరిగే ప్రతి దృశ్యాన్నీ రికార్డు చేస్తుంది. దీని తీగను యూఎస్‌బీ లేదా సిగరెట్ లైటర్ పోర్ట్ ద్వారా అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత కారు ఇంజిన్ ఆన్ చేయగానే ఆటోమేటిగ్గా పని ప్రారంభిస్తుంది. ఏవైనా అల్లర్లు, ప్రమాదాలు జరిగినపుడు నిందితుల్ని గుర్తించే ఉద్దేశంతో అమెరికా పోలీసులు తమ వాహనాల్లో మొదటిసారి ఈ డాష్‌కామ్‌లు ఉపయోగించారు. తర్వాత వ్యక్తిగత వాహనాల్లోనూ వాడకం మొదలైంది. బేసిక్ నుంచి హై-ఎండ్ కారు వరకు ఎందులో అయినా దీన్ని అమర్చుకోవచ్చు. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూలాంటి కొన్ని ఖరీదైన కార్లలో ఇన్‌బిల్ట్‌గా వస్తున్నాయివి.

ఉపయోగాలెన్నో

డాష్‌కామ్ ఖరీదు తక్కువ. ఉపయోగాలెక్కువ. అవేంటో వివరంగా..

- **ప్రమాదాల్లో సాక్షిగా:** ఆపదల్లో ఆదుకుంటుందనే కారణంతో ఎక్కువమంది ప్రస్తుతం డాష్‌బోర్డ్ కెమెరా వాడకానికి మొగ్గు చూపుతున్నారు. దురదృష్టవశాత్తు మన వాహనం ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే చట్టపరమైన ఇబ్బందుల్లో పడకుండా ఇది సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రమాదం ఎక్కడ, ఏ సమయంలో జరిగింది? కారణమేంటి? కచ్చితంగా తెలుసుకోవచ్చు. కొన్ని సమయాల్లో కొందరు రాంగ్‌రూట్‌లో వచ్చి మన కారు డీకొడుతుంటారు. తప్పు వారిదైనా అడ్డగోలుగా వాదించి పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తారు. అలాంటపుడు మనల్ని రక్షించేది ఇదే. దీంతో డబ్బు, సమయం ఆదా అవుతాయి.
- **ఉల్లంఘనులకు పాఠం:** మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఎదుటివారు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు తప్పవు. నిబంధనలు ఉల్లంఘించేవారు, తాగి నడిపేవారు, రాష్ డ్రైవింగ్ చేసేవారు.. ఇలాంటివారితో సాటి వాహనదారులు, పాదచారులకు ఎల్లప్పుడూ ప్రమాదమే. వారిని అడ్డుకోవడానికి పోలీసులే అక్కర్లేదు. ప్రతిక్షణాన్ని బంధించే డాష్‌కామ్‌లు వారిని ఓ చూపు చూసి చట్టానికి పట్టిస్తాయి.
- **బెంగ వద్దు:** మైనర్లు ఇంట్లో చెప్పకుండా కారు తీసుకొని బలాదూర్లు తిరుగుతుంటారు. డ్రైవర్లను నియమించుకుంటే సొంత అవసరాలకు వాడుకుంటుంటారు. స్నేహితులు, బంధువులకు కారిస్తే ఎక్కడెక్కడ తిరుగుతున్నారో అనే బెంగ. ఇలాంటి సందర్భాల్లో కాపలాదారుగా పని చేస్తుంది డాష్‌కామ్. చాలా డాష్‌కెమెరాలు జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ఏయే మార్గాల్లో ప్రయాణించింది, ఎంత వేగంతో వెళ్లింది తెలుసుకోవచ్చు. అప్రమత్తంగా ఉండి మరోసారి అలా జరగకుండా చూసుకోవచ్చు.
- **బీమాకి ధీమా:** వాహనం ఏదైనా ప్రమాదంలో దెబ్బతిన్నపుడు నష్టపరిహారం ఇవ్వడానికి బీమా కంపెనీలు కొన్నిసార్లు రకరకాల కొర్రీలు పెడుతుంటాయి. మనమే కావాలని చేసిన ప్రమాదంలా ఉందని వాదిస్తుంటాయి. అలాంటి సమయంలో మనకు అండగా నిలబడేవి ఇవే. నకిలీ ప్రమాదాలతో నష్టపరిహారం పొందాలని చూసేవారికి సైతం ఈ డాష్‌కామ్‌లు చెక్ పెడతాయి.
- **యూట్యూబ్‌లో పాపులర్:** దూరప్రయాణాలు, సాహసయాత్రల్లో ప్రతి క్షణం, ప్రతి మలుపూ ఓ మధుర జ్ఞాపకమే. అప్పుడప్పుడు అరుదైన సంఘటనల్ని ఒడిసిపట్టుకోవచ్చు. కాస్త ఓపిక, సృజనాత్మకత ఉంటే వీడియోల్ని ఎడిటింగ్ చేసి, గ్రాఫిక్‌లు జోడించి మంచి ట్రావెలాగ్‌లుగా రూపొందించి యూట్యూబ్‌లో పెట్టేయొచ్చు. క్లిక్ అయితే అది కాసులు కురిపించే వ్యాపకంగానూ పనికొస్తుంది. ఇక మన డాష్‌కామ్ ఎళ్ల కిందట రికార్డు చేసిన వీడియోలను అప్పుడప్పుడు బయటికి తీసి చూసుకుంటే అదో తీపి జ్ఞాపకంగానూ మిగిలిపోతుంటుంది.

ఇవీ జాగ్రత్తలు

డాష్‌కామ్‌తో ఎన్ని ప్రయోజనాలున్నా వాడకంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే అత్యుత్తమ ఫలితాలుంటాయి.

- డాష్‌బోర్డ్‌పైన బిగించే బడులు రేయర్ వ్యూ మిర్రర్‌కి ముందు అతికిస్తేనే డాష్‌కామ్ పనితీరు బాగుంటుంది. రోడ్డుపై అత్యధిక భాగం కవర్ చేయగలుగుతుంది. విండ్‌షీల్డ్ వైపర్లు పని చేస్తున్నపుడు కెమెరాకు అడ్డం రాకుండా చూసుకోవాలి.
- రాత్రివేళలు, వర్షం పడుతున్నపుడు, పొగమంచు కురుస్తున్నపుడూ రికార్డింగ్ నాణ్యత బాగుండాలంటే హెచ్‌డీ రికార్డింగ్ సామర్థ్యం ఉన్నవాటినే కొనుగోలు చేయాలి.
- జీపీఎస్, వై-ఫై సామర్థ్యం ఉన్న కెమెరాలతో వీడియోని క్షణాల్లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి, ఇతరులకు పంపడానికి, మెమొరీని తేలిగ్గా కాపీ చేయడానికి వీలుంటుంది. రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే డాష్‌కామ్‌లూ అందుబాటులో ఉన్నాయి. వీలైతే వాటినే ఎంచుకోవాలి.
- విండ్‌షీల్డ్‌కి అవతలివైపు రోడ్డుపై జరిగే దృశ్యాలను రికార్డు చేసే వాటితోపాటు తమధ్యకాలంలో కారు లోపలివైపు కూడా రికార్డు చేయగలిగే కామ్‌కార్డర్లు వచ్చేశాయి.
- ఇన్ 10 మెమొరీ కార్డులతో రికార్డింగ్ దృశ్యాలు స్పష్టంగా ఉంటాయి. సాంకేతిక ఇబ్బందులు తలెత్తవు. అంతకులోపువి అయితే ఫైల్ ఎర్రర్‌లు, వైరస్ వచ్చే ప్రమాదం ఉంది. దీంతోపాటు ఎక్కువ రికార్డింగ్ నిడివి సామర్థ్యం ఉండే 32, 64జీబీ మెమొరీ కార్డులనే వాడితే మేలు.
- దూరప్రయాణాల్లో అదనంగా ఒకట్రెండు మెమొరీ కార్డులు వెంట ఉంచుకోవాలి. ప్రయాణంలో ఏవైనా ముఖ్యమైన సంఘటనలు రికార్డు అయితే వై-ఫై ద్వారా వెంటనే వాటిని సేవ్ చేసుకోవాలి. అవసరం లేనివి డిలీట్ చేస్తుండాలి.

అమ్మకాల్లో మేటి

పనితీరు, సామర్థ్యం, నాణ్యత ఆధారంగా డాష్‌కామ్‌లు రూ.2 వేల నుంచి రూ.20 వేలల్లో లభిస్తున్నాయి. ఆటోమొబైల్ ఉత్పత్తుల దుకాణాల్లోనే కాదు.. ఆన్‌లైన్‌లోనూ వీటిని కొనుక్కోవచ్చు. ప్రస్తుతం అత్యధికంగా అమ్ముడవుతున్న కొన్ని మోడళ్లు. వాటి ప్రత్యేకతలు.

- **ప్రోస్ కాన్యాయ్:** లోపల, బయట రెండువైపులా రికార్డు చేస్తుంది. జీపీఎస్, వై-ఫైతో అనుసంధానం చేయొచ్చు. 32జీబీ స్టోరేజ్ సామర్థ్యం ఉంది. **ధర:** రూ.3,699
- **ట్రాన్సెండ్ డ్రైవర్ ప్రో 200:** ఏడు లేయర్ల లెన్స్‌తో పని చేస్తుంది. పొగమంచు, మసక దృశ్యాలు తొలగించి స్పష్టంగా రికార్డు చేస్తుంది. ఎల్‌సీడీ తెర, రెండువైపులా రికార్డింగ్, వై-ఫై కనెక్టివిటీ కొన్ని ప్రత్యేకతలు. **ధర:** రూ.14,079
- **ఎస్‌జేకామ్ ఎస్‌జే4000:** సాహసయాత్రలు చేసే వారి కోసం ప్రత్యేకంగా రూపొందించారు. మోటార్‌సైకిళ్లకూ పని చేస్తుంది. ముప్పై మీటర్ల లోతు నీటిలో రికార్డింగ్ చేసినా చెడిపోదు. 32జీబీ సామర్థ్యం, లూప్ రికార్డింగ్.. ఉన్నాయి. **ధర:** రూ.4,795
- **గార్మిన్ జీడీఆర్ సీ300:** 1440పీ అత్యధిక రిజల్యూషన్‌తో వీడియోలు రికార్డు చేస్తుంది. జీపీఎస్, వాయిస్ కంట్రోల్, అత్యధిక వైడ్ యాంగిల్ రికార్డింగ్ ప్రత్యేకతలు. 3.0ఎల్‌సీడీ డిస్‌ప్లే, తక్కువ వెలుతురులోనూ నాణ్యమైన రికార్డింగ్. వీడియోల్ని చిత్రాలు తీసుకునే స్నాప్‌షాట్ సౌలభ్యం ఉంది. **ధర:** రూ.8,400
- **డ్రమ్‌స్టోన్ మినీ:** 2.4 అంగుళాల తెర, 200 గ్రాముల బరువుండే అతిచిన్న కెమెరా ఇది. కారు లోపల, బయట రికార్డ్ చేయొచ్చు. విండ్‌షీల్డ్, డాష్‌బోర్డ్ ఎక్కడైనా బిగించుకోవచ్చు. **ధర:** రూ.5వేలు
- **లాంబెంట్ మినీ:** తక్కువ ధరలో ఎక్కువ ఫీచర్లతో వచ్చిన కెమెరా. బరువు తక్కువ. యాంటీ షేక్ ఇమేజ్, 2.4 అంగుళాల టీఎఫ్‌టీ తెర.. ప్రత్యేకతలు **ధర:** రూ.1199
- **అల్రియా బ్యాకప్:** మిగతా వాటికి భిన్నంగా 4.3అంగుళాల వెడల్పాటి టీఎఫ్‌టీ తెరతో వస్తుంది. జీ-సెన్సర్, ఇన్‌బిల్ట్ మైక్రోఫోన్, ఫ్లేబ్యాక్ ఆప్షన్, 165డిగ్రీల కోణం, తక్కువ వెలుతురులోనూ రికార్డింగ్ సామర్థ్యం, 350ఎంఎహెచ్ లిథియం-అయాన్ బ్యాటరీ..ప్రత్యేకతలు **ధర:** రూ.8,999

మూడు రంగుల్లో ఎంటీ 15

పరిచయం

మార్కెట్లోకి వచ్చిన తక్కువ సమయంలోనే మంచి ఆదరణ పొందిన మోటార్‌సైకిల్ యమహా ఎంటీ 15. 150సీసీ నేక్డ్ స్పోర్ట్స్ విభాగంలో వచ్చిన ఈ బండి మరింత జోరు కొనసాగించడానికి, వినియోగదార్ల మనసు దోచుకోవడానికి మరో మూడు కొత్త రంగుల్లో వచ్చేస్తోంది. అంతకుముందు మ్యాట్ బ్లూ, మ్యాట్ బ్లాక్ రంగుల్లో మాత్రమే లభించేది. ఇప్పుడు వాటికి అదనంగా గ్లాసీ ఫినిష్‌తో కూడిన రెడ్, వైట్, బ్లూ రంగుల్లో కూడా దొరుకుతోంది. బైక్ బాగున్నా రంగులు పరిమితమే అనుకునే ఔత్సాహికులకు ఇప్పుడు మరిన్ని ఆప్షన్స్ వచ్చేశాయి.

నా ఎత్తుకు తగ్గ బైకేది?

? కొత్త కారు బుక్ చేశాను. కొద్దిరోజుల్లో ఇంటికి రాబోతోంది. వచ్చేముందు ఏమేం చెక్ చేసుకోవాలి? భవిష్యత్తులో ప్రయాణం సాఫీగా సాగాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? కొత్త వాహనం నుంచి వెలువడే వాసన భరించలేను. పరిష్కారమేంటి?

- డి.కిరణ్‌కుమార్, ఈమెయిల్

కోరుకున్న వాహనం ఇంటికొస్తున్న సమయం ఎవరికైనా ఓ మధుర జ్ఞాపకమే. ఈ సంతోషం జీవితాంతం ఉండాలన్నా, మన ప్రయాణం సాఫీగా సాగాలన్నా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ముందు కారు మీద ఏవైనా గీతలు, సొట్టలు పడ్డాయేమో చెక్ చేసుకోండి. అన్ని లైట్లు సరిగా పని చేస్తున్నాయా, లేదా పరిశీలించండి. టైర్ల మందం, తయారీదారుడి వివరాలు సరిగా ఉన్నాయో, లేదో పాం 22లో చూడాలి. కొత్త బండి స్టార్ట్ చేస్తున్నపుడు ఎలాంటి పొగ వెలువడకూడదు. ఏసీ వెంట్ల నుంచి దుర్వాసన రాకుండా చల్లని గాలి రావాలి. ఇవన్నీ సరిగ్గా ఉన్నపుడే బండి డెలివరీ తీసుకోవాలి. ప్లాస్టిక్, కెమికల్స్ కారణంగా కారు లోపల సహజంగానే ఓ రకమైన వాసన వెలువడుతుంది. దీన్ని తగ్గించడానికి కొన్నాళ్లు ఫ్రెష్ ఎయిర్ మోడ్‌లోనే బండి నడపాలి. హైవేల్లో వెళ్తున్నపుడు అద్దాలన్నీ కిందికి దించేయాలి. ట్రాఫిక్‌లో ఇలా చేయొద్దు. సీట్ల కింద కొన్ని బొగ్గుముక్కలు పెడితే ఇవి చెడు వాసనల్ని పీల్చుకుంటాయి. అన్నింటికన్నా తేలికైన పరిష్కారం మార్కెట్లో రకరకాల ఎయిర్ ఫ్రెష్‌నర్లు దొరుకుతున్నాయి. వాటిని వాడితే చాలు.

మెకానిక్ గురూ

? నా ఎత్తు 5.3 అంగుళాలు. లాంగ్‌డ్రైవ్‌లంటే ఇష్టం. హోండా సీబీ యూనికార్న్, సీబీ ష్లైన్, బజాజ్ పల్సర్ 150 వీటిలో నాకు ఏది సరిపోతుంది?

- ఎం.కిరణ్‌కుమార్, ఈమెయిల్

మైలేజీ, సౌకర్యం, వేగం, నమ్మకం.. లాంగ్‌టూర్లకు వెళ్లేవాళ్లు ఇవన్నీ చూసి బండి ఎంచుకోవాలి. హోండా కంపెనీ మంచి మైలేజీకి, నమ్మకమైన టెక్నాలజీకి పెట్టింది పేరు. పల్సర్ సిరీస్ బైక్‌లు పవర్‌ఫుల్ ప్యాకేజీతో అందుబాటులో ఉన్నాయి. హోండా యూనికార్న్, సీబీ ష్లైన్ కాకుండా యమహా ఎఫ్‌జెడ్, హోండా ఎక్స్ బ్లేడ్, బజాజ్ వీ15లను కూడా మీరు పరిశీలించవచ్చు. స్పీడ్‌కన్నా మైలేజీ ముఖ్యం అనుకుంటే హోండా ష్లైన్ ఎంచుకోవచ్చు.

- హర్షన్ లాల్‌పేట్, ఆటోమొబైల్ నిపుణుడు

(మీకూ ఇలాంటి సందేహాలు, సమస్యలు ఉంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)

ప్లాటినా.. కొత్తగా

విడుదల

మంచి మైలేజీ, అందుబాటు ధర కోరుకునే వారు తప్పకుండా ప్రస్తావించే ద్విచక్రవాహనం బజాజ్ ప్లాటినా. 2019లో అప్‌డేటెడ్ వెర్షన్‌గా 'హెచ్-గేర్ 110' పేరుతో వచ్చేసింది. సాంకేతిక అంశాల్లో మార్పుల్లేకున్నా ఫీచర్లు, డిజైన్‌ని కొద్దిగా మార్చారు. ఆ వివరాలు.

ప్రత్యేకత: ముందుగా చెప్పుకోవాల్సింది అదనపు ఐదో గేరు గురించి. దీన్నే హైవే గేర్ అంటోంది బజాజ్. హైవేల్లో దూసుకెళ్లడానికి అనుకూలంగా రూపొందించామంటోంది. మూడు కొత్త రంగులు, స్పోర్ట్స్ రిఫ్రెష్ గ్రాఫిక్స్‌తో వచ్చింది. సెమీ డిజిటల్, సెమీ అనలాగ్ స్పీడో మీటర్ ఆకర్షణీయంగా ఉంది.

ఫీచర్లు: యాంటీ స్కిడ్ బ్రేకింగ్ సిస్టమ్ అమర్చారు. దీంతో ఏ బ్రేక్ వేసినా శక్తి రెండు చక్రాలపై సమానంగా పడేలా చేసి బైక్ స్కిడ్ కాకుండా కాపాడుతుంది. దృఢమైన ఫ్రేమ్‌లు జారీయ రహదారులు, ఆఫ్‌రోడ్లపై కూడా స్థిరమైన ప్రయాణ అనుభూతినిస్తాయి. ట్యూబ్‌లెస్ టైర్లు, కొత్త డెకల్స్‌తో కూడిన ప్లాటినా త్రీడీ లోగో, స్లిచ్ లైన్ సీటు.. ఇతర చెప్పుకోదగ్గ ఫీచర్లు. నలుపు రంగు మీద బ్లూ డెకల్స్, నలుపు మీద బర్గండీ గ్రాఫిక్‌లు, వైన్ రెడ్.. మూడూ అదనంగా వచ్చిన రంగులు.

ఇంజిన్: 115సీసీ, ఎయిర్‌కూల్డ్ డీటీఎస్-ఐ

పవర్: 8.6హెచ్‌పీ ఎట్ 7000

ఇంధన సామర్థ్యం: 11లీటర్లు

ముందు బ్రేక్: 240 ఎంఎం డిస్క్

వెనక బ్రేక్: 110 డ్రమ్ విత్ సీబీఎస్

మైలేజీ: 85కిమీ/లీ

ఎక్స్ షోరూం ధర: రూ.53వేలు (డ్రమ్ బ్రేక్), రూ.55వేలు (డిస్క్ బ్రేక్)

ఎంతదూరమైనా పట్టేస్తుంది

బెరా

భారతీయ రోడ్లపై ప్రమాదాలు నిత్యకృత్యం. అత్యధిక వేగమే ఎక్కువ ప్రమాదాలకు హేతువు. వీటిని ఆపేందుకు ప్రభుత్వం, పోలీసులు ఎన్నో నిబంధనలు విధిస్తున్నారు. నిర్ణీత వేగంతో వెళ్లాలని హెచ్చరిస్తున్నారు. అయినా ఉల్లంఘనులు పట్టించుకుంటేగా! అలాంటి వారికి ముకుతాడు వేయడానికి పోలీసులు స్పీడ్‌గన్, స్పీడ్ ట్రాప్ కెమెరాలతో వాహన వేగాన్ని కొలిచి జరిమానాలు వేయడం మామూలే. ప్రస్తుతం ఉన్న ఈ స్పీడ్‌గన్‌లు కొంతదూరమే పని చేస్తాయి. పోలీసుల్ని చూసిన వాహనదారులు వేగాన్ని తగ్గించి, వాళ్లని దాటగానే వేగం పెంచడం పరిపాటైంది. ఇలా కళ్లుగప్పే వారిని సైతం పట్టేయడానికి గుజరాత్ పోలీసులు హైటెక్ లేజర్ స్పీడ్ గన్‌లు ప్రవేశపెట్టారు. ఇవి ఎంత పవర్‌ఫుల్ అంటే మార్గం స్పష్టంగా ఉన్నపుడు కిలోమీటరు దూరంలో ఉండే వాహనం కూడా ఎంత వేగంతో వెళ్తుందో కచ్చితంగా లెక్కగట్టగలదు. అంతేకాదు అంతర్జాలం సాయంతో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలాన్లు కూడా పంపిస్తారు. ఈ తరహా లేజర్ టెక్నాలజీ ఉపయోగించడం భారత్‌లో ఇదే మొదటిసారి.

ఈనాడు సినిమా

వెంకటేష్, నాగచైతన్య

కల నిజమవుతున్న వేళ

"మా కుటుంబంలోని కథానాయకులందరినీ కలిపి ఓ సినిమాని నిర్మించాలని ఉంద"ని డి.రామానాయుడు చెప్పేవారు. అందుకోసం కథలు కూడా వినేవారు. కానీ ఆ కల నెరవేరకుండానే ఆయన దూరమయ్యారు. తన తండ్రి కల సాకారమయ్యేలా డి.సురేష్ బాబు తన సోదరుడు వెంకటేష్, మేనల్లుడు నాగచైతన్య కథానాయకులుగా 'వెంకీ మామ' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. పాయల్ రాజ్‌పుత్, రాశీ ఖన్నా కథానాయికలు. ప్రస్తుతం కశ్మీర్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. గురువారం రామానాయుడు జయంతి. ఈ సందర్భంగా చిత్రంలోని స్టిల్‌ని విడుదల చేసింది చిత్ర బృందం. 'మీ తనయుడు, మనవడు కలిసి తెరపై కనిపిస్తే చూడాలన్నది మీ కల. అది నిజమవుతున్న ఈ క్షణాల్లో, మిమ్మల్ని ఇదివరకటి కంటే ఎక్కువగా మిస్ అవుతున్నాం" అంటూ డి.సురేష్‌బాబు పోస్టర్‌ని విడుదల చేశారు. 'ఇది మీ కోసమే తాతా!' అంటూ రామానాయుడుని గుర్తు చేసుకుంటూ ట్వీట్ చేశారు నాగచైతన్య. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా సెప్టెంబరులో విడుదల కానుంది. సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి.

అనుపమ పరమేశ్వరన్

ఆ సంతృప్తి ఒకట్రెండు రోజులే

"నా వయసుకి తగ్గ పాత్రలు పోషించానేమో కానీ.. అచ్చంగా నా వ్యక్తిత్వాన్ని పోలిన పాత్రలు మాత్రం ఇప్పటిదాకా రాలేద"ని చెబుతోంది అనుపమ పరమేశ్వరన్. చేసింది తక్కువ సినిమాలే అయినా దక్షిణాదిలోని నాలుగు భాషల్లో అవకాశాలు అందుకున్న ఘనత అనుపమ సొంతం. తొలి అడుగుల్లోనే తెలుగు నేర్చుకొన్న ఈమె ప్రస్తుతం 'రాక్షసుడు' చిత్రం చేస్తోంది. తెరపై మిమ్మల్ని మీరు చూసుకుంటున్నప్పుడు ఎలాంటి ఆలోచనలు వస్తుంటాయని అడిగితే... "నా సినిమాల్ని నేను ఆస్వాదించడం కంటే, నా నటనలో తప్పుల్ని వెతకడంపై దృష్టి మళ్లుతుంది. నటన విషయంలో ఒక పట్టాన సంతృప్తి చెందని రకం నేను. చాలా బాగా చేశాననిపించినా ఆ సంతృప్తి ఒకట్రెండు రోజులే ఉంటుంది. ఆ తర్వాత ఇంకా బాగా చేయాల్సిందే అనిపిస్తుంది. నటులకి అలా అనిపించడం మంచిదే అని విన్నా" అంటోంది అనుపమ. మిమ్మల్ని పోలిన పాత్ర వస్తే ఆనందమా లేక కొత్త పాత్రలు చేయడాన్ని ఆస్వాదిస్తారా అని అడిగితే... "ఆ రెండు రకాల పాత్రల్లోనూ సవాళ్లుంటాయి. కానీ భిన్నమైన వ్యక్తిత్వాల గురించి తెలుసుకుంటూ, ఆ పాత్రల్లో ఒదిగిపోవడమే ఎక్కువ ఇష్టం" అని చెప్పింది అనుపమ.

శివాత్మిక, ఆనంద్ దేవరకొండ

మేడలో దొరసాని

ఒక పేదింటి కుర్రాడు రాజు. మేడల మధ్య పుట్టి పెరిగిన దొరసాని లాంటి అమ్మాయి దేవకి. ఈ ఇద్దరి ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమే 'దొరసాని'. విజయ్ దేవరకొండ సోదరుడు ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా పరిచయమవుతున్నారు. ప్రముఖ కథా నాయకుడు రాజశేఖర్ కుమార్తె శివాత్మిక కథానాయికగా పరిచయం అవుతోంది. కె.వి.ఆర్.మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. మధుర శ్రీధర్‌రెడ్డి, యశ్ రంగినేని నిర్మాతలు. డి.సురేష్‌బాబు సమర్పిస్తున్నారు. ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు జయంతి సందర్భంగా డి.సురేష్‌బాబు గురువారం టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మహేంద్ర చిత్రాన్ని చాలా బాగా తీర్చిదిద్దాడు. 'దొరసాని' గుర్తుండిపోయే చిత్రమవుతుంది. మనసుకి హత్తుకునేలా నాయకానాయికలు కనిపిస్తారు" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "స్వచ్ఛత, నిజాయతీతో కూడిన చిత్రమిది. పది కాలాలు నిలిచిపోయే ప్రేమకథ ఇందులో ఉంది" అన్నారు. "కొత్త దర్శకులకి ఒక స్ఫూర్తి పాఠంగా నిలుస్తుంది ఈ చిత్రం. క్రమశిక్షణ, దార్శనికత, మంచితనంలో మార్గదర్శకులుగా నిలిచిన డి.రామానాయుడు జయంతి సందర్భంగా మా సినిమా టీజర్ విడుదల కావడం ఆనందంగా ఉంది" అన్నారు మధుర శ్రీధర్‌రెడ్డి.

డి.రామానాయుడు విగ్రహావిష్కరణ వేడుకలో అది శేషగిరిరావు, సురేష్ బాబు, కె.రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, ప్రతాని రామకృష్ణగౌడ్

నిర్మాతల్లో హీరో డి.రామానాయుడు

– పరుచూరి బ్రదర్స్

"నిర్మాతగా డి.రామానాయుడు మా అందరికీ మార్గదర్శి. ఆయనకి ఎవరూ సరిలేరు, సరిరారు" అన్నారు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్. గురువారం శతాధిక చిత్రాల నిర్మాత, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత అయిన డి.రామానాయుడు జయంతి. ఈ సందర్భంగా ఫిలింనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాన్ని చలన చిత్ర వాణిజ్య మండలి ఆవరణలో ఆవిష్కరించారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ "ఎంతోమంది నటులు, సాంకేతిక నిపుణుల్ని పరిశ్రమకి పరిచయం చేశారు డి.రామానాయుడు. అందులో నేను కూడా ఒకడిని. ఆయన నిర్మాణంలో నా తొలి సినిమాని చేయలేకపోయినా, వారి అబ్బాయి వెంకటేష్ తొలి సినిమాకి దర్శకత్వం చేసే అదృష్టం దక్కింది. డి.రామానాయుడు వారసత్వాన్ని నిర్మాణంలో సురేష్‌బాబు, నటనలో వెంకటేష్ నిలుపుతూ పేరు తెచ్చుకోవడం సంతోషకరం" అన్నారు. డి.సురేష్‌బాబు మాట్లాడుతూ "చాలా భావోద్వేగభరితమైన రోజు ఇది. నాన్నగారిని ఆదర్శంగా తీసుకుని నేను, నా సోదరుడు సినిమా రంగంలోనే ఉన్నాం. మా కుటుంబం యావత్తూ సినిమారంగంలోనే పరిశ్రమిస్తోంద"న్నారు. రమేష్‌ప్రసాద్ మాట్లాడుతూ "మాకు చెన్నై నుంచే రామానాయుడుగారితో అనుబంధం ఉంది. మహామనిషి. ఎందరికో సహాయ సహకారాలు అందించారు. ఆయన లాగా చేయడం మాలాంటివారి వల్ల కాదేమో!" అన్నారు. జి.ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ "చిత్రపరిశ్రమ కోసమే తపించిన నిర్మాత రామానాయుడు. ఫిలిం నగర్ ప్రాభవానికి నాంది పలికారు. చిత్ర పరిశ్రమాభివృద్ధికి కృషి చేశార"ని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ "డి.రామానాయుడు పేరు మీద ఉత్తమ నిర్మాత అవార్డును ప్రవేశపెట్టి ఏటా ఒక నిర్మాతకి పురస్కారం అందజేస్తాం" అన్నారు. పరుచూరి బ్రదర్స్ మాట్లాడుతూ "తొలిసారి ఇద్దరు హీరోలతో 'ముందడుగు' సినిమాని తీశారు రామానాయుడు. దానికి మేమే రచన చేశాం. నిర్మాతల్లో హీరో రామానాయుడు" అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "నా సినిమా విడుదలప్పుడు చాలా సాయం చేసేవారు రామానాయుడు. ఏ రంగంలో అయినా నెంబర్ వన్‌గా ఉండాలని ఆయన నాతో అనేవారు. అన్నట్టే ఆయన అలా ఉండేందుకు కృషి చేసి, అన్నిటా నెంబర్ వన్ అనిపించుకున్నార"న్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.నారాయణ, త్రికాల సత్యనారాయణ, అనిల్ సుంకర, బి.గోపాల్, కాజా సూర్య నారాయణ, గిరిబాబు, ముత్యాల రాందాసు, విజయచందర్, ప్రతాని రామకృష్ణ గౌడ్, దగ్గుబాటి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా చూశాక అమ్మను హత్తుకోవాలనిపించింది!

– సమంత

నందినిరెడ్డి, సమంత, తేజ

"మంచి సినిమాలు చేసినా, నటిగా రిటైరయ్యేలోగా పరిపూర్ణమైన హాస్య భరిత చిత్రం చేయగలనా అనే సందేహం వెంటాడేది. 'ఓ బేబీ' సినిమాతో ఆ కోరిక నెరవేరింది" అన్నారు సమంత అక్కినేని. ఆమె ప్రధాన పాత్రధారిగా, బి.వి. నందినిరెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. లక్ష్మి, రాజేంద్రప్రసాద్,రావు రమేష్, నాగశౌర్య, తేజ కీలక పాత్రధారులు. డి.సురేష్‌బాబు, సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యుమన్‌వూ థామస్ కిమ్ నిర్మాతలు. జులై 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చిత్ర బృందం మాట్లాడింది. "కామెడీని పండించడంలో రాజేంద్రప్రసాద్‌గారి నుంచి నేర్చుకొన్న మెలకువలు నాకు బాగా తోడ్పడ్డాయి.అనుభవజ్ఞురాలైన నటి లక్ష్మితో కలిసి తెరను పంచుకోవడం మంచి అనుభూతినిచ్చింది. చేస్తే మంచి సినిమాలు చేయాలి, లేదంటే ఇంట్లో కూర్చోవాలని నిర్ణయించుకొన్న దశలో... 'మహానటి', 'రంగస్థలం' లాంటి చిత్రాల్లో అవకాశం లభించింది. ఈ ఏడాది తమిళంలో 'సూపర్ డీలక్స్', తెలుగులో 'మజిలి' చేశా. ఈ వరసలో నేను చేసిన మరో మంచి చిత్రం 'ఓ బేబీ'. మానవ జీవితాల్ని స్పృశించే కథ ఇది. సురేష్ ప్రొడక్షన్స్‌తో పాటు మూడు సంస్థలు కలిసి నిర్మించాయి. 'ఈ సినిమా చూశావా? నీకేమనిపించింది' అని సురేష్‌బాబుగారు అడిగారు. దాంతో పదిసార్లు ఎడిటింగ్ గదికి వెళ్లి 'ఓ బేబి'ని చూశా. చూసిన ప్రతిసారీ మా అమ్మని గాఢంగా, ప్రేమతోహత్తుకోవాలనిపించింది. అమ్మ, నానమ్మలు ఇంటి కోసం త్యాగాలు చేయడం తప్ప, మనలాగా కలలు సాకారం చేసుకోవాలనే ఆశతో బతికేవారు కాదు. నటనతోపాటు కొత్త యాసలో సంభాషణలు పలకడం సవాల్‌గా అనిపించింది. ఈ సినిమా నా కెరీర్‌లోనే ప్రత్యేకం. నాగశౌర్య ప్రత్యేక పాత్రలో నటించారు" అన్నారు. సురేష్ బాబు మాట్లాడుతూ "కొరియాతో పాటు మరో ఏడు భాషల్లో రీమేక్ అయిన ఈ చిత్రం అన్నిచోట్లా విజయం అందుకొంది. ఈ సినిమాని చూసినప్పుడు ఇలాంటి కథలుంటాయా? అనిపిస్తుంది. కుటుంబవిలువలతో కూడిన కామెడీ ఈ సినిమాలోకనిపిస్తుంది" అన్నారు. నందినిరెడ్డి మాట్లాడుతూ "సమంత పాత్ర పలు ఛాయల్లో ఆసక్తికరంగా సాగుతుంది. లక్ష్మీభూపాల్ మాటలు, పాటలు చిత్రానికి ప్రాణం. మిక్కీ జె.మేయర్ చక్కటి సంగీతం అందించార"న్నారు. కార్యక్రమంలో లక్ష్మీభూపాల్, సునీత, తేజ, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

రవిశంకర్, వి.సముద్ర, సునీల్, శిరీష్ రెడ్డి, కార్తికేయ

పవన్ భావాలతో... 'జై సేన'

"పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ ఆయన రాజకీయ ఆశయాలకి సంబంధించింది. మా 'జై సేన' పవన్ భావాలకి సంబంధించిన అంశాలతో రూపొందిన చిత్రం" అన్నారు వి.సముద్ర. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'జైసేన'. శ్రీకాంత్, సునీల్, శ్రీ, పృథ్వీ, ప్రవీణ్, కార్తికేయ ప్రధాన పాత్రధారులుగా నటించారు. వి.సాయి అరుణ్‌కుమార్ నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సునీల్ ప్రచార చిత్రాల్ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "నా ప్రతి సినిమాలోనూ సామాజిక అంశాలు ఉన్నట్టుగానే ఇందులోనూ కొన్ని విషయాల్ని ప్రస్తావించాం. పవన్‌కల్యాణ్ భావాలతో పాటు ఆయన అభిమానులు చేసే మంచి పనుల్నీ ఇందులో చూపిస్తున్నాం. శ్రీకాంత్, సునీల్‌తో పాటు నలుగురు కొత్త కథానాయకులు ఇందులో నటించారు. వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. సునీల్ మాట్లాడుతూ "ఈ సినిమాకి కథే సూపర్‌స్టార్. నేను చాలా మంచి పాత్ర చేశా. ఇప్పటివరకు కామెడీ పాత్రల్లోనే ఎక్కువగా నటించా. ఇందులో నా నటనలో మరో కోణాన్ని చూస్తార"న్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రవిశంకర్, హరీష్, శిరీష్ రెడ్డి, గోపీ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ 30'

మాణిక్యాలను సానబెడతాడు

హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సూపర్ 30'. ప్రముఖ ఐఐటీ శిక్షకుడు ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. ఆయన కథను వికాస్ బహ్ల్ తెరపైకి తీసుకొస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఇందులో ఓ సాధారణ మధ్యతరగతి వ్యక్తిగా హృతిక్ అహర్యం, బిహారీ యాసలో ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితుల వల్ల శిక్షణ అందుకోలేక, ఐఐటీ లాంటి ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థుల దుస్థితిని ఇందులో చూపించారు. ఆ పరిస్థితిని మార్చడానికి నడుం బిగించిన గణిత అధ్యాపకుడైన ఆనంద్ ఉచిత శిక్షణ సంస్థను స్థాపిస్తాడు. మట్టిలో మాణిక్యాలాంటి ప్రతిభావంతులను ఎంచుకుని తన శిక్షణతో సానబెట్టడానికి సంకల్పిస్తాడు. ఆ క్రమంలో ఆతనికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయన్నది ఈ చిత్ర కథ. జులై 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.

'ఛపాక్'.. నా జీవితంలోనే విలువైన చిత్రం

– దీపికా పదుకొణె

విక్రాంత్, మేఘనా గుల్జార్, దీపికా పదుకొణె

యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవిత కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'ఛపాక్'. ప్రధాన పాత్రలో బాలీవుడ్ నాయిక దీపికా పదుకొణె నటిస్తోంది. వెండితెర ప్రపంచంలో అందాల తారగా వెలిగిపోతున్న తరుణంలో ఇలాంటి డీ గ్లామర్ పాత్ర చేయడంపై దీపికాకు ప్రశంసలు వెల్తువెత్తాయి. మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విక్రాంత్ మెస్సే, మేఘనా గుల్జార్‌లతో దిగిన ఫొటోను దీపికా సామాజిక మాధ్యమాల్లో పంచుకొంది. "ఛపాక్ నా జీవితంలో అత్యంత విలువైన చిత్రం. 2020లో మీ ముందుకు వస్తుంద"ని దీపిక పేర్కొంది.

'వండర్ ఉమన్ 1984'

సరికొత్త వండర్ ఉమన్

కథా నాయిక ప్రాధాన్యం ఉన్న సూపర్ హీరో చిత్రం 'వండర్ ఉమన్'. 2017లో వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మంచి వసూళ్లు రాబట్టింది. గాల్ గడట్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకి కొనసాగింపుగా 'వండర్ ఉమన్ 1984' వస్తోంది. పాటీ జెన్‌కిన్స్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. బంగారు రంగు సూట్‌లో గాల్ గడట్ ఆకట్టుకుంటోంది. తొలి చిత్రంలో వారియర్ ప్రిన్స్ డయానాగా గాల్ నటన, యాక్షన్ సన్నివేశాలు అలరించాయి. సీక్వెల్‌లో అంతకు మించిన సాహసాలుంటాయని చిత్రాన్ని నిర్మిస్తున్న వార్నర్ బ్రదర్స్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది.

తల్లి కోసం తపన

తేజస్విని, సుమన్‌బాబు, అనిల్ రావిపూడి, రాజేంద్రప్రసాద్

'మహానటి'తో పేరు తెచ్చుకున్న బేబి సాయి తేజస్విని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎర్రచీర'. శ్రీరామ్, కమల్ కామరాజు, కారుణ్య ఇతర కీలక పాత్రధారులు. చెరువుపల్లి సుమన్‌బాబు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడి టీజర్‌ని విడుదల చేశారు. నటుడు రాజేంద్రప్రసాద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ "హారర్ కోణం కనిపిస్తున్నా... తల్లి కోసం ఓ చిన్నారి పడే తపన ఈ చిత్రానికి ప్రధాన బలం. సాయితేజస్విని బాగా నటించింది" అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఇలాంటి చిన్నసినిమాలు విజయాల్ని అందుకుంటేనే మాలాంటి వారికి అవకాశాలు వస్తాయి"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇది హారర్ సినిమా కాదు. అక్కడక్కడ కొన్ని సన్నివేశాలే ఆ భావన కలిగిస్తాయి. తల్లి బంధం చుట్టూ సాగే ఈ చిత్రం, ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. సాయి తేజస్విని నటన ఆకట్టుకుంటుంది" అన్నారు. కమల్ కామరాజు, గీతాసింగ్, ప్రమోద్ పులిగిల్ల, గోపి, తోట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

ఆహ్లాదకరమైన లేలేత రంగులు, ఆకట్టుకునే ప్రింట్లు ఏ వయసు వారికైనా బాగుంటాయి. అన్ని సందర్భాలకూ అనువుగా ఉంటాయి. అలా ఖ్వాబీదా పేరుతో కనువిందు చేస్తోన్న కుర్తీల కలెక్షన్ ఇది.

ఖ్వాబీదా కళ తెచ్చింది!

నగలు, దుస్తులు: KALANJALI® www.kalanjali.com www.facebook.com/kalanjaliworld

◆ ఈ దుస్తులు కళాంజలి అన్ని షోరూంలలో లభిస్తాయి.

ఫ్రెష్‌లుక్‌తో నయాగా కనిపించేలా చేస్తోన్న ఈ కుర్తీ కళగా ఉంది కదూ!

గులాబీ వర్ణంలో ఆకట్టుకుంటోన్న ఈ ప్రింటెడ్ కుర్తీ... వేడుకల్లో వైవిధ్యంగా కనిపించేలా చేస్తుంది.

ప్రింటెడ్ కుర్తా-పైజామా దానికి జతగా బ్లాక్‌ప్రింట్ జాకెట్ మేళవింపు వావ్ అనిపించడం ఖాయం.

వైవిధ్య వర్ణాల కలబోతతో కళగా కనిపిస్తోన్న ఈ కాటన్ కుర్తీ.... ఎవరికైనా ఇట్టే నప్పుతుంది.

పేస్టల్ రంగు ప్రింటెడ్ కుర్తీకి జతగా పలాజో అదుర్స్.

గులాబీ రంగు పూల ప్రింట్ల కుర్తా కొత్తదనాన్ని తెచ్చిపెడుతుంది.

ప్రకృతి ప్రేమికలకు ప్రతిష్ఠాత్మక పురస్కారం...

మనుషులం మాత్రమే బతకడం కాదు... మన చుట్టూ ఉన్న ప్రాణికోటి మనుగడ సాగించేలా చూడాలి. అప్పుడే భవిష్యత్తు తరాలు బాగుంటాయి. సరిగ్గా దీన్నే నమ్మిన ఈ మహిళలు మనమంతా మరిచిపోతోన్న పాత పంటలను పరిరక్షిస్తున్నారు. ప్రకృతి నుంచి తీసుకోవడమే కాదు తిరిగి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. మూడు దశాబ్దాలుగా వీరు చేస్తోన్న కృషిని మెచ్చి ఐక్యరాజ్యసమితి తాజాగా ప్రతిష్ఠాత్మక 'ఈక్వేటర్' అవార్డును వీరికి ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ మహిళలేం చేస్తున్నారో తెలుసుకుందాం!

జహీరాబాద్ ప్రాంతంలో ముప్పైఏళ్ల క్రితం డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) పురుడుపోసుకుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఆవిర్భవించిన ఈ సంస్థ ఇక్కడి మహిళల స్వయం ఉపాధిపై దృష్టిసారించింది. దాంతో నీటి వసతులు లేని ఈ ప్రాంతంలో పాత పంటలైన కొర్రలు, సామలు, తైదలు, అవిసెలు, జొన్నలు, సజ్జలు... వంటి వాటిని ఈ మహిళలతో సాగు చేయించడం మొదలుపెట్టింది. క్రమంగా ఏడు మండలాల పరిధిలో పదుచేలమందికి పైగా మహిళలు డీడీఎస్ అండతో ప్రకృతిని కాపాడే సైనికులుగా మారి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. విత్తన బ్యాంకులు ఏర్పాటు మొదలు సేంద్రీయ సాగు, అడవుల పెంపకంలాంటి పనులెన్నో ఈ మహిళలు నిర్వహిస్తున్నారు. ఇరవైఏళ్ల క్రితమే అల్లోల్ గ్రామంలో రత్నమ్మ అనే దళిత మహిళ తన తోటి మహిళలతో కలిసి అడవిని పెంచడం మొదలుపెట్టింది. ఇందుకుగాను వృక్షమిత్ర అవార్డును అందుకుంది. మరికొంతమంది విత్తన బ్యాంకులను ఏర్పాటు చేసుకొని దేశీయ విత్తనాలను కాపాడుతున్నారు. వీరంతా ఏటా సంక్రాంతి సమయంలో పాత పంటల జాతరను నిర్వహిస్తుంటారు. ఈ ప్రాంతంలోని ఎంపిక చేసిన గ్రామాల్లో ఎండ్ల బండ్లను ఊరేగిస్తూ, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, అవిసెలు.. వంటి పాత పంటలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను వివరిస్తారు. సాగుకోసం వీరే సొంతంగా ఎరువులు తయారు చేసుకుంటారు. వినియోగదారులు, రైతులు కలిసికట్టుగా సాగు చేసి పరస్పరం లబ్ధి పొందే కార్యక్రమానికీ సైతం వీరు శ్రీకారం చుట్టారు.

ప్రకృతితో మమేకమై జీవనం

వ్యవసాయం పేరుతో లాభాలకంటే ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళాసాధికారతే వీరికి ముఖ్యం. సాగు కోసం నేలను రసాయన ఎరువులతో గుల్ల చేయరు. సేంద్రియ సాగే ప్రధానం. విచ్చలవిడిగా రసాయనాలు వాడాల్సిన అవసరం ఉన్న పత్తి పంట జోలికి అసలే వెళ్లరు. పైగా పత్తి వద్దు.. చిరుధాన్యాల పంటలే ముద్దు అంటూ మిగిలిన రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. నేల సారవంతంగా ఉండేందుకు భిన్న రకాల పంటల్ని పండిస్తారు.. ఇలా పర్యావరణాన్ని కాపాడుతూ సుస్థిర అభివృద్ధి కోసం పాటుపడుతోన్న ఈ మహిళల పొరవను ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' గుర్తించింది. ఇటీవల 'ఈక్వేటర్' అవార్డును ప్రకటించింది. దీన్ని సెప్టెంబరు 24న న్యూయార్క్‌లో జరగనున్న కార్యక్రమంలో అందుకోనున్నారు. ఈసారి ప్రపంచవ్యాప్తంగా 20 సంస్థలకు ఈ అవార్డును ప్రకటించగా...మన దేశం నుంచి డీడీఎస్ ఆ జాబితాలో చోటు సంపాదించుకుంది. ఇప్పటి వరకు మన దేశానికి తొమ్మిది అవార్డులు దక్కగా... డీడీఎస్‌కు తాజాగా ప్రకటించిన అవార్డుతో కలిపి ఆ సంఖ్య 10కి చేరింది. ఇలాంటి మరో పదకొండు ప్రతిష్ఠాత్మక అవార్డులు ఇంతకుముందే అందుకుంది ఈ సంస్థ. అందరూ పత్తి పంట వేస్తే మరి పక్షులు తినడానికి గింజలెక్కడ దొరుకుతాయి? అందుకే మేం కొంత నష్టపోయినా చిరుధాన్యాల సాగును మాత్రం వదలం అంటూ ఇక్కడి మహిళలు ముక్తకంఠంతో చెబుతుంటారు. ప్రకృతి, ఇతర జీవరాసులపై వీరికి ఉన్న ప్రేమను చెప్పడానికి ఈ మాటలు చాలు.

ఉపరాష్ట్రపతి అభినందనలు

'ఈక్వేటర్' అవార్డు ప్రకటించిన సందర్భంగా వీరికి అభినందనలు తెలుపుతూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గురువారం అయిదు ట్వీట్లు చేశారు. పాతతరం ప్రాంతీయ పంటలను ఈ తరానికి అందించే ప్రయత్నం చేస్తూ ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం 'ఈక్వేటర్' అవార్డు అందుకున్న డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఔత్సాహిక మహిళా బృందానికి అభినందనలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. సంఘం అర్గానిక్స్ ద్వారా ఎంతో మంది మహిళలను సాధికారత దిశగా నడపడం, నాటి పంటలను ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ప్రకృతి సిద్ధమైన విధానాల ద్వారా వాతావరణ మార్పులకు చక్కని పరిష్కారం చూపవచ్చనేందుకు వీరే గొప్ప ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

- రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి

ఏ రంగు వేసుకోవచ్చు?

నాకు ఇరవై ఎనిమిదేళ్లు. ఈ మధ్య తలలో అక్కడక్కడా జుట్టు నెరుస్తోంది. అది కనిపించకుండా రంగు వేసుకోవాలనుకుంటున్నా. ఎలాంటి రకాల్ని ఎంచుకోవచ్చు?

– ఓ సోదరి

ఈ రోజుల్లో మార్కెట్లో రకరకాల హెయిర్‌డైలు దొరుకుతున్నాయి. పూర్తిగా నెరిసిన వారే కాకుండా ఫ్యాషన్ పేరుతో చిన్న పిల్లలు కూడా వేసుకుంటున్నారు. కానీ వాటివల్ల చిన్నచిన్న దుష్ప్రభావాల మొదలుకుని ప్రాణహాని వరకూ ఉండొచ్చు. అందుకే సరైన వాటిని ఎంచుకోవాలి. అలాంటివాటిల్లో మొదట చెప్పుకోవాల్సింది పర్మనెంట్ హెయిర్ డై. దీన్ని పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ అన్ని వయసుల వారు ఎంచుకుంటున్నారు. పార్లర్‌లోనూ దీన్నే సూచిస్తారు. ఒకసారి తలకు వేస్తే... ఎనిమిది వారాల వరకూ ఉంటుంది. పైగా రకరకాల రంగుల్లోనూ దొరుకుతోంది. ఇందులో అమోనియా పెరాక్సైడ్ చాలా ఎక్కువ మోతాదులో ఉంటుంది. రంగు తలలోకి వెళ్తుంది. ఫలితంగా జుట్టు విపరీతంగా పొడిబారడం, చిట్లిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. మరో రకం సెమీ పర్మనెంట్...దీన్ని పెద్దవాళ్లు ఎక్కువగా వేసుకుంటారు. ఇది అరువారాల పాటు ఉంటుంది. ఈ రకాల్లోనూ అమోనియా ఉంటుంది కానీ... గాఢత కొద్దిగా తక్కువ. అయినప్పటికీ జుట్టుకు హాని కలుగుతుంది. ఇక, తాత్కాలిక రంగు ఒక రోజు వేడుకలకు ఉపయోగపడుతుంది. తల స్నానం చేసిన వెంటనే రంగు పోతుంది. ఈ ప్రయత్నం వల్ల జుట్టు బలహీనంగా మారుతుంది. ఇక రంగులు ఏవయినా సరే... అమోనియా ఉంటే మంట పుట్టడం, తల చర్మం ఎర్రగా మారడం, జుట్టు పొడిబారడం, రాలడం, చిట్లిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కొన్నిసార్లు విపరీతంగా దురద పుడుతుంది. బొబ్బలూ రావొచ్చు. కళ్లు, పెదాల వాపు వస్తాయి. కొందరికి పిగ్మెంటేషన్ వస్తుంది. తలకు రంగు ఎంచుకునేటప్పుడు అమోనియా లేని, మోనో ఇథనాలమైన్ ఉన్నది వాడాలి. ఇలాంటి సమస్యలేవీ వద్దనుకుంటే హెన్నా పెట్టుకోవచ్చు. అదీ కాదంటే... బీట్‌రూట్ రసం మూడువంతులు, ఒక వంతు క్యారెట్ రసం కలిపి తలకు రాసుకుని గంటయ్యాక కడిగేయాలి. అలాగే కాఫీ డికాక్షన్‌లో బీట్‌రూట్ రసం కలిపి రాసుకుని గంట తరువాత కడిగినా మంచిది. ఆర్గానిక్ హెయిర్‌డైలు వాడొచ్చు. దుష్ప్రభావాలు తగ్గుతాయి. ఉబ్బసం, సొరియాసిస్, ఎగ్జిమా ఉన్నవారు, గర్భిణులు బయట దొరికే రంగులు వాడకూడదు. క్యాన్సర్ రావొచ్చు. రంగువల్ల అలర్జీ వస్తే వెంటనే కడిగేసి డాక్టర్‌ని సంప్రదించడం మేలు.

డియర్ వసుంధర



డా. శైలజ సూరపనేని
బ్యూటీ ఫ్యాషన్ ఫిజీషియన్

– మీ సందేహాలను vasubeauty@eenadu.net కు పంపించగలరు.

నజరానా

మనీప్లాంట్, వాటర్‌లిల్లీ వంటి కొన్ని మొక్కల్ని నీళ్లల్లో పెంచుతాం. ఆ నీళ్లు నాచు పట్టకుండా ఉండాలంటే రెండు బొగ్గుముక్కల్ని అందులో వేస్తే సరి..!

బంగారం వెండి

6న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,122	3,116
వెండి (గ్రా)	40.10	40.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,760	-------	33,730	-------	33,550	33,450	33,740	33,550	33,500	33,500
ఆర్నమెంట్	31,530	-------	31,250	-------	33,930	33,810	31,270	31,160	31,160	31,160
వెండి(కిలో)	38,480	-------	38,300	-------	37,900	37,700	38,100	37,800	38,000	38,000

చినుకు పడితే పుడమి పలమళిస్తుంది.. నీటి ముత్యాలతో రెమ్మలన్నీ మెరిసిపోతుంటాయి కొమ్మను కదిపితే చాలు.. చిరుజల్లు కురిసి తనువంతా తడిసిపోతుంది. ఈ అనుభవం ఇంటి వాకిట్లో ఎదురైతేనే మనసు పులకించిపోతే.. మేఘాలను ముద్దాడే కొండ కొనల్లో తారసపడితే ఇంకెలా ఉంటుందో ఊహించుకోండి. అందుకే, రుతురాగాలు మొదలవుతున్న వేళ.. ఆనందపు శిఖరాలకు చేరుకోండి.. వానజల్లులో కేరింతలు కొడుతూ.. వరుణ సందేశాన్ని అందుకోండి.

వనంలో వాలిపోదాం | వాల్పరాయ్, తమిళనాడు

తమిళనాడులోని అన్నామలై కొండల్లో ఉన్న అందమైన ప్రాంతం వాల్పరాయ్. ఇది కోయంబత్తూరు జిల్లాలో అన్నామలై టైగర్ రిజర్వ్‌లో భాగమై ఉంది. సముద్ర మట్టానికి 3,500 అడుగుల ఎత్తులో ఉన్న వాల్పరాయ్‌కి ఏడాది పొడవునా పర్యాటకుల తాకిడి ఉంటుంది. దట్టమైన అడవి, ఎటు చూసినా కొండలు, కాఫీ, తేయాకు తోటలతో అలరించే ఈ ప్రాంతం.. తొలకరి వేళ మరింత అద్భుతంగా దర్శనమిస్తుంది. కూజంగల్ నది జోరు, చిన్న చిన్న జలపాతాల హోరు ప్రకృతిగీతాన్ని వినిపిస్తాయి. ఏనుగులు, జింకలు, నెమళ్లు, రకరకాల పక్షులు జీవవైవిధ్యాన్ని కళ్లముందుంచుతాయి.

చూడాల్సినవి:

- వాల్పరాయ్‌కి 60 కిలోమీటర్ల దూరంలో ప్రముఖ షూటింగ్ లొకేషన్ పొల్లాచి ఉంటుంది. ఇక్కడికి వెళ్లే దారి పంటపొలాలతో అద్భుతంగా ఉంటుంది. దారిలో మరపురాని మలుపులు ఎన్నో ఉంటాయి. ఈ మార్గంలోని ఆలియార్ డ్యామ్ సందర్శనీయ స్థలం.
- అన్నామలై పులుల సంరక్షణ కేంద్రం.. చూడాల్సిన ప్రదేశం. పులులు, చిరుతలు, ఏనుగులతో పాటు మరెన్నో జంతువులను ఇక్కడ చూడొచ్చు.

చేరుకునేదిలా: వాల్పరాయ్.. కోయంబత్తూరుకు 108 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి కోయంబత్తూరు రైళ్లున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పొల్లాచి మీదుగా వాల్పరాయ్ వెళ్లొచ్చు.



తొలకరిలో పులకించండి

జలపాతాల సిరి | సిర్సీ, కర్ణాటక

దేశంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కర్ణాటకలోని సిర్సీ ఒకటి. పడమటి కనుమల్లో, సముద్ర మట్టానికి 2,500 అడుగుల ఎత్తులో ఉంటుంది ప్రాంతం. ఉత్తర కన్నడ జిల్లాలో ఉన్న సిర్సీని 'జలపాతాల కేంద్రం'గా అభివర్ణిస్తారు. ఈ పట్టణానికి 40 కిలోమీటర్ల పరిధిలో పేరున్న జలపాతాలు పదికిపైగానే ఉన్నాయి. చిన్నాచితకా జలపాతాలు కోకొల్లలు. నదులు, వాగులు, సెలయేళ్లు పర్యాటకులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతాయి. హుబ్లీ నుంచి సిర్సీకి వెళ్లే దారి పచ్చదనంతో కనువిందు చేస్తుంది. దారిపొడవునా జింకల గుంపులు, నెమళ్ల గెంతులు చూడొచ్చు. కారుమబ్బులు కమ్ముకొచ్చిన వేళ.. కొండల మీదుగా చల్లని గాలులు వీస్తుండగా.. సిర్సీ అందాలు రెట్టింపవుతాయి. రెండు రోజులు ఉండగలిగితే.. ఈ పర్యాటక కేంద్రం చుట్టుపక్కల విశేషాలన్నీ చూసి రావొచ్చు.

చేరుకునేదిలా: సిర్సీ.. హుబ్లీ నుంచి 105 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి హుబ్లీ వరకు రైళ్లో వెళ్లాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిర్సీ చేరుకోవచ్చు.

చూడాల్సినవి

- 16వ శతాబ్దంలో నిర్మించిన మరికాంబ దేవాలయం చూడదగినది. ఇక్కడి అమ్మవారి విగ్రహం కలపతో చేసినది కావడం విశేషం. ఇక్కడికి సమీపంలో గణపతి గుడి ఉంటుంది.
- 381 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఉంచల్లీ జలపాతం అద్భుతంగా ఉంటుంది. ఏ కాలంలో అయినా కనువిందు చేస్తుంది. బ్రిటిష్ అధికారి లిషింగ్టన్ గుర్తించడంతో దీనిని ఆయన పేరుతో పిలుస్తారు.
- సిర్సీ పరిసరాల్లో ఉన్న మరో అద్భుత సహస్రలింగ క్షేత్రం. శాలమల నది ప్రవాహంలో వెయ్యికిపైగా లింగాలు కనిపిస్తాయి. ప్రతి లింగానికి ముందు నందిని కూడా చూడొచ్చు.
- సిర్సీకి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న మనోహరమైన ప్రదేశం యాణ. విభూతి జలపాతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. పచ్చని వృక్షాల మధ్య ఆకాశాన్నంటుతున్నాయా అన్నట్టుండే రాతి పర్వతాలు.. విచిత్రాకృతుల్లో ఆశ్చర్యం కలిగిస్తాయి.

మేఘ సందేశం

మధ్యభారతంలోని వింధ్య, సాత్పురా, మైకాల్ పర్వతాలు కలిసే చోటున్న అమర్‌కంటక్ వర్షాకాల విడిదిగా పేరొందింది. వనసీమలో ఉన్న ఈ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం తొలకరి రాకతో సుందరంగా మారిపోతుంది. మధ్యప్రదేశ్ అనూప్‌పుర్ జిల్లా కేంద్రానికి 85 కి.మీ. దూరంలో ఉంటుంది. తీర్థరాజంగా పేరున్న అమర్‌కంటక్ నర్మదా నదికి పుట్టినిల్లు. నర్మద ఉద్గమ స్థానంలో మందిరం ఉంది. పరిసరాల్లో ఆలయాలు ఎన్నో ఉన్నాయి. చుట్టూ ఉన్న వనంలో కపిలధార, దూద్‌ధార వంటి జలపాతాలను చూడొచ్చు.

మూడు గిరుల మధ్య | అమర్‌కంటక్, మధ్యప్రదేశ్

చేరుకునేదిలా: హైదరాబాద్ నుంచి జబల్‌పూర్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అమర్‌కంటక్ (228 కి.మీ.) చేరుకోవచ్చు.

- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి బిలాస్‌పూర్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి పెండ్రారోడ్ (105 కి.మీ.) వరకు రైలులో వెళ్లాలి. పెండ్రారోడ్ నుంచి బస్సులు, ట్యాక్సీల్లో అమర్‌కంటక్ (32 కి.మీ.) చేరుకోవచ్చు.

అమర్‌కంటక్ సందర్శనకు మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ హైదరాబాద్ నుంచి మూడు రోజుల ప్యాకేజీ నిర్వహిస్తోంది. హైదరాబాద్ నుంచి జబల్‌పూర్ వరకు విమానంలో తీసుకెళ్తారు. అక్కడి నుంచి ఏసీ వాహనంలో యాత్ర కొనసాగుతుంది.

ప్యాకేజీ ధర: రూ. 7,350 (ఒక్కరికి)

మరిన్ని వివరాలకు 98660 69000 నెంబర్‌ను సంప్రదించండి.

మనసు వేగం పెరగనీ | వేగమాన్, కేరళ

కేరళను తాకే దాకా దోబూచులాడే రుతుపవనాలు.. మలయాళసీమను చేరగానే ఊపందుకుంటాయి. వనాలతో నిండి ఉన్న కేరళ.. మేఘాలను ఆగమేఘాల మీద ముందుకు నడిపిస్తాయి. అలా రుతురాగాల వేగాన్ని పెంచే ప్రదేశాల్లో ఒకటి వేగమాన్. ఎర్నాకులం, ఇడుక్కి సరిహద్దుల్లో, పశ్చిమ కనుమల్లో ఉండే ఈ ప్రాంతం.. కేరళ సౌందర్యానికి పట్టుగొమ్మలా కనిపిస్తుంది. కొండల మధ్య, సముద్ర మట్టానికి 3,400 అడుగుల ఎత్తులో ఉంటుంది. కొండవాలులో కాఫీ, తేయాకు తోటలు విస్తారంగా ఉంటాయి. వాటి మధ్యలో వంకలు తిరిగిన దారి.. కొత్త ఉత్సాహాన్నిస్తుంది. మరోవైపు పైన్ చెట్ల బారులు, చిన్నచిన్న జలపాతాలు పలకరిస్తూ ఉంటాయి. అందుకే వేగమాన్ చేరుకోగానే మనసు వేగం పెరుగుతుంది. కొండలన్నీ చకచకా ఎక్కేయాలనిపిస్తుంటుంది.

చూడాల్సినవి:

- వేగమాన్ సమీపంలో మూడు పర్వతాలున్నాయి. వీటి పేర్లు తంగల్, మురుగన్, కురిసుమాల. ఈ మూడు గిరులపై మూడు మతాలకు చెందిన మందిరాలు దర్శనమిస్తాయి. తంగల్ పర్వతంపై ఓ దర్గా ఉంది. మురుగన్ కొండపై సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంటుంది. కురిసుమాల పర్వతంపై చర్చిని చూడొచ్చు.
- వేగమాన్‌లో బోలెడన్ని రిసార్టులు ఉన్నాయి. కొండల్లో క్యాంప్‌లు కూడా నిర్వహిస్తుంటారు. ఇక్కడికి సమీపంలో నాలుగైదు జలపాతాలు. సన్‌రైజ్, సన్‌సెట్ వ్యూ పాయింట్లు ఉన్నాయి. ట్యాక్సీలో వెళ్లొచ్చు. ట్రెక్కింగ్ పాయింట్లూ బోలెడున్నాయి.

చేరుకునేదిలా: వేగమాన్.. కొట్టాయం నుంచి 66 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి కొట్టాయం వరకు రైళ్లున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వేగమాన్ చేరుకోవచ్చు.

లెట్స్ గో

అటు వారణాసి.. ఇటు హంపి..

ఆధ్యాత్మిక, చారిత్రక ప్రియుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) రెండు పర్యటనలు నిర్వహిస్తోంది. వారణాసి, హంపి ప్యాకేజీలు ప్రకటించింది. ఆ వివరాలివి..

గంగ గయ సంగమ యాత్ర

ఎన్ని రోజులు: 4 రాత్రులు-5 పగళ్లు

ఎప్పుడంటే: ఆగస్టు 11

హైదరాబాద్ నుంచి విమానంలో పట్నా వరకు తీసుకువెళ్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణం కొనసాగుతుంది.

చూపించేవి: పట్నా, బోధ్‌గయా, వారణాసి, సారనాథ్, ప్రయాగ్‌రాజ్

ధర: రూ. 18,510 నుంచి (పెద్దలకు), రూ. 14,620 (5-11 సం॥ పిల్లలకు)

హెరిటేజ్ హంపి

ఎన్ని రోజులు: 3 రాత్రులు-4 పగళ్లు

ఎప్పుడంటే: ఆగస్టు 9

హైదరాబాద్ నుంచి బళ్లారి వరకు విమానం ప్రయాణం. అక్కడి నుంచి యాత్రా స్థలాలన్నీ ఏసీ వాహనంలో తిప్పి చూపిస్తారు. తిరిగి బళ్లారి నుంచి హైదరాబాద్‌కు విమానంలో తీసుకొస్తారు.

చూపించేవి: హంపి, బాదామి, ఏహోళ్, పట్టదకల్

ధర: రూ. 11,300 నుంచి (పెద్దలకు), రూ. 10,040 నుంచి (5-11 సం॥ పిల్లలకు).

సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు: 040-22702407, 96865 75202, 97013 60647, 97013 60701

మరిన్ని వివరాలకు.. www.irctc-tourism.com వెబ్‌సైట్‌ని చూడండి.

నయా ట్రెండ్

కడలి అంచున క్యాబ్

మెట్రో పర్యాటక కేంద్రాల్లో.. క్యాబ్ విహారం సర్వసాధారణం. ఇదే క్యాబ్ సేవలు నడి సంద్రంలో అందుబాటులోకి వస్తే! అందులోనూ సముద్ర గర్భంలో ఉబర్ ట్యాక్సీ ఉందంటే.. ఆశ్చర్యపడక తప్పదు. కానీ, ఆస్ట్రేలియాలో ఉబర్ సబ్‌మెరైన్ క్యాబ్‌లతో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. దీనికి స్కూబర్‌గా నామకరణం చేసింది. క్వీన్స్‌లాండ్ ద్వీపానికి వెళ్తే, స్కూబర్ సేవలు పొందవచ్చు. గ్రేట్ బారియర్ పగడపు దిబ్బల్లో తిరగొచ్చు. గత నెల 27న ప్రయోగాత్మకంగా మొదలైన చిట్టి సబ్‌మెరైన్ క్యాబ్ సర్వీసు ఈనెల 18 వరకు అందుబాటులో ఉండనుంది. ఇప్పటికైతే గ్లాస్టోన్ తీరం నుంచి మెరైన్ క్యాబ్‌లు దూసుకుపోతున్నాయి. త్వరలోనే పోర్ట్ డుగ్లాస్ తీరంలోనూ స్కూబర్ అందుబాటులోకి రానుంది. స్కూబర్‌లో విహరించాలంటే 2068 ఆస్ట్రేలియన్ డాలర్లు చెల్లించాలి. కడలి గర్భంలో గంటపాటు ఎంచక్కా తిరిగేయొచ్చు.

అమ్మపల్లి రాముడు.. వెండితెర దేవుడు

హైదరాబాద్‌కు దగ్గర్లోనే ఉంటుంది అమ్మపల్లి. శంషాబాద్-షాబాద్ రహదారిలో ఉన్న చిన్న ఊరది. అక్కడో ఆలయం. తొమ్మిదిన్నర ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి కోవెల నయన మనోహరంగా ఉంటుంది. గాలి గోపురం నుంచి గర్భగుడి వరకు.. ఎక్కడ చూసినా శిల్పాలే! 11వ శతాబ్దిలో చాళుక్య రాజుల పాలనలో అమ్మపల్లి ఆలయం నిర్మితమైంది. ఇక్కడి గాలిగోపురం ఎనభై అడుగుల ఎత్తు ఉంటుంది. దీనిపై అడుగడుగునా వివిధ దేవతల విగ్రహాలు కళాత్మకంగా కనిపిస్తాయి. పురాణేతిహాసాలు శిల్పరూపంగా దర్శనమిస్తాయి.

ఆలయం తూర్పు, పడమర దిశల్లో బారీ కోనేరులుంటాయి. 20 అడుగుల లోతులో నేల మాళిగలను మరపించే నిర్మాణాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. కాలక్రమంలో పశ్చిమ దిశలో ఉన్న కోనేరు కనుమరుగైంది. అయితే తూర్పునున్న కోనేరును నేటికీ చూడొచ్చు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపం, పాతిక అడుగుల ఎత్తున్న రథ మంటపం, అశ్వశాలలు తదితర రాతి నిర్మాణాలు ఆలయ ప్రాశస్త్యానికి తలమానికంగా నిలుస్తాయి. ఎప్పుడో 17వ శతాబ్దిలో నిజాం నవాబుల కాలంలో ఆలయానికి మరమ్మతులు చేశారు. 1980 ప్రాంతంలో ఈ ఆలయం సినీజనాలను ఆకర్షించింది. అనతికాలంలోనే షూటింగ్ స్పాటయింది. ఇక్కడ షూటింగ్ జరిగిన చిత్రం తప్పక విజయం సాధిస్తుందని నమ్మేవారు. ఈ క్రమంలో తెలుగుతో పాటు తమిళం, హిందీ కలిపి 400కు పైగా సినిమాలు అమ్మపల్లిలో చిత్రీకరణ జరుపుకొన్నాయి. వరుస షూటింగ్‌లతో భక్తులకు ఇబ్బందులు కలగడంతో.. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిరసనల నేపథ్యంలో 2012 నుంచి ఇక్కడ షూటింగ్‌లకు స్వస్తి పలికారు. వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన అమ్మపల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తే.. అద్భుత పర్యాటక కేంద్రంగా నిలుస్తుంది.

– వెంకటేశ్, శంషాబాద్ (గ్రామీణ)

ఆ రాముడు అక్కడ పదకొండో శతాబ్దంలో కొలువుదీరాడు. భక్తుల పాలిట కొంగుబంగారమయ్యాడు. వెండితెరపై వందలాది సినిమాల్లో కనువిందు చేశాడు. ఇప్పుడు పర్యాటకులను అలరిస్తున్నాడు. ఈ రామకథ తెలుసుకోవాలంటే అమ్మపల్లిలో అపురూప శిల్పకళతో అలరారుతున్న ఆలయానికి వెళ్లాలి.



చేరుకునేదిలా: హైదరాబాద్ నుంచి శంషాబాద్‌కు వెళ్తే.. అక్కడి నుంచి కేవలం 6 కి.మీ. దూరంలో ఉంటుంది అమ్మపల్లి ఆలయం. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో చేరుకోవచ్చు. హైదరాబాద్ అఫ్జల్‌గంజ్, కోఠి ఉమెన్స్ కాలేజ్ నుంచి షాబాద్ వెళ్లే బస్సులు అమ్మపల్లి మీదుగా వెళ్తాయి.